thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 305 | కరీంనగర్ ఆదివారం, 11 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝూంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

# తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




న్యూఢిల్లీ : తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ఇవాళ న్యూఢిల్లీలోని అశోకా హెూటల్లో ప్రి బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

**బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ముఖ్యమైన అంశాలు:** తెలంగాణ ప్రభుత్వం తరపున, నా తరపున.. రాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఒక దేశం కేంద్ర-రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బడ్జెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నేను నమ్ముతున్నాను. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నాను. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది. రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి. రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను FRBM పరిమితుల నుంచి మినహాయించాలి. తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది. దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి. విద్య: హైదరాబాద్‌లో IIM ఏర్పాటును ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. విమానాశ్రయాలు: పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం దీనిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి. ఇతర నిధులు: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలి. సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.




### మాజీ ఐపీఎస్ భార్యను మోసగించిన సైబర్ కేటుగాళ్లు.. రూ.2.58 కోట్ల మోసం

హైదరాబాద్: సైబర్ కేటుగాళ్ల బారిన పడ్డ ఓ మాజీ ఐపీఎస్ అధికారి భార్య ఏకంగా రూ.2.58కోట్ల మేర నష్టపోయారు. తాజాగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట సైబర్ నేరగాళ్లు మోసానికి తెరలేపారు. ట్రేడింగ్‌లో చిట్కాల చెబుతామని మొదట వాట్సాప్ మెసేజ్ పంపించారు. తమ చిట్కాలు పాటిస్తే ట్రేడింగ్‌లో 500 శాతం లాభాలు వస్తాయని అన్నారు. సెబీ సర్టిఫైడ్ డాక్యుమెంట్స్ అంటూ కొన్ని నకిలీ కాపీలను కూడా చూపించారు. ఈ విషయాలపై అవగాహన లేకపోవడంతో ఆమె తన భర్త మొబైల్ నెంబర్‌ను వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేయించారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన బాధితురాలు భారీగా పెట్టుబడులు పెట్టారు. 19 లావాదేవీల్లో రూ.2.58 కోట్ల మేర బదిలీ చేశారు. ఆ తరువాత పెట్టుబడులను నిలిపివేయడంతో నిందితులు బెదిరింపులకు దిగారు. ఇన్వెస్ట్‌మెంట్స్‌ను నిలిపివేస్తే అప్పటివరకూ పెట్టిన పెట్టుబడి పోతుందని బెదిరించారు. ఈ క్రమంలో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు చివరకు పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

## ఆ రెండు పథకాలను ఈ నెల 12న ప్రారంభించనున్న సీఎం



హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతే లక్ష్యంగా మరో ముందడుగు వేస్తోంది. రాష్ట్రంలోని దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భాల భరోసా, ప్రణామం పథకాలను ఈ నెల 12న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం రూ. 50 కోట్లు కేటాయించింది. దీనిలో భాగంగా రూ. 43.22 కోట్ల విలువైన సహాయక పరికరాలను 7 వేల మంది అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు, మొబైల్ ఫోన్లు అందించనున్నారు. దివ్యాంగుల సహకార సంస్థ ఏర్పాటైన తర్వాత ఒకే ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో నిధులు కేటాయించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

**ప్రణామం- వృద్ధుల కోసం మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లు...** వృద్ధుల మానసిక ఉల్లాసం, సంరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 37 ప్రణామం డే కేర్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హన్మకొండ జిల్లాల్లో రెండేసి చొప్పున, మిగిలిన 29 జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేసే ఈ కేంద్రాల్లో లైబ్రరీ, ఇండోర్ గేమ్స్, టీవీ, ఇంటర్నెట్ సదుపాయంతో కూడిన కంప్యూటర్లు ఉంటాయి. లబ్ధిదారులకు ఉచితంగా స్నాక్స్ తో పాటు వేడి వేడి భోజనం అందిస్తారు. ప్రతి సెంటర్ ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 12.48 లక్షలు మంజూరు చేసింది.

**చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం బాల భరోసా:** ఐదేళ్ల లోపు చిన్నారుల్లో వైకల్యాలను ముందస్తుగా గుర్తించి, తగిన చికిత్స అందించడమే లక్ష్యంగా 'బాల భరోసా' పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.

అంగన్‌వాడీ టీచర్లు ప్రాథమిక స్క్రీనింగ్ నిర్వహిస్తారు. సమస్యలు ఉన్నట్లు గుర్తించిన పిల్లలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా ఆర్బీఎస్కే ద్వారా వైద్య పరీక్షలకు పంపిస్తారు. అవసరమైన పిల్లలకు ఉచితంగా శస్త్రచికిత్సలు, థెరపీ, పునరావాస సేవలను ప్రభుత్వం అందిస్తుంది. దీని ద్వారా వైకల్య రహిత తెలంగాణను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.




హైదరాబాద్: అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ మధ్య విమర్శలు ప్రతి విమర్శలు, కౌంటర్లు రీ కౌంటర్లతో తెలంగాణ పాలిటిక్స్ కాకరేపుతున్నాయి. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకున్న కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే జోరు చూపించాలని వ్యూహాలు రచిస్తోంది. మరోవైపు సర్పంచ్ ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్ కూడా పురపాలక ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది. పార్టీ గుర్తుతో జరిగే ఎన్నికలు కావడంతో మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా మూడు పార్టీలు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. త్వరలో జరగబోయే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని డిసైడ్ అయ్యింది. తెలంగాణలో జనసేన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ హైకమాండ్ ప్రకటించింది. ఈ మేరకు శనివారం (జనవరి 10) అధికారిక ప్రకటన విడుదల చేసింది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా కమిటీలు ఏర్పాటు చేయాలని జనసేన అగ్ర నాయకత్వం నిర్ణయించింది. మున్సిపల్ ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నందున ప్రతీ జనసైనికుడు, వీరమహిళ ఉత్సాహంగా ఎన్నికల ప్రచారానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. త్వరలో ఎన్నికల కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించింది. ఇప్పటికే మూడు పార్టీల మధ్య ట్రయాంగిల్ ఫైట్ నెలకొన్న వేళ జనసేన బరిలోకి దిగుతుండటంతో తెలంగాణ పాలిటిక్స్ మరింత రసవత్తరంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇస్తూ వస్తోన్న జనసేన.. ఈసారి ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకోవడం చర్చనీయాంశంగా మారింది. జనసేన ఎంట్రీతో ఓట్ బ్యాంక్ చీలి.. ఏదో ఒక పార్టీకి భారీ డ్యామేజ్ తప్పదంటున్నారు పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్.



### మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయం

హైదరాబాద్ : రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లో నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నేతల సమావేశంలో పార్టీ నేతలకు పురపాలక ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల పైన కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందన్నారు. రానున్న పురపాలక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెబుతారని.. పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ అన్నారు. రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఏ పట్టణానికి చెల్లించని ఏకైక ప్రభుత్వంగా చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో పట్టణాల్లో పరిపాలన పూర్తిగా పడకేసిందనౌపారిశుద్ధ్య నుంచి మొదలుకొని ప్రతి అంశంలో పట్టణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పించిఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదని కేటీఆర్ అన్నారు.




### సంక్రాంతి జోష్.. నగరంలో ట్రాఫిక్ రష్!

హైదరాబాద్, జనవరి 10: సంక్రాంతి పండుగ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో భాగ్యనగర పరిసర రహదారులన్నీ ట్రాఫిక్ జామ్‌తో కిటకిటలాడుతున్నాయి. నేడు రెండో శనివారం, రేపు ఆదివారం కావడంతో.. పండుగకు ముందే ప్రయాణికులు ఊర్లకు వెళ్తుండటమే ఈ రద్దీకి ప్రధాన కారణం. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై(NH-65) వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. మరీ ముఖ్యంగా ఓవైపు ఔటర్ రింగ్ రోడ్(ORR) వద్ద వాహనాలు బారులు తీరగా.. మరోవైపు పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఉదయం నుంచీ వెహికిల్స్ క్యూ కట్టాయి. పెద్ద కాపర్తి నుంచి వెలిమినేడు వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సాధారణంగా.. పంతంగి టోల్‌ప్లాజా మీదుగా రోజుకు సుమారు 35వేల నుంచి 40వేల వరకూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే.. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో శుక్రవారం ఒక్కరోజే సుమారు 65 వేల వెహికిల్స్ ఆ మార్గంలో పరుగులు పెట్టాయి. ఇక.. నేడు ఈ రద్దీ మరింత పెరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో వాహనాల రద్దీని నియంత్రించేందుకు టోల్‌ప్లాజా సిబ్బంది సహా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇంత పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ అవ్వడానికి ప్రధాన కారణాలు రోడ్డు ఇరుకుగా ఉండటం, సంక్రాంతి సందర్భంగా వాహనాల రద్దీ భారీగా పెరగడం. అదనంగా.. పెద్ద కాపర్తి దగ్గర జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులూ ట్రాఫిక్‌ను మరింత తీవ్రతరం చేశాయి. అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి రోడ్లు విస్తరించినప్పటికీ, పండుగ సీజన్ రద్దీ ముందు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. మరోవైపు.. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లోనూ వాహనాల రద్దీ పెరిగింది. హైవే సర్వీస్ రోడ్డుపై గుంతల కారణంగా వాహనదారులు నెమ్మదిగా రాకపోకలు సాగిస్తున్నారు. అటు.. ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే వాహనాలతో కీసర టోల్‌ప్లాజా కిటకిటలాడుతోంది.




హైదరాబాద్: సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేవారితో హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. శనివారం హైవేపై దారి పొడవునా వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని.. గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లో రద్దీ పెరిగింది. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక కూడళ్లు సందడిగా మారాయి. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మరోవైపు రైల్వేస్టేషన్లలో కూడా రద్దీ పెరిగింది.

**ప్రయాణికుల రద్దీ.. హైదరాబాద్-విజయవాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లు**.... సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్-విజయవాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లను (ఝఖఅనీఝతిఅ రాజూవఎఋఝశ్రీ ఁతీఝఋఅం 2026) ఏర్పాటు చేసినట్లు దక్షణ మధ్య రైల్వే ప్రకటించింది. ఛైర్ కార్, జనరల్ బోగీలతో నడిచే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. పండగకు ముందు, తర్వాతి రోజుల్లో ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ఈ నెల 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం 6.10 గంటలకు హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రత్యేక రైళ్లు, ఈ నెల 10, 11, 12, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2.40 గంటలకు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లు. ఛైర్ కార్ బోగీల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకునే సదుపాయం కల్పించారు. రిజర్వేషన్ చేసుకోని వారి కోసం రైలులో సగానికి పైగా జనరల్ బోగీల ఏర్పాటు.




## పండుగ పేరుతో ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ

సాధారణంగా తిరుగు ప్రయాణంలో చార్జీల మోత ఉంటుంది. ఈసారి ఆర్టీసీ సర్వీసులు తక్కువ నడపడం, వచ్చే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడం, డిమాండ్‌కు అనుగుణంగా రైళ్లు నడవకపోవడంతో ప్రైవేట్ ఆపరేటర్ల వంట అ0డింది. స్పెషల్ పేరుతో అయిన కాడికి దోచేస్తున్నారు. సాధారణ రోజుల్లో నరసాపురం నుంచి స్లీపర్ ధర రూ. 1,500, సీటు రూ. 700 ఉంటుంది. స్పెషల్స్ పేరిట ఆపరేటర్లు ఏసీ బస్సు స్లీపర్‌కు రూ. 3వేల నుంచి రూ. 3500 వరకు వసూలు చేస్తున్నారు. సీటు అయితే రూ. 1500 నుంచి రూ. 2 వేల వరకు దోచుకుంటున్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు ప్రాంతాలకు దాదాపు కాస్త అటూ ఇటూగా టిక్కెట్ ధరలకు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు తదితర ప్రాంతాలకు లగ్జరీ ప్రైవేటు బస్సు టిక్కెట్ ధర రూ. 1000 నుంచి రూ. 1200లోపు ఉండగా పండుగ సీజన్లో రూ. 2,500 నుంచి 3,000 వరకు వసూలు చేస్తున్నారు. ఓ కుటుంబంలో నలుగురు పండుగకు ఊరు వెళ్లాలంటే కేవలం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు టికెట్లకే రూ. 12,000 అవుతుంది. పండుగ వేడుక పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలోను ఇంతే మొత్తం వెచ్చించాలి. ఈ దందాపై రవాణా యంత్రాంగం దృష్టి సారించడం లేదా..? అంటే సమాధానం కష్టమే. మోటారు వాహన చట్టాల్లోని నిబంధనలు నిలువునా ఉల్లంఘించినా పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. శని, ఆది, సోమవారాల్లో ఈ ధరలు పలుకుతున్నాయి. తిరుగు ప్రయాణ టిక్కెట్లను అప్పుడే తెరవలేదు. వాటిని డిమాండ్‌ను బట్టి అమ్ముకునేందుకు సిద్ధం అవుతున్నారు. అడ్డగోలుగా ప్రైవేట్ ఆపరేటర్లు ఛార్జీలు పెంచేసినా రవాణ శాఖ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఉమ్మడి పశ్చిమలో ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు ప్రాంతాలకు రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లోనే స్పెషల్ బస్సులను నడుపుతూ అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

**కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై నిఘా...** జిల్లా మీదుగా నడుస్తున్న కాంట్రాక్టు క్యారేజ్ బస్సుల తనిఖీలకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు ఇన్‌చార్జ్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కేఎస్ఎంవీ కృష్ణారావు తెలిపారు. సంక్రాంతి పండుగ రోజుల్లో ప్రయాణికుల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని కాంట్రాక్టు క్యారేజ్ బస్సుల తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్టీవోలు ఎస్బీ శేఖర్. ఎస్. రంగనాయకులు ఆధ్వర్యంలో మోటారు వాహన తనిఖీ అధికారులతో ఏలూరు సమీపంలోని కలపర్రు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రాంతాల్లో రాత్రి 8 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఈనెల 19వ తేదీ వరకూ తనిఖీలు కొనసాగుతాయన్నారు. టిక్కెట్‌కు అధిక ధరలు వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. బస్సుల్లో అగ్ని ప్రమాద రక్షణ పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లు తప్పకుండా ఉండాలని, దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఏర్పాటు తదితర జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్సు అన్ని పత్రాలు ఉన్న బస్సులను మాత్రమే నడపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బస్సులపై కేసులు నమోదు చేయడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు.




## రైతు భరోసా నిధుల జమ ముహూర్తం ఎట్టకేలకు ఖరారు..!!

హైదరాబాద్ : రైతులకు బిగ్ అప్డేట్. రైతులు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందించే రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. రైతు భరోసా నిధుల జమ పైన కీలక సమాచారం వచ్చింది. యాసంగి పనులు కొనసాగుతున్న వేళ సంక్రాంతికి రైతు భరోసా నిధులు జమ చేసేందుకు తొలుత నిర్ణయం తీసుకున్నారు. అయితే, ప్రభుత్వం లో నిధుల విడుదల పైన కసరత్తు చేస్తున్నారు. దీంతో.. ఇప్పుడు రైతు భరోసా నిధుల జమ ముహూర్తం పైన స్పష్టత ఇచ్చారు. తెలంగాణ రైతులకు ప్రభుత్వం నుంచి కీలక అప్డేట్ అందుతోంది. నవంబర్‌లో రబీ సీజన్ మొదలవ్వగా.. ఆ సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇంకా అందించలేదు. రైతు భరోసా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా నిధుల విడుదలకు ఎట్టకేలకు ముహూర్తం ఫిక్స్ అయింది. ముందు నిర్ణయించిన ముహూర్తం మేరకు సంక్రాంతి నాటికి రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. ఈ నెల 13వ తేదీ నుంచి నిధుల జమకు ముహూర్తంగా ఖరారు చేసారు. ఈ మేరకు సంక్రాంతి కల్లా నిధులు జమ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ప్రకటించారు. అయితే, ఇప్పుడు సంక్రాంతి కి నిధులు విడుదల అవ్వటం కష్టంగానే కనిపిస్తోంది. సంక్రాంతికి నిధులు వస్తాయని భావించిన రైతులకు మరి కొన్ని రోజులు వేచి చూడక తప్పటం లేదు. ప్రభుత్వం నుంచి అందుతున్న తాజా సమాచారం మేరకు జనవరి చివరి వారంలో రైతు భరోసా నిధులు ప్రభుత్వం విడుదల చేయాలని నిర్ణయించింది. గణతంత్ర దినోత్సవమైన జనవరి 26వ తేదీ నుంచి నిధులు రిలీజ్ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ సారి రైతు భరోసా అమలు లో ప్రభుత్వం కీలక మార్పులు తెస్తోంది. సాగుకు వినియోగంలో ఉన్న భూములకు మాత్రమే భరోసా నిధులు ఇవ్వాలని డిసైడ్ చేసింది. పథకం అమలు, అర్హతపైన కొత్త రూల్స్ తీసుకొచ్చింది. అయితే, శాటిలైట్ సర్వే వల్ల రైతు భరోసా నిధుల విడుదలలో జాప్యం జరుగు తోంది. శాటిలైట్ సర్వే వివరాలు ఇప్పటికే కంప్యూటర్లలో స్టోర్ అవ్వగా.. వాటిల్లో పంట సాగులో ఉన్న భూములను గుర్తించే ప్రక్రియ షురూ అయింది. ఈ ప్రాసెస్ పూర్తవ్వడానికి మరికొంత సమయం పట్టే అవకాశముందని తెలుస్తోంది. జనవరి 26 నుంచి రైతుల అకౌంట్లో ఎకరానికి రూ 6 వేలు చొప్పున నిధులు జమ చేయనున్నారు. జనవరి 26 నుంచి మొదలుకానున్న రైతు భరోసా నిధుల ప్రక్రియ 10 రోజుల పాటు కొనసాగే అవకాశం కనిపిస్తోంది.




## ఐఏఎస్ అధికారిపై తప్పుడు కథనం.. ఐఏఎస్ సంఘం రియాక్షన్ ఇదే..

హైదరాబాద్ : మహిళా ఐఏఎస్ అధికారిపై వస్తున్న తప్పుడు కథనాలను తెలంగాణ ఐఏఎస్ అధికారుల అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. తప్పుడు కథనాలు ప్రసారం చేసిన మీడియా సంస్థలపై ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళా ఐఏఎస్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాన్ని తక్షణమే అన్ని ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించాలని హెచ్చరించింది. లేనిపక్షంలో సదరు మీడియా హౌజ్‌పై న్యాయపరంగా ముందుకు వెళ్తామని వార్నింగ్ ఇచ్చింది. బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఐఏఎస్ అధికారుల అసోసియేషన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. కాగా.. ఇటీవల మంత్రికి, ఓ మహిళా ఐఏఎస్ అధికారికి మధ్య ప్రేమాయణం అంటూ ఓ మీడియా సంస్థలో కథనం ప్రసారమవడం తెలంగాణలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. సదరు మహిళా అధికారికి మంత్రి ప్రత్యేకంగా పోస్టింగ్‌లు ఇప్పిచ్చారంటూ జోరుగా ప్రచారం జరిగింది. మీడియా సంస్థ ప్రసారం చేసిన కథనం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ కథనంపై తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం స్పందిస్తూ.. సదరు మీడియా సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కథనం వల్ల ఐఏఎస్ అధికారి పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించడం సరికాదని పేర్కొంది. ఇలాంటి నైతికత లేని జర్నలిజం.. సివిల్ సర్వీస్ అధికారులతో పాటూ సమాజానికి చెడ్డ పేరు తెస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఐఏఎస్ అధికారికి వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది.

## మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం దురదృష్టకరం: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: మంత్రులపై ఇటీవల వస్తున్న ఆరోపణల్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఖండించారు. ఓ మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా రాతలు రాయొద్దని మంత్రి హితవు పలికారు. మంత్రి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 'నా జిల్లాలోనే కాదు.. చాలా జిల్లాల్లో కలెక్టర్ల బదిలీ జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే ఈ ప్రక్రియ జరుగుతుంది.

అధికారుల మీద అభాండాలు వేయడం సరికాదు. రేటింగ్‌లు, వ్యూస్ కోసం అవాస్తవాలు రాయడం సరికాదు. ఛానళ్ల మధ్య పోటీ కోసం మహిళా అధికారులను ఇబ్బంది పెట్టొద్దు. మంత్రులపైనే కాదు.. సీఎంపైనా దుష్ప్రచారం చేస్తున్నారు' అని కోమటిరెడ్డి అన్నారు.

**హైదరాబాద్-విజయవాడ హైవేపై ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం:** సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. దీంతో జాతీయ రహదారిపై ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వంతెనల నిర్మాణం జరుగుతున్న చోట యంత్రాలు కూడా తొలగించినట్లు తెలిపారు. ఈ అంశంపై మంత్రి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. "నేషనల్ హైవేల డైరెక్టర్‌తో ఇప్పటికే మాట్లాడాను. టోల్‌ప్లాజాల వద్ద రద్దీ పెరిగితే టోల్ వసూలు లేకుండా పంపించాలని చెప్పాం.

రోడ్లపై వాహనాలు ఆగిపోతే.. వెంటనే తొలగించేందుకు హైవేపై క్రేన్లు సిద్ధంగా ఉంచాం" అని మంత్రి తెలిపారు.

## మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు: మహేశ్ గౌడ్



హైదరాబాద్ : కొన్ని మీడియా సంస్థల్లో మహిళా ఐఏఎస్ అధికారులపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు రావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి దూరంగా కథనాలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే తప్పా మంత్రులు ఈ స్థాయికి చేరుకోరని తెలిపారు. కొన్ని మీడియా సంస్థలు నిరధారణమైన వార్తలను వేయడం మానేయాలని విజ్ఞప్తి చేశారు. ఇవాళ(శనివారం) గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది? అని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడును లాగడం మంచిది కాదని హితవు పలికారు. ఓట్ల కోసం దేవుడునువాడుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు మహేశ్ కుమార్ గౌడ్.

**శ్వేతపత్రం విడుదల చేయాలి..** 'కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలి. మేం రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తాం. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్‌రావు బాధపడుతున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తాం, పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు గెలిచాం. కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచాం. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోంది. పేర్లు మార్చడం వల్ల ప్రజలకు వచ్చేదేమీ లేదు. పేర్ల మార్పుకు ముందు ఆయా జిల్లాలకు ఏమేం చేశారో చెప్పాలి. ప్రజల దృష్టి మళ్లించేందుకే పేరు మార్పు అంశాన్ని తెరపైకి తెస్తున్నారు' అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## మియాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. అక్రమార్కుల నుంచి రూ.3వేల కోట్ల భూమికి రక్షణ

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్‌లో హైడ్రా(ఎఎంతీఋ) భారీ ఆపరేషన్ నిర్వహించింది. రూ. 3వేల కోట్లకుపైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించింది. మక్తా మహబూబ్ పేటలోని సర్వే నెంబరు 44లో తప్పుడు పత్రాలతో 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 159 సర్వే నెంబర్‌లోని భూమి పత్రాలతో సర్వే నెం. 44లోని ప్రభుత్వ భూమిలో ఇప్పటికే ఎకరంన్నర వరకు ఇమ్రాన్ అనే వ్యక్తి కబ్జా చేయగా అతనిపై కేసు నమోదైంది. అలాగే మరో 5 ఎకరాలను కూడా ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. మియాపూర్ - బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా చెరువు కట్టపై 200 మీటర్ల మేర మట్టి పోసి ఏర్పాటు చేసిన 18 షెట్టర్లను కూడా హైడ్రా తొలగించింది. ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. సర్వే నెం. 44లోని ప్రభుత్వ భూమిపై విచారణ జరిపించారు. అందులోని అక్రమ రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. కబ్జాదారుల కన్ను ప్రభుత్వ భూమిపై పడిందని నిర్ధారించిన హైడ్రా అధికారులు.. సమగ్ర విచారణ జరిపి మక్తా మహబూబ్ పేటలోని ఆ భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డులు పెట్టారు.




## ప్రజలకు తెలంగాణ డ్రగ్ కంట్రోల్ కీలక హెచ్చరికలు..

హైదరాబాద్, జనవరి 10: ప్రజలకు తెలంగాణ డ్రగ్ కంట్రోల్ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఆల్మంట్- కిడ్ సిరప్ వినియోగాన్ని వెంటనే నిలిపేయాలని ఆదేశించింది. పిల్లలకు అలర్జీ, జ్వరం, ఆస్తమా వంటి సమస్యలకు ఆల్మంట్ - కిడ్ సిరప్‌ను వినియోగిస్తుంటారు. అయితే ఈ సిరప్‌లో విషపూరితమైన ఇథలీన్ గ్లైకాల్ కలుషితమై ఉన్నట్లు గుర్తించారు. కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి వచ్చిన రిపోర్ట్ ఆధారంగా తెలంగాణ డ్రగ్ కంట్రోల్ ఈ మేరకు హెచ్చరికలు జారీ చేసింది. ఎవరైనా ఈ సిరప్ నియోగిస్తుంటే తక్షణమే నిలిపేయాలని టీజీసీఏ సూచనలు చేసింది. అలాగే సిరప్ వినియోగ సమాచారాన్ని సమీప డ్రగ్ కంట్రోల్ అధికారికి ఇవ్వాలని సూచించింది. పిల్లలకు వాడే సిరప్ కావడంతో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇథలీన్ గ్లైకాల్ వల్ల కిడ్నీ సమస్యలు, న్యూరాలజికల్ డ్యామేజ్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

# ఆహారాన్ని శక్తిగా మార్చే హార్మోన్ ఇన్సులిన్

## - జనవరి 11...మొదటిసారి చక్కెర వ్యాధి రోగులకు ఇన్సులిన్ని ఇచ్చిన దినం




మధుమేహం, చక్కెర వ్యాధి...డయాబెటిస్ అని కూడా అనబడే ఈ వ్యాధి, ఇన్సులిన్ హార్మోన్ స్థాయి తగ్గడం వల్ల కలిగే అనియంత్రిత మెటబాలిజం, రక్తంలో అధిక గ్లూకోజ్ స్థాయి వంటి లక్షణాలతో కూడిన ఒక రుగ్మత. కణాలు మరియు కణజాలాలు శక్తిని ఎలా గ్రహిస్తాయో అలాగే కొవ్వులు, ప్రోటీన్ల విచ్ఛిన్నతను నియంత్రించే కీలకమైన హార్మోన్ ఇన్సులిన్. ఇన్సులిన్ అనేది క్లోమం యొక్క బీటా కణాల ద్వారా ప్రవించే హార్మోన్, ఇది రక్తం నుండి గ్లూకోజ్ను శక్తి కోసం శరీర కణాలలోకి తరలించడానికి సహాయ పడుతుంది. 20 వ శతాబ్దం ఆరంభం నుండి, వైద్యులు ఇన్సులిన్ను వేరుచేసి ఇంజెక్షన్ రూపంలో అందించ గలిగారు. దీనిని డయాబెటిస్కు విజయ వంతంగా చికిత్స చేయడానికి ఉపయోగించ వచ్చని కనుగొన్నారు. అప్పటి నుండి, డయాబెటిస్ ఉన్నవారి వివిధ అవసరాలను తీర్చడానికి అనేక రకాల ఇన్సులిన్లను అభివృద్ధి చేశారు. జనవరి 11, 1922 న , టొరంటో జనరల్ హాస్పిటల్లో చనిపోతున్న 14 ఏళ్ల డయాబెటిస్ రోగి లియోనార్డ్ థంప్సన్కు మొదటి సారి ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇచ్చారు. వేదకాలంలో మధుమేహం ప్రస్తావన ఉంది. ఆ కాలంలో మధుమేహాన్ని అశ్రవ అనే పేరుతో గుర్తించారు.ఈ వ్యాధి ఎలా వస్తుంది వ్యాధి లక్షణాలు ఏమిటి అని చరక సంహిత , శుశ్రుతసంహిత , నాగబట్ట గ్రంథాలలో వర్ణించ బడింది. క్రీస్తుశకానికి వెయ్యి సంవత్సరాల క్రిందట ఈ వ్యాధి వర్ణన ఉంది. యజ్ఞాలలో సమయంలో దేవతలకు సమర్పించబడే హవిస్సును భుజించడం వలన ఈవ్యాధి వచ్చినట్లు వర్ణించ బడింది. దక్షప్రజాపతి చేసిన యజ్ఞంలో హవిస్సు భుజించడం వలన ఈ వ్యాధి వచ్చినట్లు ప్రస్తావన ఉంది. క్రీస్తు శకం ఆరవ శతాబ్దంలో అష్ఠాంగ హృదయ అనే గ్రంథంలో మధుమేహం అనే పదం వాడబడింది. తేనెను మధువు అని అంటారు కనుక ఈ వ్యాధిగ్రస్తుల మూత్రం తేనెరంగు ఉంటుందని దీనికి ఈ పేరు వచ్చిందని భావన.1400 సంవత్సరాల క్రితమే ఈ వ్యాధికి పథ్యం, ఔషధం, వ్యాయామంతో క్రమపరచ వచ్చని పేర్కొన్నారు. దాదాపు ఇప్పటికీ అనుసరిస్తున్న విధానం అదే కావడం గమనార్హం. మధుమేహం యొక్క లక్షణాలలో సాంప్రదాయిక త్రయంగా అతిగా మూత్రం రావడం, దాహం వేయడం, అతిగా ఆకలి వేయడం అను వాటిని చెప్పుతారు. వంశపారంపర్యంగా మధుమేహం వచ్చే అవకాశం ఉ ంది. శారీరక శ్రమ పూర్తిగా లోపించడం, గంటల తరబడి కుర్చోని ఉండటం, పోషకపదార్థాలు సరిగా లేని ఆహారం, వేపుడు కూరలు, అధికంగా కొవ్వు ఉండే పదార్థాలు, మాంసాహారం, బేకరీ పదార్థాలు, నిల్వ ఉండే పచ్చళ్లు, తీపి పదార్థాలు, కొన్ని రకాల మందుల దుష్పరిణామాలు ఈ వ్యాధికి కారణం. అతిగా పాలుత్రాగడం, పాల ఉత్పత్తులు భుజించడం, అతిగా చక్కెర ఉపయోగించడం, చక్కెర రసాలు త్రాగడం, క్రొత్తగా పండిన ధాన్యాలను వంటలలో వాడడం, తాజాగా చేసిన సురను (మధువును) సేవించడం, అతిగా నిద్ర పోవడం, శరీర శ్రమ కావలసి నంత చేయక పోవడం, మానసిక ఆందోళన, భారీ కాయం, అహారపు అలవాట్లు, ముందుగా తిన్నది జీర్ణంకాక ముందే తిరిగి భుజించడం, ఆకలి లేకున్నా ఆహారం తీసుకోవడం, అతిగా ఆహారం తీసుకోవడం లాంటి కారణాలతో మధుమేహం వచ్చే అవకాశం ఉంటుంది. ప్రధానంగా తీపి పదార్థాలు, ఐస్క్రీములు మానుకోవాలి. రోజు మామూలుగా తీసుకునే ఆహార పదార్థాల మోతాదును, నూనె పదార్థాలు కూడా బాగా తగ్గించాలి. పాదరక్షలు లేకుండా నడవ కూడదు. పొగతాగడం పూర్తిగా మానుకోవాలి.మానసిక ఒత్తిళ్లను తగ్గించుకోవాలి. కొలెస్ట్రాల్ అధికంగా ఉండే కొవ్వు ఉన్న మాంసం, గుడ్లు తినడం మానుకోవాలి. రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. తద్వారా శరీరం బరువు పెరగకుండా చూసుకోవాలి.భోజనానికి అరగంట ముందు మాత్రలు వేసుకోవాలి.ప్రతి రోజూ ఒక నిర్ణీత సమయంలోనే భోజనం చేయాలి. ఇన్సులిన్ వేసుకోవడంలోనూ కాల నియమాన్ని పాటించాలి. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ పరీక్షలు, అలాగే కళ్లు, కిడ్నీ పరీక్షలు కూడా డాక్టర్ సలహా మేరకు చేయించుకోవాలి. గుండె నొప్పి ఉన్నా లేకపోయినా ప్రతి ఏటా ఇసిజి, ట్రెడ్మిల్ పరీక్షలు చేయించుకోవడం అవసరం. ఇన్సలిన్...మధుమేహం 10 ఏళ్ల కంటే మించి ఉన్నా, వయసు 65 ఏళ్ల కన్నా ఎక్కువగా ఉన్నా, రక్తంలో గ్లూకోజు పరగడుపున 250 కంటే ఎక్కువ, తిన్న తర్వాత రెండు గంటలకు 500 కంటే ఎక్కువ, హెచ్బీఏ1సీ 10 కంటే ఎక్కువ, ట్రైగ్లిజరైడ్లు 600 కంటే ఎక్కువ ఉన్నవాళ్లు ఇన్సులిన్ తీసుకోవటం మేలు. మధుమేహం (షుగర్ వ్యాధి) వ్యాధి నియంత్రణకోసం కృత్రిమ ఇన్సులిన్ను కనుగొన్న శాస్త్రవేత్త ఫ్రెడరిక్ బాంటింగ్ గౌరవార్థం ఆయన పుట్టినరోజు నవంబరు 14న ప్రపంచ మధుమేహ దినోత్సవం నిర్వహించ బడుతుంది. రక్తంలో చక్కెర మరియు శక్తి శోషణను నియంత్రించడానికి ఇన్సులిన్ ఒక ముఖ్యమైన హార్మోన్. ఇన్సులిన్ సమతుల్యత రక్తంలో చక్కెర మరియు శరీరంలోని అనేక ప్రక్రియలను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ అనేది జీర్ణ రసాలను తయారు చేసే క్లోమము (ప్యాంక్రియాస్) గ్రంథి చేత సృష్టించబడిన హార్మోన్. ఇది రక్త ప్రవాహంలో గ్లూకోజ్ మొత్తాన్ని ఏ క్షణంలోనైనా నియంత్రిస్తుంది. ఇది కాలేయం, కొవ్వు మరియు కండరాలలో గ్లూకోజ్ నిల్వ చేయడానికి కూడా సహాయ పడుతుంది. శరీరం యొక్క కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, ప్రోటీన్ల జీవక్రియను నియంత్రిస్తుంది. సరైన ఇన్సులిన్ పనితీరు లేకుండా, శరీరం, కండరాలలో లేదా కాలేయంలో గ్లూకోజ్ను నిల్వ చేయదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# శాస్త్రి మృతిపై తీరని సందేహాలు - జనవరి 11... లాల్ బహదూర్ వర్ధంతి



భారత దేశ మలి ప్రధాని, స్వాతంత్ర్యోద్యమం లో ప్రముఖ పాత్రధారి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు, జై జవాన్ జై కిసాన్ నినాదంతో ప్రజల అభిమానాన్ని చూరగొన్న లాల్ బహదూర్ శాస్త్రి మరణంపై సందేహాలు తీరనే లేదు. తాష్కెంట్లో అతను గుండెపోటుతో మరణించినట్లు చెప్పబడినా, అది ప్రణాళికా బద్ధమైన హత్యగా చర్చకు తెర లేపింది. 1965 ఆగస్టులో, పాకిస్తాన్ తన సేనలను ప్రయోగించి జమ్మూ కాశ్మీరులోని కచ్ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది. తద్వారా జమ్ము కాశ్మీరులోని ప్రజలు ఉద్యమించి, భారతదేశం నుండి విడిపోతారని ఆశించింది. పాకిస్తాన్ ఆక్రమణ గురించి తెలుసుకున్న లాల్ బహదూర్ శాస్త్రి వెంటనే త్రివిధ దళాలకు నియంత్రణ రేఖను దాటి లాహోరును ఆక్రమించు కోవడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. భారత సైన్యం విజయానికి చేరువలో ఉ ండగా శాస్త్రి పై అమెరికా తీవ్ర ఒత్తిళ్లు తెచ్చింది. 1965 యుద్ధం తీవ్రస్థాయికి చేరిన సమయంలో పాకిస్థాన్- అమెరికా, భారత్- అమెరికా మధ్య జరిగిన పలు దౌత్య కార్యక్రమాలు జరిగాయి. యుద్ధంలో పాక్ ఓటమి దశకు చేరిన సమయంలో నాటి పాక్ అధ్యక్షుడు ఆయూబ్ఖాన్, విదేశాంగమంత్రి జుల్ఫికర్ అలీ భుట్టోలను పాక్లో అమెరికా రాయబారి వాల్టర్ ప్యాట్రిక్ మెక్కోటే కలిసి యుద్ధ విరమణకోసం చర్చలు జరిపారు. ఈ దశలో ఐక్యరాజ్య సమితి పాక్తో విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించింది. ఈ దశలో ఒప్పందానికి అంగీకరించే విధంగా శాస్త్రిపై తాష్కెంట్లో తీవ్ర ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణలు ఉన్నాయి. 1965 లో పాకిస్తాన్తో కాల్పుల విరమణ ప్రకటించిన తరువాత, శాస్త్రి, అయుబ్ ఖాన్ తాష్కెంట్ లో జరిగిన ఒక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. 1966 జనవరి 10న ఒప్పందాలపై సంతకాలు చేసిన మర్నాడే జనవరి 11న ఆయన హృద్రోగంతో అక్కడే మృతి చెందాడు. ఓ దేశాధినేత అదీ మరో దేశానికి అతిథిగా ఒప్పందాలపై సంతకాలు చేసేందుకు వెళ్ళి అక్కడే అసహజ, అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం చరిత్రలో అంతకు ముందెప్పుడూ లేదు. ఈ మరణం హృద్రోగం వల్ల సంభవించిందని సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది. భారత ప్రభుత్వం దీన్నే ధ్రువీకరించింది. అనుమానాలు వ్యక్తం అయినా శాస్త్రి బౌతిక ఖాయానికి పోస్టుమార్టం నిర్వహించ లేదు. అంతకు ముందెప్పుడూ శాస్త్రికి ఎలాంటి అనారోగ్యం లేదు. విషప్రయోగం వల్లే శాస్త్రి మరణించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. శాస్త్రి ఆఖరుగా ఆయన కుమార్తె సుమన్తో మాట్లాడాడు. పాలుతాగి పడుకుంటానని చెప్పాడు. ఈలోగా ఫోన్లైన్ డిస్కనెక్ట్ అయింది. తర్వాత దాదాపు పదిహేను నిమిషాలకు పైగా సుమన్ లైన్ కోసం ప్రయత్నించింది. ఆ తర్వాత లైన్ దొరికింది కానీ శాస్త్రి ఎత్తలేదు. సోవియట్కు చెందిన ఓ అధికారి ఫోన్ ఎత్తాడు. మీ తండ్రిగారు ఇప్పుడే మరణించారని సుమన్కు చెప్పాడు. అంతవరకు ఎలాంటి అరోగ్యకర ఇబ్బందుల్లేని వ్యక్తి 15 నిమిషాల్లో మృతి చెందినట్లు చెప్పాదంపై సందేహాలు ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. శాస్త్రి వెంట ఆయన వ్యక్తిగత వైద్యుడు ఆర్ఎన్ చుగ్ కూడా తాష్కంట్ వెళ్ళాడు. అతనూ పక్కగదిలోనే ఉ న్నా, కనీసం శాస్త్రికి గుండెపోటు వచ్చిందన్న విషయాన్ని ఆయనకు కూడా సోవియట్ అధికారులు వెల్లడించలేదు. మరణించిన తర్వాతే ఆ విషయాన్ని చెప్పారు. భారత్కు తెచ్చిన శాస్త్రి భౌతిక కాయం నీలంరంగులోకి మారి ఉంది. శరీరంపై కొన్ని గాట్లు కూడా గమనించినట్లు ఆయన భార్య లలితాశాస్త్రి గుర్తించారు. శాస్త్రి విష ప్రయోగం వల్ల మరణించాడని ఆయన భార్య లలితా శాస్త్రి ఆరోపించింది. 1978 లో క్రాంత్ ఎం.ఎల్.వెర్మా హిందీలో "లలితా కె ఆంసు" పేరుతో పుస్తకాన్ని రాసి ప్రచురించాడు. ఈ పుస్తకంలో శాస్త్రి మరణం గురించి విషాద కథ లలిత శాస్త్రిచే వ్యాఖ్యానించ బడింది. ఆయన మరణం చుట్టూ ఇప్పటికీ సందేహాలు ఉన్నాయి. ఆయన కుమారుడు సునీల్ శాస్త్రి, తండ్రి మరణానికి వెనుక ఉన్న మర్మాన్ని తెలియ చేయ వలసినదిగా ప్రభుత్వాన్ని కోరాడు. 1966 లో ఆయన మరణం తరువాత భారత దేశానికి తీసుకువచ్చిన భౌతిక కాయంపై నీలం రంగు మచ్చలు, కొన్ని గాట్లు ఉన్నట్లు అనుమానాలను వ్యక్త పరిచాడు. పోస్టు మార్టం చేయ బడనప్పటికీ శరీరంపై గాట్లు ఏర్పడానికి కారణాన్ని గూర్చి అడిగాడు. శాస్త్రి మనవడు సంజయ్... తమ తాతకు తాష్కెంట్లో హోటల్ బుక్ చేయాలనుకుని, ఆయనకు సోవియట్ ప్రభుత్వం ఒక కాటేజ్ కేటాయించిందని, అందులో టెలీప్రింటర్, టెలిఫోన్ కూడా లేవని పేర్కొన్నారు. మృతదేహం ఢిల్లీకి వచ్చినప్పుడు చూస్తే ఆయన నోరు, ముక్కు నుంచి రక్తం కారడం కనిపించిందని, ఆయన ఒంటిపై గాట్లు ఉన్నాయని, అమ్మమ్మ నెయ్యిలో ఆయన చేతులను ముంచిం పెదాలకు నెయ్యి పూస్తే నెయ్యి నీలిరంగులో కనిపించిందని, ఆయన వ్యక్తిగత డైరీ, ఆయన రోజువారి కార్యక్రమాలను రాసుకొనే యాక్షన్ ప్లాన్ పుస్తకం కనిపించలేదని సంజయ్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. 1977లో శాస్త్రి మరణంపై దర్యాప్తుకు ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీ ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు డాక్టర్ చుగ్ బయలు దేరాడు. కారులో ఢిల్లీ వైపు ప్రయాణిస్తుండగా ఎదురుగా ఓ లారీ వచ్చి ఢీ కొనగా, చుగ్ అక్కడి కక్కడే మరణించాడు. అలాగే శాస్త్రి వ్యక్తిగత సేవకుడు రామ్నాథ్ కూడా ఆయనతో పాటు తాష్కంట్ వెళ్ళాడు. మృతదేహం వెంటే ఆయనా తిరిగొచ్చాడు. ఆయనను కూడా కమిటీ సాక్షగా పరిగణించింది. వాంగ్మూలం నమోదుకు పిల్చింది. మోతీలాల్ నెహ్రూ మార్గ్లోని తన నివాసం నుంచి ఆయన ఒక్కడుగు బయట కేయగానే ఎదురుగా ఓ వాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామ్నాథ్ రెండుకాళ్ళూ నుజ్జునుజ్జు అయ్యాయి. తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన గతాన్ని మర్చిపోయాడు. తాష్కెంట్ ఒప్పందం గూర్చి శాస్త్రి రష్యా వెళ్ళిన తరువాత పాకిస్థాన్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్ నుండి పాకిస్థాన్ భవిష్యత్తులో భారత్ పై బలగాలను ఎప్పుడూ ప్రయోగించ రాదనే వాగ్దానాన్ని కోరాడు. కానీ చర్చలు కొనసాగలేదు. తరువాత రోజు శాస్త్రి మరణించాడు. భారత ప్రభుత్వం ఆయన మరణం గురించి ఎటువంటి సమాచారం అందించలేదు. భారత దేశంలో ఈ కుట్ర జరిగే సాధ్యాసాధ్యాలను "అవుట్ లుక్ మ్యాగజైను ప్రచురించింది. 2009లో దక్షణాసియాపై సిఐఎ దృష్టి పేరిట అనుజ్ధార్ అనే రచయిత పుస్తకం రాసేందుకు ఉపక్రమించాడు. ఇందుకోసం శాస్త్రి మరణానికి సంబంధించిన పత్రాలు కావాలంటూ సమాచార హక్కు చట్టం క్రింద భారత ప్రధాని కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నాడు. వీటి జారీకి పిఎమ్ఓ నిరాకరించింది. పైగా ఈ పత్రాల జారీ భారత సార్వ భౌమత్వానికి, అంతర్గత భద్రతకు, ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. సిఐఎ ప్రమేయాన్ని కూడా తక్కువగా అంచనా వేయలేం. పైగా ఆ సమయంలో సిఐఎలో డైరెక్టర్ ఆఫ్ ప్లాన్స్గా ఉన్న రోబర్ట్ క్రోలీ అమెరికాకు చెందిన గ్రెగరీడగ్లస్ అనే జర్నలిస్ట్కు ఇంటర్వ్యూ ఇస్తూ శాస్త్రితో పాటు భారత అణు పితామహుడు డాక్టర్ హోమీబాబా మరణాలకు సిఐఎ ప్రణాళికలు రచించి అమలు చేసిందని వెల్లడించారు. అయితే తన మరణానంతరమే ఈ ఇంటర్వ్యూను ప్రచురించాలని ఆయన డగ్లస్ను కోరాడు. శాస్త్రి, హోమీబాబా మరణాలు ఒకే నెలలో జరిగాయి. రెండింటికి మధ్య రెండు వారాల వ్యవధే ఉంది. పైగా ఈ రెండు దేశానికి వెలుపలే చోటు చేసుకున్నాయి. 60వ దశకంలో అమెరికాకు సహకరించని వివిధ దేశాల నేతల్ని హతమార్చడం సిఐఎ పనిగా పెట్టుకుంది. దీనిపై కేంద్రం రాజ్నారాయణ్ కమిటీని నియమించింది. ఈ కమిటీ అధ్యయనం నివేదిక ఇప్పటివరకు వెలుగు చూడలేదు. ఆఖరికి ఇది భారత పార్లమెంట్ లైబ్రరీలో కూడా అందుబాటులో లేదు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్ - 9440595494**

# ఇంటి పేరును విక్టరీగా మార్చుకున్న వీరమాచనేని

## - జనవరి 11...విక్టరీ మధుసూదన్ రావు వర్ధంతి



వి.మధుసుదనరావు (వీరమాచనేని మధుసూదనరావు) తెలుగు సినిమా ప్రముఖ దర్శకులు. తెలుగు సినీ రంగంలో అర్ధ శతాబ్ధం పాటు ఎన్నో చిత్రాలకు దర్శకునిగా పని చేసి, విజయవంతం కావడానికి కృషి సల్పి, విజయం సాధించి, "విక్టరీ" మధుసూదన్ రావు గా పేరు గాంచారు. ప్రజానాట్య మండలి నేపథ్యం నుంచి సినిమా రంగానికి వచ్చిన ఉత్తమ కళా పిపాసి ఆయన. తెలుగు చిత్ర సీమలో మకుటం లేని మహారాజులుగా చెలామణి అయిన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు లతో ఎన్నో విజయ వంతమైన చిత్రాలు తీశారు. తరవాతి కాలంలో శోభన్ బాబు, కృష్ణం రాజు, కృష్ణ వంటి హీరోలతో ఎన్నో చిత్రాలను అందించి, సక్సెస్ఫుల్ డైరెక్టర్ గా గుర్తింపు పొందారు. 1962 లో సూపర్ స్టార్ కృష్ణని పరిచయం చేస్తూ "పదండి ముందుకు" తీశారు.హీరోలు నాగార్జునను "విక్రం" ద్వారా, జగపతి బాబును "సింహ స్వప్నం" ద్వారా,రమేష్ బాబుని "సమ్రాట్ చిత్రం ద్వారా తెలుగు వెండి తెరకు పరిచయం చేశారు. ప్రముఖ దర్శకులైన కె.రాఘవేంద్ర రావు, కోదండ రామిరెడ్డి, పి.సి.రెడ్డి, శేఖర్, బోయిన సుబ్బారవు, వంశీ, శివ నాగేశ్వరరావు, మున్నగు వారు ఈయన దగ్గర శిష్యరికం చేసినవారే. విక్టరీ" నే యింటి పేరు చేసుకొన్న వి.మధుసూదన రావు గారు 1923 జులై 27 జన్మించి లో కృష్ణా జిల్లాలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. ఆ తరువాత మద్రాసు వెళ్లి ఐ.ప్రసాద్, తాతినేని ప్రకాశరావు వంటి వారి పరిచయంతో సినీ రంగ ప్రవేశం చేశారు. అయన కె.ఎస్.ప్రకాశరావు వద్ద చలనచిత్రీకరణ పాఠాలు నేర్చుకొని, 1958 లో చదలవాడ కుటుంబరావు నిర్మించిన "సతీ తులసి" పౌరాణిక చిత్రానికి మొదటిసారిగా దర్శకత్వం వహించి, దర్శకుడయ్యారు. కమ్యూనిస్ట్ భావజాలం ఒంట పట్టించుకున్న ఆయనకు తొలి సినిమాగా 'సతీ తులసి' పౌరాణిక సినిమా దర్శకత్వ అవకాశం రావడం యాదృచ్ఛికమే అయినా, చిత్తశుద్ధితో, వృత్తి నిబద్ధతతో కృషి చేసి, విజయం సాధించడం విశేషం. ఆయన తీసిన ప్రతీ భక్తి రస ప్రధాన పౌరాణిక చిత్రాలు ఘనవిజయం సాధించడం ఆయన అంకితభావానికి నిదర్శనం. ఆ తరువాత వి.బి.రాజేంద్ర గారి "జగపతి" వారి "అన్నపూర్ణ" సినిమాకు దర్శకత్వం వహించగా అది 100 రోజులు నడిచి విజయవంత మయింది. ఒక దశలో జగపతి సంస్థకు మధుసూదనరావు గారే రెగ్యులర్ దర్శకుడు. మద్రాసు నుండి హైదరాబాద్ వచ్చి మధు ఫిల్ం ఇనిస్టిట్యూట్ స్థాపించి ఎంతో మందిని నటులుగా తీర్చి దిద్దారు. 1964 లో తనతో పాటు ప్రజా నాట్య మండలిలో పనిచేసిన సరోజినిని ఆదర్శాలకు కట్టుబడి వివాహం చేసుకున్నారు. ఆమె తరువాత పూర్తిగా మహిళలతో సినిమా తీసి గిన్నిస్ రికార్డుకి ఎక్కారు. తెలుగు చలన చిత్ర సీమలో 50 సంవత్సరాలుగా కొనసాగుతూ నాలుగు భాషలలో కలిపి 71 చిత్రాలకు దర్శకత్వం వహించి "వీరమాచనేని"కి బదులు "విక్టరీ" నే ఇంటి పేరుగా చేసుకున్నారు. రక్తసంబంధం, ఆరాధన, ఆత్మబలం, గుడిగంటలు, మంచి కుటుంబం, లక్ష్మ నివాసం, కళ్యాణ మంటపం, మంచి రోజులు వచ్చాయి, కృష్ణవేణి, జేబుదొంగ, చక్రధారి, ఎదురీత, విచిత్ర జీవితం, అంగడిబొమ్మ, మల్లెపూవు, శివమెత్తిన సత్యం, సంసారం, సంతానం, విక్రమ్, సామ్రాట్ , ప్రాణ స్నేహితులు, ఆత్మకథ, సింహస్వప్నం, పాపే మా ప్రాణం లాంటి 23 సినిమాలు రీమేక్ చేయగా, అన్ని విజయ వంతం కావడం గమనార్హం. నవలలని సినిమాలుగా మలిచి ప్రజాదరణ పొందడంలో అందెవేసిన చేయిగా ఖ్యాతిని ఆర్జించారు. సతీ తులసి (1959), వీరాభిమన్యు (1965), ట్యాక్సీ రాముడు (1961), ఆరాధన (1962), పదండి ముందుకు (1962), రక్త సంబంధం (1962), లక్షధికారి (1963), ఆత్మ బలం (1964), అంతస్థులు (1965), గుడి గంటలు (1965), మంచి కుటుంబం (1965), ఆస్తి పాస్తులు (1966), డ్రైవర్ ఆనంద్ (1966), జమీందార్ (1966), లక్ష్మ నివాసం (1968), అదృష్ట వంతులు (1968), ఆత్మీయులు (1969), మనుషులు మారాలి (1969), లవ్ కుశ్ (హింది), దేవి (1970), సమాజ్ కొ బదల్ డాలో (1970)), కళ్యాణ మండపం (1971), మంచి రోజు లొస్తాయి (1972), కన్న కొడుకు (1973), భక్త తుకారాం (1973), కృష్ణవేణి (1974), ప్రేమలు పెళ్ళిళ్ళు (1974), జేబు దొంగ (1975), చక్రధారి (1977), ఎదురీత (1977), ఈ తరం మనిషి (1977), అంగడి బొమ్మ (1978), మల్లెపూవు (1978), జూదగాడు (1979), శివమెత్తిన సత్యం (1979), ఛండీ ప్రియ (1980), జీవిత రథం (1981), పులి బిడ్డ (1981), బంగారు కానుక (1982), విక్రమ్ (1986), సామ్రాట్ (1987), కృష్ణగారి అబ్బాయి (1989) తదితర చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తన 95వ ఏట, 2012 జనవరి 11న అనారోగ్యంతో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్ - 9440595494**

# గ్రామీణ తెలంగాణ గుండె చప్పుడు: ఫజల్ రహమాన్ జర్నలిస్టిక్ ప్రయాణం



సీనియర్ జర్నలిస్టు ఫజల్ రహ్మాన్ మహమ్మద్ (65) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, సాక్ష, దిశ తదితర పత్రికలలో వివిధ హోదాల్లో దాదాపు 38 సంవత్సరాలకు పైగా పని చేసిన ఆయనౌ ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 'ప్రతిపక్షం' డిజిటల్ దినపత్రిక నిర్వాహకులుగా ఉన్నారు. తెలంగాణ జర్నలిజం రంగంలో నేలమీద నిలబడి ప్రజల స్వరాన్ని అక్షరాలుగా మలిచిన కొద్దిమంది నిబద్ధత గల పాత్రికేయుల్లో హుస్నాబాద్కు చెందిన ఫజల్ రహమాన్ ఒకరు. జర్నలిజాన్ని వృత్తిగా మాత్రమే కాక ప్రజాసేవగా భావించిన ఆయన ప్రయాణం గ్రామీణ తెలంగాణ సామాజిక చరిత్రకు అద్దం పడుతుంది. అధికార కేంద్రాలకు దూరంగా, పల్లె బాటలపై తిరుగుతూ ప్రజల బాధలు, ఆశలు, ఆకాంక్షలను నిక్కచ్చిగా వెలుగులోకి తీసుకువచ్చిన పాత్రికేయుడిగా ఫజల్ రహమాన్ గుర్తింపు పొందారు. తెలంగాణ గ్రామీణ జర్నలిజం చరిత్రలో హుస్నాబాద్ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉంటే, ఆ గుర్తింపుకు కారణమైన నిబద్ధత గల పాత్రికేయుల్లో ఫజల్ రహమాన్ పేరు తప్పక వినిపిస్తుంది. జర్నలిజాన్ని వృత్తిగా మాత్రమే కాక సమాజ మార్పుకు సాధనంగా భావించిన వ్యక్తిగా ఆయన జీవితం, ప్రయాణం నిలుస్తాయి. ప్రజల జీవితాల మధ్యే పుట్టి, అదే ప్రజల సమస్యలను అక్షరాలుగా మలిచిన జర్నలిస్టుగా ఫజల్ రహమాన్ తనదైన ముద్ర వేశారు. హుస్నాబాద్ సమీపంలోని సాధారణ మధ్యతరగతి కుటుంబంలో ఫజల్ రహమాన్ జన్మించారు. బాల్యం నుంచే ఆయన జీవితం గ్రామీణ వాతావరణంతో ముడిపడి సాగింది. పొలం పనులు, గ్రామ సభలు, పేదల దైనందిన కష్టాలు ఆయన కళ్ల ముందే పెరిగాయి. కుటుంబంలో క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడి పనిచేయాలనే విలువలు నాటివేయబడ్డాయి. ఇవే ఆయన భవిష్యత్ వ్యక్తిత్వానికి పునాదులయ్యాయి. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి, పుస్తకాలపై ప్రేమ కనిపించేది. పాఠశాల రోజుల్లోనే ఉపాధ్యాయులు చెప్పే సామాజిక విషయాలు, దేశ పరిస్థితులపై జరిగే చర్చలు ఆయనను ఆలోచనాత్మకుడిగా తీర్చిదిద్దాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యను హుస్నాబాద్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి చేశారు. అప్పటి పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాలు పరిమితంగానే ఉ ండేవి. తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్య అధికం, వసతులు తక్కువ అయినప్పటికీ ఫజల్ రహమాన్ చదువులో ముందుండేవారు. వార్తాపత్రికలు చదవడం, సమాజంలో జరుగుతున్న సంఘటనలను గమనించడం ఆయనకు అలవాటుగా మారింది. ఉన్నత విద్య దశలో సామాజిక శాస్త్రాలు, రాజకీయ పరిణామాలపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ దశలోనే జర్నలిజం పట్ల ఆకర్షణ కలిగింది. విద్య పూర్తయ్యాక జీవనోపాధి కోసం వివిధ మార్గాలు ఆలోచించినప్పటికీ, చివరకు జర్నలిజాన్నే తన జీవిత మార్గంగా ఎంచుకున్నారు. ప్రారంభ దశలో స్థానిక వార్తా పత్రికలతో అనుసంధానమై గ్రామీణ వార్తల సేకరణ బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి సైకిల్ లేదా బస్సుల్లో ప్రయాణిస్తూ వార్తలు సేకరించడం సాధారణమే. రోడ్లు లేని గ్రామాలు, రాత్రివేళల్లో ప్రయాణం, అధికారుల నిర్లక్ష్యం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా ఆయన తన పనిని కొనసాగించారు. ఫజల్ రహమాన్ జర్నలిజంలోకి వచ్చిన కాలం గ్రామీణ తెలంగాణలో మార్పులు మెల్లగా ప్రారంభమవుతున్న దశ. వ్యవసాయ రంగంలో సంక్షభాలు, వలసలు, నిరుద్యోగం, సాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్న కాలం అది. ఈ పరిస్థితులన్నింటినీ ఆయన తన కథనాల్లో ప్రతిబింబించారు. రైతుల ఆత్మహత్యలు, పంట నష్టాలు, ఎరువుల కొరత వంటి అంశాలపై ఆయన రాసిన కథనాలు అప్పట్లో విస్తృత చర్చకు దారి తీశాయి. అధికార యంత్రాంగం స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. జర్నలిజంలో ఆయన ప్రత్యేకత ప్రజల దగ్గర ఉండడం. గ్రామాల్లో జరిగే చిన్న సంఘటనను కూడా సామాజిక నేపథ్యంతో అనుసంధానించి రాయడం ఆయన శైలి. సంక్షమ పథకాల అమలులో ఉన్న లోపాలు, రేషన్ కార్డుల సమస్యలు, పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న అవకతవకలపై ఆయన నిరంతరం రాశారు. ఉదాహరణకు, ఒక దశలో హుస్నాబాద్ పరిధిలో వందలాది కుటుంబాలకు రేషన్ సరుకులు సకాలంలో అందని పరిస్థితిని ఆయన వరుస కథనాల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు. దీని ఫలితంగా అధికారులు తనిఖీలు నిర్వహించి సమస్యను పరిష్కరించిన సంఘటనలు ఉన్నాయి. వ్యక్తిగత జీవితంలో ఫజల్ రహమాన్ సరళ జీవనం గడిపే వ్యక్తి. కుటుంబానికి తగిన ప్రాధాన్యం ఇస్తూనే, వృత్తి బాధ్యతలను ఎప్పుడూ విస్మరించలేదు. కుటుంబ సభ్యులు కూడా ఆయన సామాజిక నిబద్ధతను అర్థం చేసుకొని ప్రోత్సహించారు. ఆర్థిక లాభాల కంటే విలువలకు ప్రాధాన్యం ఇచ్చే స్వభావం ఆయన జీవితాంతం కొనసాగింది. ప్రకటనలు, ఒత్తిళ్లు, రాజకీయ ప్రలోభాలు వచ్చినా వాటికి లొంగని వ్యక్తిగా ఆయన పేరుగాంచారు. సామాజిక సేవల విషయంలో కూడా ఫజల్ రహమాన్ ముందుంటారు. జర్నలిస్టుగా మాత్రమే కాక ఒక పౌరుడిగా సమాజానికి ఏం చేయగలమన్న ఆలోచన ఆయనలో ఎప్పుడూ ఉండేది. ప్రకృతి విపత్తుల సమయంలో, వరదలు లేదా కరువు పరిస్థితుల్లో బాధితుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాక స్వచ్ఛందంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, పేద విద్యార్థుల చదువుకు చేయూత వంటి కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. జర్నలిజంలో ఎదురైన ఒత్తిళ్లు, బెదిరింపులు ఆయనను వెనక్కి నెట్టలేకపోయాయి. కొన్ని సందర్భాల్లో ఆయన రాసిన కథనాల వల్ల స్థానిక రాజకీయ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసినా, నిజం వైపు నిలబడటమే ఆయన ధోరణి. ఇదే ధైర్యం ఆయనను ప్రజల్లో మరింత విశ్వసనీయుడిగా మార్చింది. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే జర్నలిస్ట్గా ఫజల్ రహమాన్ గుర్తింపు పొందారు. సీనియర్ జర్నలిస్ట్గా ఎదిగిన తరువాత కూడా ఆయన నేలమీదే నిలబడ్డారు. కొత్తగా జర్నలిజంలోకి వచ్చే యువతకు మార్గదర్శకుడిగా వ్యవహరించారు. వార్త రాయడంలో బాధ్యత, నిజాయితీ, అధ్యయనం ఎంత అవసరమో తన అనుభవాల ద్వారా వారికి వివరించారు. జర్నలిజం అంటే కేవలం వార్తను ముందుగా చెప్పడం కాదు, సమాజానికి దిశానిర్దేశం చేయడమని ఆయన నమ్మకం. మొత్తంగా ఫజల్ రహమాన్ జీవితం ఒక వ్యక్తి జర్నలిజం ద్వారా సమాజానికి ఎలా ఉపయోగపడగలడో చూపించే ఉదాహరణ. బాల్యం నుంచి ఎదుగుదల వరకు, వ్యక్తిగత జీవితం నుంచి ప్రజా జీవితం వరకు ప్రతి దశలో ఆయన నిజాయితీకి కట్టుబడి ఉన్నారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజల సమస్యలను రాష్ట్ర స్థాయి చర్చకు తీసుకువచ్చిన పాత్రికేయుడిగా, గ్రామీణ జర్నలిజానికి గౌరవాన్ని తీసుకువచ్చిన వ్యక్తిగా ఫజల్ రహమాన్ స్థానం చిరస్థాయిగా నిలుస్తుంది. ఆయన ప్రయాణం రాబోయే తరాలకు జర్నలిజం యొక్క అసలైన అర్థాన్ని గుర్తుచేస్తూనే ఉ ంటుంది. ఫజల్ రహమాన్ జీవిత చివరి దశ ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. జర్నలిజం అనేది పదవుల కోసం కాదు, ప్రజల కోసం అన్న సిద్ధాంతాన్ని ఆయన చివరి శ్వాస వరకూ ఆచరించారు. నిజం కోసం నిలబడిన ఒక జర్నలిస్ట్ జీవితం ఇలానే ముగియాలని చెప్పేలా ఆయన చివరి దశ నిలిచింది. ప్రజల గుండెల్లో ఆయన వేసిన ముద్రే ఆయనకు నిజమైన నివాళి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్ - 9440595494**

చురకలు

## సంపాదకీయం

# నేను మోనార్క్‌ని...

### అంతర్జాతీయ చట్టాలతో పనిలేదంటున్న ట్రంప్


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరీ మోనార్క్ లా నిరంకుశంగా వ్యవహరిస్తున్నాడు. అతని దుందుడుకు చర్యలు యూఎస్ ప్రజలకు హీరాయిక్ గా అనిపిస్తున్నాయేమో తెలీదు కానీ మిగిలిన ప్రపంచ దేశాలకు మాత్రం తలనొప్పిగా మారాయి. ఎప్పుడు ఏ దేశంపై ఎలా విరుచుకు పడతాడో అర్థం కానంత సంక్లిష్టంగా తయారైంది అతని పాలనా శైలి. ట్రంప్ 2.0 వెర్షన్ భయంకరంగా ఉంటోంది. అందుకు సాక్ష్యం తాజాగా వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మధురోని బేడీలు వేసి మరీ బంధించడం. ఇందుకు తను చెబుతున్న కారణాలను ప్రపంచ దేశాలు నమ్మడం లేదు. ఆ విషయం ట్రంప్ కు కూడా తెలుసు. కానీ మొండిగా ముందుకు వెళుతున్నారంటే...వెనిజులాను ఆక్రమించు కోవాలనే అని ఎవరికైనా అర్థమవుతుంది. వెనిజులా దేశంలో అపార చమురు నిక్షపాలపై ట్రంప్ కన్ను పడింది. అందుకే ఆ దేశాధ్యక్షణ్ని కుంటి సాకులతో నిర్బంధించి....అమెరికాను బేషరతుగా చమురు వ్యాపారంలో కీలక భాగస్వామిగా చేసుకోవాలని వెనిజులాకు కండిషన్ పెడుతున్నాడు. వెనిజులా అధ్యక్షుడి నిర్బంధం తర్వాతా ట్రంప్ అడుగులు వేగంగా గ్రీన్ ల్యాండ్ వైపు పడుతున్నాయి. డెన్మార్క్ లో భాగమైన గ్రీన్ ల్యాండ్ ను ఎలాగైనా హస్తగతం చేసుకోడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. బెగ్ బారో అన్నట్లు ఆ ప్రాంత ప్రజలపై డాలర్లు విసిరికొట్టి మరీ గ్రీన్ ల్యాండ్ ను స్వాధీనం చేసుకునే కుటిలయత్నానికి తెరలేపాడు. ఇది ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తోంది. గ్రీన్ ల్యాండ్ ను అమెరికాలో విలీనం చేసేందుకు రంగం సిద్దం చేస్తున్నాడన్న వార్త భగ్గుమంటోంది. గ్రీన్ ల్యాండ్ అంటే ట్రంప్ కు అమితాసక్తి. 2019లో తొలిసారిగా అమెరికా అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంలోనే గ్రీన్ ల్యాండ్ కొనుగోలుకు బేరసారాలాడాడు. అప్పట్లో ప్రభుత్వానికి డబ్బు ఆఫర్ చేస్తే...డెన్మార్క్ ప్రభుత్వం దాన్ని నిర్ద్వంద్వంగా ఖండించింది. రెండోసారి అమెరికా అధ్యక్షుడైన నేపథ్యంలో ట్రంప్ ఈసారి డెన్మార్క్ ప్రభుత్వానికి కాకుండా ఏకంగా ప్రజలకే ఎరవేసేందుకు సిద్దమయ్యాడు. ట్రంప్ గ్రీన్ ల్యాండ్ ప్రజలకు బంపర్ ఆఫర్ ఇచ్చాడు. ఆ ద్వీపంలోని ప్రతి వ్యక్తికి 10వేల డాలర్ల నుంచి లక్ష డాలర్ల దాకా ఇచ్చి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించేందుకు వ్యూహం రచిస్తున్నాడు. డబ్బుకు లోకం దాసోహం అన్నట్లు ఒకవేళ గ్రీన్ ల్యాండ్ ప్రజలు డాలర్ల వర్షానికి తడిసి మురిసిపోయేందుకు, తమ స్వేచ్ఛను అమ్ముకునేందుకు సిద్దమైతే మాత్రం ట్రంప్ గ్రీన్ ల్యాండ్ ను సునాయాసంగా స్వాధీనం చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే ట్రంప్ వేస్తున్న ఈ పాచికకు డెన్మార్క్ కంగుతింది. ఊహించని ఈ ఎత్తుగడకు కకావికలమవుతోంది. గ్రీన్ ల్యాండ్ వేరైతే ఏం చేయాలో డెన్మార్క్ ప్రభుత్వానికి అర్థం కావట్లేదు. ఒకవేళ ప్రత్యక్ష యుద్దంలో దిగితే అగ్రరాజ్యంతో ఆటలాడ్డం అంత ఆషామాషీ కాదని ఆందోళన చెందుతోంది. ఉత్తర అమెరికా, యూరప్ మధ్యలో ఉన్న ఈ ద్వీపం సొంతమైతే అమెరికాకు యుద్ధవ్యూహాలు రచించడం మరింత సులువవుతుంది. అమెరికా సైన్యానికి ఇది వ్యూహాత్మక ప్రాంతమవుతుంది. ఇప్పటికే వాయవ్య గ్రీన్ ల్యాండ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరముంది. అరుదైన ఖనిజాలకు పుట్టినిల్లుగా ఉన్న గ్రీన్ ల్యాండ్ సొంతమైతే...ఖనిజాల కోసం చైనా పై ఆధారపడే అవస్థ తప్పుతుందని ట్రంప్ ఆలోచనని చాలా మంది అంటున్నారు. స్వయం పాలిత ప్రాంతంగా, డెన్మార్క్ నియంత్రణలో ఉన్న గ్రీన్ ల్యాండ్ లో లక్షలోపు జనాభా ఉంది. ఇప్పటికే ట్రంప్ కన్ను పలు దేశాలపై పడింది. ఎక్కడైనా సరే తమ పెత్తనం సాగాలన్న దురంహకార ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. అసలు మీకు గ్లోబల్ పవర్స్ ఎవరిచ్చారు? ఏ దేశంపై అయినా సైనికచర్యలు తీసుకునే అధికారం మీకుందా అంటూ ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ ను ప్రశ్నిస్తే....తన నైతికతే తనకున్న పరిమితి అని చాలా తెలివిగా సమాధానం ఇచ్చాడు. అంతర్జాతీయ చట్టాలతో తనకు పనిలేదని, ఏ దేశంలో ప్రజలు బాధపడ్డా తాను సహించబోనని అన్నాడు. పనిలో పనిగా గ్రీన్ ల్యాండ్ స్వాధీనం అమెరికాకు చాలా అవసరమని తెలిపాడు. బహుశా అమెరికా ప్రజల్లో చాలా మంది ఇలాంటి అధ్యక్షణ్నే కోరుకుంటున్నారేమో...ఎందుకంటే ఓ విశ్లేషకుడు మాట్లాడుతూ...అమెరికా అధ్యక్షుడు రాజకీయ నాయకుడు కావల్సిన అవసరం లేదు...బిజినెస్ డీల్ చేసేవాడైతే చాలు...అమెరికన్లకు కావల్సింది ప్రపంచ దేశాలను సమర్థంగా డీల్ చేయడమే అన్నారు. గ్రీన్ ల్యాండ్, వెనిజులా వ్యవహారాలు చూస్తుంటే ఆ మాట నిజమే అనిపిస్తోంది.

# పాత్రికేయ ఘనాపాఠి తుర్లపాటి - జనవరి 11...తుర్లపాటి వర్ధంతి



పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు (1933 ఆగస్టు 10 – జనవరి 11, 2021) ప్రముఖ పాత్రికేయుడు, రచయిత, వక్త. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్య మంత్రి టంగుటూరి ప్రకాశం వద్ద కార్యదర్శిగా పనిచేశారు. పాత్రి కేయుడిగా, రచయితగా, వ్యాఖ్యా తగా, సభాధ్యక్షుడిగా, అనువాద ప్రాసంగికునిగా ప్రసిద్ధి కెక్కారు. 18 మంది ముఖ్య మంత్రులతో సన్నిహి తంగా మెలిగిన వారు. ఆయన రాసిన '18 మంది ముఖ్యమంత్రు లతో నా ముచ్చట్లు' అనే పుస్తకంలో అనేక ఆసక్తికర విషయాలు గ్రంథ స్థం చేశారు. వండర్ బుక్ ఆఫ్ రికా ర్డు, అష్టాదశ సహస్రసభా కేసరి బిరుదు కూడా పొందారు. 2002లో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న తొలి తెలుగు జర్నలిస్టుగా నిలి చారు. రాజకీయ, సినీ తదితర రంగాల ప్రముఖులతో సన్నిహిత పరిచయాలు కలిగి, అక్కినేని నాగేశ్వరరావుకు " నట సామ్రాట్ " బిరుదుని " ప్రతిపాదించినది తుర్లపాటే. 1933 లో విజయవాడ లో జన్మిం చారు. 1946లో 14 సంవత్సరాల వయసులోనే తుర్లపాటి పాత్రికేయ వృత్తిలోకి అడుగు పెట్టారు. 1947 లో రచనా ప్రస్థానంలో భాగంగా మాతృభూమి పత్రికలో 'స్వరాజ్యంలో స్వాతంత్ర్యం' అనే ఆయఅబశ్రీశ్రీనఅబశ్రీశ్రీ తొలివ్యాసం 1947 మార్చి 22న ప్రచురితమైంది. 1951లో ఆచార్య ఎన్‌జీ రంగారావు వాహిని పత్రికలో మొదటిసారిగా కుటుంబరావు ఉప సంపాదకుడిగా పనిచేశారు. తర్వాత చలసాని రామారాయ్ 'ప్రతిభ' పత్రికకు ఎడిటర్‌గా విధులు నిర్వర్తించారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఆయన్ని చెన్నైకి పిలి పించి, తను నడుపుతున్న ప్రజాపత్రికలో సహాయ సంపాద కుడిగా నియమించారు. అంతే కాకుండా సహాయ సంపాదకుడితో పాటు ప్రకాశం పంతులుకు కార్య దర్శిగానూ ఏక కాలంలో పని చేశారు. అనంతర కాలంలో 1960 మే 21 నుండి 1963 జూన్ వరకు, 1965 నుండి 1991చివరి వరకు ఆంధ్రజ్యోతికి ఎడిటర్‌గా పనిచేసి తదుపరి స్వేచ్ఛా పాత్రికేయనిగా తన వ్యాసంగం కొనసాగించారు. ప్రముఖ నాయకులు అంబేద్కర్, నెహ్రూ, రాజాజీలను ఇంటర్వ్యూ చేసే అవకాశాలు వచ్చాయి. 1960 లో ప్రారంభించిన వార్తలలోని వ్యక్తి అనే శీర్షికను మొదటి నాలుగు సంవత్సరాలు రోజువారీ శీర్షికగా ఆ తరువాత వారంవారీ శీర్షికగా 1991 వరకు కొనసాగించి ఆ తరువాత వార్త పత్రికలో 2010 నాటికి 50 సంవత్సరాలు నిర్వహించిన ఘనత తుర్లపాటిదే. ఈ శీర్షికలో భాగంగా నాలుగు వేలకుపైగా వ్యక్తుల జీవిత రేఖాచిత్రాలు రచించారు. స్వాతం త్ర్య సమర యోధులు, జాతీయ వాదులు, ప్రముఖ వ్యక్తులు దాదా పు 6 వేల జీవిత చరిత్ర లను రాసి, తెలుగు సాహిత్యంలో వ్యక్తుల జీవిత చరిత్రల రచయితగా ముద్ర వేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో, ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో వేలాది సమావేశాలకు అధ్యక్షునిగా, దాదా పు 20 వేల సమావేశాల్లో వక్తగా ప్రసంగించారు. 1969లో నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీలో సభ్యునిగా కేంద్రం ప్రభు త్వం తుర్లపాటి నియమితులు అయినారు. నేషనల్ ఫిల్మ్ అడ్వై జరీ కమిటీలో, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డులో సభ్యుడిగా విధులు నిర్వర్తించారు. సుమారు మూడు దశాబ్దాల పాటు ఏపీ ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా విధులు నిర్వహించారు. 1989లో ముట్నూరి కృష్ణారావు నుంచి ఉత్తమ ఎడిటర్ అవార్డు పొందిన కుటుంబరావు, 1990లో ఉత్తమ జీవిత చరిత్రల రచయితగా తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అవార్డు అందుకున్నారు. ఉపన్యాస కేసరి బిరుదు వరించింది. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 1994లో కాశీనాథుని నాగేశ్వరరావు నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డు అందు కున్నారు. 1993లో గిన్నిస్ బుక్ అవార్డు, 1998లో అమెరికా నుంచి వరల్డ్ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు పొందారు. 2002లో పద్మశ్రీ అవార్డు పొందారు. 2010 జూన్ 21 న ఆంధ్ర ప్రదేశ్ గ్రంథలయ పరిషత్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. తుర్లపాటి కుటుంబరావుకు పాత్రి కేయ వృత్తిలో సుదీర్ఘ అనుభవం ఉంది. దాదాపు ఏడు దశాబ్దాల పాటు అనేక విషయాలపై విశ్లేష ణలు చేశారు. జర్నలిస్టుగా, రచయి తగా, వ్యాఖ్యాతగా, సభ అధ్యక్ష డిగా, అనువాద ప్రసంగికునిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. పాత్రికేయ వృత్తిలో విలువలను ఎప్పుడూ వదులు కోలేదు. జేబులో నిరంతరం "రాజీనామ పత్రం" పెట్టుకుని ఉండేవారని చెపుతారు. 87 సంవత్సరాల వయసులో 2021 జనవరి 11న విజయవాడలోని ఓ ప్రైవేటులో చికిత్స పొందుతూ, గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. తుర్ల పాటి గురించి ప్రముఖుల వ్యాఖ్యానాలు ఇలా ఉన్నాయి... తుర్లపాటి కేవలం ప్రఖ్యాత జర్న లిస్టు మాత్రమే కాదు... మరెన్నో రంగాలలో ప్రతిభా వంతుడు" – కె.ఆర్. నారాయణన్ , భారత మాజీ రాష్ట్రపతి. "గార్డియన్ ఆఫ్ తెలుగు" – రాజాజీ, భారత మాజీ గవర్నర్ జనరల్. "పత్రికా నిర్వహణలో కుటుంబ రావు దిట్ట, సభా నిర్వహణలో దక్షుడు, జంకు గొంకూ లేకుండా మట్లాడే ఉపన్యాసకుడు"– ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. "ఆధునిక రాజకీయ జర్నలిస్టులలో అందె వేసిన చెయ్యి, యువతరానికి మార్గదర్శకుడు"– నీలం సంజీవరెడ్డి, మాజీ భారత రాష్ట్రపతి. "ప్రెస్, పిక్చర్, ప్లాట్ ఫారం – ఈ మూడు తుర్లపాటి చేతిలోని పదునైన ఆయుధాలు. ఆయన అంతగా రాణించడానికి ఇవే కార ణాలు."– వందేమాతరం రామ చంద్రరావు, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# మానవ అక్రమ రవాణా - ఒక మానవతా విషాదం - జనవరి 11...జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం




ప్రపంచ వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా ఒక క్రూరమైన నేరంగా కొనసాగుతోంది. ఇది వ్యక్తుల జీవితాలను దోచుకుంటూ, వారి స్వేచ్ఛను హరించి, అనేక శారీరక, మానసిక బాధలను కలిగిస్తోంది. ప్రతి సంవత్సరం జనవరి 11న మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటూ, ఈ సమస్యపై అవగాహన కల్పించడం, బాధితుల హక్కులను రక్షించడంలో ప్రపంచం ముందడుగు వేస్తోంది.

**మానవ అక్రమ రవాణా అంటే ఏమిటి?...** మానవ అక్రమ రవాణా అంటే... ఒక వ్యక్తిని మోసం చేయడం, బలవంతం చేయడం లేదా ప్రలోభ పెట్టడం ద్వారా తరలించడం. వారి శ్రమ, లైంగికత, లేదా ఇతర ప్రయోజనాల కోసం వారిని ఇబ్బందులకు గురి చేయడమే ముఖ్య ఉద్దేశం. ఇది అనేక రూపాల్లో ఉంటుంది: గులామి వ్యాపారం – బలవంతపు కార్మికులుగా మార్చడం, లైంగిక దోపిడీ – వ్యభిచారంలోకి బలవంతంగా నెట్టడం, బాలల అక్రమ రవాణా – బాలలను కూలీగా, వైషమ్యాల కోసం వాడుకోవడం, అవయవాల అక్రమ వ్యాపారం – బాధితుల అవయవాలను అన్యాయంగా తీసుకోవడం.

**మానవ అక్రమ రవాణా ఎందుకు జరుగుతుంది?** మానవ అక్రమ రవాణా కొనసాగడానికి ప్రధాన కారణాలు... పేదరికం: జీవనోపాధి కోసం పేదలు ప్రలోభాలకు గురవుతారు. విద్య, అవగాహన లేమి: తక్కువ స్థాయిలో ఉన్న ప్రాంతాల ప్రజలు ఈ నేరానికి బలవుతారు. అసమానతలు: లింగ, జాతి, మత వివక్షలు మానవ అక్రమ రవాణాను ప్రోత్సహిస్తాయి. నేర మాఫియాలు: సంఘటిత నేర గుంపులు దీన్ని లాభదాయకమైన వ్యాపారంగా నిర్వహిస్తాయి.

**బాధితులపై ప్రభావం...**

శారీరక హింస: బాధితులపై రోజువారీ హింస.

లైంగిక హింస: బలవంతపు లైంగిక దోపిడీకి గురి కావడం.

మానసిక వేధింపులు: భయభ్రాంతులు, అవమానం, ఒత్తిడి.

బలవంతపు కార్మిక దోపిడీ: తక్కువ వేతనాలకే ఎక్కువ పని చేయించడం.

స్వేచ్ఛ కోల్పోవడం: తమ మనోగతానికి విరుద్ధంగా ఒక ప్రదేశంలో నిర్బంధించడం.

**మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు...**

**చట్టాల అమలు:** ఈ నేరాలకు కఠిన శిక్షలు విధించే చట్టాలు రూపొందించాలి. అంతర్జాతీయ చట్టాల అమలు ద్వారా నేరస్థులను శిక్షంచాలి.

**అవగాహన:** ప్రజలలో మానవ అక్రమ రవాణా ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఈ విషయం గురించి చెప్పాలి.

**బాధితుల పునరావాసం:** బాధితులకు భౌతిక, మానసిక చికిత్స అందించాలి. వారిని నేరపరుల నుంచి రక్షంచేందుకు ప్రత్యేక సాయం అందించాలి. ఉద్యోగ అవకాశాలు మరియు విద్య అందించాలి.

పోలీస్ మరియు చట్ట అమలు సంస్థల సమన్వయం: నేరస్థుల గుట్టు రట్టు చేయడానికి మరియు బాధితులను రక్షంచడానికి బలమైన చట్ట వ్యవస్థ అవసరం.

ఆర్థిక అవకాశాలు: పేదరికాన్ని తగ్గించడానికి, ప్రతి వ్యక్తికి సమాన ఆర్థిక అవకాశాలు కల్పించాలి. మానవ అక్రమ రవాణా సమస్య సమాజానికి చెరగని మచ్చ. ఈ దినోత్సవం మానవతా విలువలను గుర్తుచేసే అవకాశం. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధితుల పక్షంలో నిలబడి, అవగాహన పెంచి, ఈ సమస్యను నిర్మూలించేందుకు కృషి చేయాలి. మానవ హక్కుల పరిరక్షణ కోసం మానవత్వం, సహకారం, సమగ్ర దృష్టి అవసరం. మనం కలిసి పని చేస్తే, మానవ అక్రమ రవాణా రహిత ప్రపంచాన్ని నిర్మించ గలుగుతాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ప్రజల జీవితాలలో మమేకమైన ఆర్టీసీ - జనవరి 11... ఆంధ్రప్రదేశ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏర్పాటు దినం



1958 జనవరి 11, తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఒక కీలక తేదీ. ఆ రోజే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఆర్టీసీ) అధికారికంగా ఏర్పాటైంది. కోస్తా, రాయలసీమ ప్రాంతాలలోని ప్రైవేటు రవాణాను జాతీయం చేయడంతో ఈ సంస్థ అస్తవ్యస్తంగా ఉన్న రవాణా వ్యవస్థకు ఒక క్రమబద్ధమైన నిర్మాణాన్ని అందించింది.

**ఏర్పాటుకు నేపథ్యం...** విభజన మరియు ఏకీకరణ: భారతదేశ స్వాతంత్ర్యానంతరం విభజన సమయంలో ఆంధ్ర ప్రాంతం మద్రాస్ రాష్ట్రంలో భాగమైంది. తెలుగు భాషా ప్రజల ఆకాంక్ష మేరకు 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. తర్వాత తెలంగాణతో కలిసి గ్రేటర్ ఆంధ్రప్రదేశ్ ఏర్పడడంతో రవాణా వ్యవస్థ మరింత విస్తరించింది.

ప్రైవేటు రవాణా సమస్యలు: ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందు ప్రైవేటు రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. టికెట్ రేట్లు ఏకరీతిగా లేకపోవడం, బస్సుల నాణ్యత తక్కువగా ఉండడం వంటి సమస్యలు ఎదురైనాయి.

ప్రజా రవాణా అవసరం: పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ నేపథ్యంలో ప్రజలకు సరైన రవాణా సౌకర్యాలు అందించడం అత్యవసరం అని గుర్తించబడింది.

**ఏపీఆర్టీసీ ఏర్పాటుతో కలిగిన ప్రయోజనాలు...** ఏకీకృత రవాణా వ్యవస్థ: ప్రైవేటు రవాణాను జాతీయం చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏకీకృత రవాణా వ్యవస్థ ఏర్పడింది. సరసమైన టికెట్ రేట్లు: అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా టికెట్ రేట్లను నిర్ణయించారు.

బస్సుల నాణ్యత పెరుగుదల: క్రమంగా బస్సుల నాణ్యత పెరిగి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు లభించాయి. గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం: గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని విస్తరించడానికి ఏపీఆర్టీసీ కృషి చేసింది.

ఉద్యోగ అవకాశాలు: ఏపీఆర్టీసీ ఏర్పాటుతో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ...** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర ప్రజలకు రవాణా సేవలను అందిస్తూ సామాజిక, ఆర్థిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఞాూా=ుజ) నుంచి ఞా=ుజగా విడిగా ఏర్పడింది. TSRTC ప్రజలకు సమర్థవంతమైన, సురక్షతమైన, సౌకర్యవంతమైన సేవలను అందించేందుకు అంకితభావంతో పనిచేస్తోంది.

**టీ ఎస్ ఆర్టీసీ ఆవిర్భావం...** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల రవాణా అవసరాలు పెరిగాయి. ఈ క్రమంలో ఞాూా=ుజని విభజించి 2016లో ఞా=ుజని ప్రత్యేక సంస్థగా ఏర్పాటు చేశారు. ఞా=ుజ తెలంగాణ ప్రజల రవాణా అవసరాలకు ప్రత్యేకించి సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది.

**మొదటి దశలో TSRTC సేవలు:** బస్సుల సంఖ్య: TSRTC ప్రారంభంలో 10,000 బస్సులు, 95 డిపోలు, 364 బస్సు స్టేషన్‌లతో కార్యకలాపాలు ప్రారంభించింది.

ఉద్యోగులు: సుమారు 57,000 మంది ఉద్యోగులు ఞా=ుజలో చేరారు.

కనెక్టివిటీ: తెలంగాణలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాలను అనుసంధానిం చేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది.

**TSRTC సేవల విభాగాలు...**

**పల్లె వెలుగు బస్సులు:** గ్రామీణ ప్రాంతాలకు కనీస చార్జీలతో రవాణా అందిస్తోంది. 70% మంది గ్రామీణ ప్రజలు ఞా=ుజ పల్లె వెలుగు సేవలను వినియోగిస్తున్నారు.

**సిటీ బస్సు సేవలు...** హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి నగరాల్లో సిటీ బస్సులు నడుపుతోంది. నగరాల ట్రాఫిక్‌ను తగ్గించడంలో వీటి పాత్ర కీలకం.

**సూపర్ లగ్జరీ బస్సులు:** దూర ప్రయాణాల కోసం అధునాతన సౌకర్యాలతో బస్సులు అందిస్తోంది. శీతలీకరణతో పాటు లగ్జరీ సీటింగ్ కూడా అందుబాటులో ఉంది.

**గరుడ, గరుడ ప్లస్ బస్సులు:** వోల్వో, స్కానియా వంటి అధునాతన వాహనాలు ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలను అందిస్తున్నాయి.

**పర్యాటక సేవలు:** యాదగిరిగుట్ట, బసర, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సేవలు. పర్యాటకులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

**డిజిటల్ సేవలు:** ఆన్‌లైన్ టికెట్ బుకింగ్, లైవ్ బస్సు ట్రాకింగ్ వంటి సదుపాయాలను అందిస్తోంది. ప్రయాణికులకు వేడుకల సమయంలో ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతోంది.

**టి ఎస్ ఆర్టీసీ ప్రాధాన్యత...** గ్రామీణ ప్రాంతాలకు సేవలు: దాదాపు ప్రతి గ్రామాన్ని పట్టణాలకు అనుసంధానం చేస్తోంది. ఇది గ్రామీణ అభివృద్ధికి దోహద పడుతోంది.

పర్యావరణ పరిరక్షణ:ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి పర్యావరణ సమస్యలను తగ్గించేందుకు కృషి. నిర్జీవ ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా కార్బన్ ఉద్గారాలను నియంత్రిస్తోంది.

ఆర్థిక ప్రాధాన్యత: ప్రజా రవాణా ద్వారా రాష్ట్ర ఆదాయానికి మద్దతు. ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన భాగంగా ఉంది.

సురక్షత ప్రయాణం: ప్రతి బస్సు డ్రైవర్ మరియు కండక్టర్‌కు ప్రత్యేక శిక్షణ. ప్రయాణికుల భద్రత టి ఎస్ ఆర్టీసీకి అత్యంత ప్రాధాన్యం.

**టి ఎస్ ఆర్టీసీకి సవాళ్లు..**

ఆర్థిక సమస్యలు: పెరిగిన ఇంధన ధరల వల్ల నిర్వహణ ఖర్చులు పెరిగాయి. ప్రైవేటు బస్సుల పోటీ కారణంగా ఆదాయంలో తగ్గుదల. ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ పోటీ: ప్రైవేట్ క్యాబ్‌లు బస్సుల పోటీ పెద్ద సవాల్‌గా మారింది.

పాత బస్సుల నష్టం:పాత బస్సుల నిర్వహణ వ్యయం ఎక్కువవుతోంది. సేవల నాణ్యతను మెరుగుపరచడం అవసరం.

**భవిష్యత్తు వ్యూహాలు..**

ఆధునీకీకరణ:కొత్త బస్సులను ప్రవేశపెట్టి సేవలను మెరుగుపరచడం. ఎలక్ట్రిక్ బస్సులు, గ్రీన్ టెక్నాలజీ వినియోగం.

డిజిటల్ సేవల విస్తరణ.లైవ్ ట్రాకింగ్, ఆన్‌లైన్ బుకింగ్‌ను మరింత విస్తరించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం.


ప్రభుత్వ మద్దతు:ఆర్థిక సహాయం, సబ్సిడీలు ద్వారా పునరుద్ధరించడం.

సేవల విస్తరణ: కొత్త మార్గాలు, ప్రత్యేక పర్యాటక సేవలు ప్రారంభించడం.

నగరాల ట్రాఫిక్‌ను తగ్గించేందుకు మెట్రోపోలిటన్ సేవలను బలోపేతం చేయడం. టి ఎస్ ఆర్టీసీ...తెలంగాణ రాష్ట్ర ప్రజల జీవితాలలో భాగంగా ఉంది. ఇది కేవలం రవాణా సేవలు అందించడంలోనే కాకుండా, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి కూడా సహకరిస్తోంది. ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ, రాబోయే రోజులలో మరింత శ్రేయోభిలాషిగా మారే అవకాశం ఉంది. "సురక్షత ప్రయాణం, సౌకర్యవంతమైన సేవ" అన్న నినాదంతో టి ఎస్ ఆర్టీసీ తెలంగాణ గర్వకారణంగా నిలుస్తోంది.


**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# ఆదివాసీ సాంస్కృతిక వైభవం మేడారం జాతర

















మేడారం జాతర చరిత్రలో ప్రతి ఒక్కరికి తెలిసేలా.. వన దేవతల గద్దెలు, జంపన్న వాగు ఆధునీకరణ పనులు తరతరాలు నిలిచేలా ప్రజా ప్రభుత్వం సిద్దం చేయిస్తున్నది.

ఆసియా ఖండం లోనే అతి పెద్ద ఆదివాసీ జాతరగా పేర్కొనబడిన "సమ్మక్క -- సారలమ్మ మేడారం మహా జాతర" ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ పౌర్ణమి రోజులలో జరుగుతుంది. దశాబ్దాల కాలం నుండి బుధ, గురు, శుక్ర, శని వారాలలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నా ఆచారం. ఈ మహా జాతర ను "తెలంగాణా కుంభమేళా" గా పేర్కొంటారు. ఈ జాతరకు లక్షలాది మంది తరలివస్తారు. కోరిక కోర్కెలు తీర్చే అమ్మవార్లకు ఘనమైన పూజలు చేస్తారు. ఇంత పెద్ద ఎత్తున జరిగే జాతరకు ఈ సారి మేడారం పున:నిర్మాణం పనుల వలన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఘన కీర్తి**

తెలుగు జాతి చరిత్రలో కాకతీయ సామ్రాజాన్ని స్వర్ణ యుగంగాను, మహోజ్వల ఘట్టంగాను పేర్కొంటారు. చరిత్ర పరిశీలిస్తే కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు ఓరుగల్లు ను రాజధానిగా చేసుకొని పరిపాలించిన కాలంలో ఆదివాసీలు తమ స్వేచ్ఛ, స్వాతంత్యల కొరకు పోరాటం చేసి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆదివాసీ హక్కులను కాపాడిన వీరవనితలుగా సమ్మక్క -- సారలమ్మలు చరిత్రలో ప్రసిద్దిపొందారు. వారి బలిదానాలనే నేడు "మేడారం మహా జాతరగా" నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**గతంలో చూసిన మేడారానికి.. ప్రస్తుతానికి ఎంతో తేడా**

ఎట్లున్న మేడారం ఎట్ల మారింది. నేడు మేడారం స్వరూపం పూర్తిగా మారిపోయింది. నాటి మేడారానికి నేటి మేడారానికి ఎంతో తేడా కనిపిస్తోంది. భక్తులు మెచ్చేలా.. మురిసేలా... రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతర నిర్వహణకు అవసరమైన అభివృద్ధి పనులు భారీ స్థాయిలో చేపట్టారు. ఆదివాసీ పెద్దలు, పూజారుల సంఘం సంపూర్ణ ఆమోదంతోనే మేడారం అభివృద్ధి పునర్నిర్మాణ పనులకు ప్రజా ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. జాతర నిర్వహణకు అవసరమైన వసతుల కల్పన, అభివృద్ధి పనులు అద్భుతంగా చేపడుతోంది. మేడారం సమ్మక్క--సారలమ్మ మహా జాతరకు విస్తృత ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. మేడారం ధగ ధగా మెరుస్తోంది. ఏర్పాట్లు, అభివృద్ధి పనులను చూసి భక్తులు మురిసిపోతున్నారు. కొత్త సొగబులు.. కాంతులు వారిని కట్టిపడేస్తున్నాయి. గత పాలకులు ప్రతి సారి జాతర వచ్చిందంటే కోట్లాది రూపాయలు వెచ్చించి తాత్కాలికంగా అభివృద్ధి పనులు, వసతులు కల్పించేవారు. ప్రతీ సారి ఇదే జరుగుతుండేది.

**శాశ్వత నిర్మాణాలు..**

వందల ఏళ్లపాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గద్దెల శాశ్వత పున: నిర్మాణం పనులు చేపట్టింది. జనవరి ఐదో తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు రాత్రింభవళ్లు అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. గద్దెల విస్తరణ, ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రానైట్ రాతి ప్రాకార నిర్మాణం, స్వాగత తోరణాల ఏర్పాటు పనులు తుది దశలో వేగంగా సాగుతున్నాయి.

**పిల్లర్లపై సంస్కృతి, ఆచారాలు, చరిత్ర..**

మేడారం గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ ఫిల్లర్లపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, చరిత్రను తీర్చిదిద్దారు. మార్బుల్ శిలలతో గద్దెలూ జంపన్నవాగు సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థలు, ఫ్లడ్ మేనేజ్‌మెంట్, 60 అడుగుల నుంచి నాలుగు లైన్లకు రోడ్ల విస్తరణ, క్యూ లైన్లు, సత్రాలు, వాచ్ టవర్లు, గ్రీనరీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరోవైపు జాతర సజావుగా సాగేందుకు మహా కుంభమేళాలో భాగస్వాములైన నిపుణుల బృందం మేడారానికి చేరుకుని.. జాతర జరిగే ప్రాంతం, అక్కడికి దారి తీసే మార్గాలు, జాతర రద్దీ ఉండే ఉప ఆలయాలను సందర్శించి.. అధికారులకు తగిన సూచనలు..సలహాలు చేసింది. ఈసారి జాతరకొచ్చే భక్తులకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా గద్దెల సమీపంలోనే ఏకకాలంలో వేల వాహనాల పార్కింగ్‌కు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ నాలుగు రోజులూ డ్రోన్‌షో ప్రత్యేక ఆకర్షణ కానున్నది. ఎక్కడ నిర్వహించాలో త్వరలో నిర్ణయం తీసుకుంటారు. జాతరపై సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు డాక్యుమెంటరీ కూడా రూపొందిస్తున్నారు.

**మేడారం సమగ్రాభివృద్ధికి 251 కోట్ల రూపాయల మంజూరు..**

మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం రూ. 251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గద్దెల విస్తరణకే రూ. 101 కోట్లు కేటాయించింది. 4,000 టన్నుల గ్రానైట్‌తో గద్దెల ప్రాంగణ నిర్మాణ పనులు చేపట్టారు. 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించిన 7,000కి పైగా శిల్పాలు, 930 ఏళ్ల కోయల తాళపత్ర గ్రంథల ఆధారంగా శిల్ప రూపకల్పన చేశారు. 46 స్తంభాలతో 271 చ.మీ విస్తీర్ణంలో ప్రాకారం, 8 స్తంభాలతో వృత్తాకార గద్దె నిర్మాణం చేపట్టారు. 40 అడుగుల వెడల్పుతో 3 స్వాగత తోరణాలు, 30 అడుగుల వెడల్పుతో 5 స్వాగత తోరణాలు, 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బండారి, మర్రి, వెదురు, వేప, ఇప్ప తదితర 12 రకాల పవిత్ర వృక్షలు ఇక్కడ ఉన్నాయి. 140 రకాల ఆయుర్వేద మొక్కల నాటనున్నారు. పూజారుల సంఘం ఆమోదంతోనే అన్ని పనులు జరుగుతున్నాయి. మేడారం నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం నిర్మిస్తున్నారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నారు. శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేశారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా చెక్కించారు. ఇందుకోసం తెలుపు రంగు రాళ్లను ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు తరలించి శిల్పులతో చెక్కించాక మేడారానికి తీసుకొచ్చారు.

**భావి తరాలకు తెలిసేలా... శిలలపై తల్లుల చరిత్ర..**

మేడారంలో కోయల ఆచార సంప్రదాయాలకు తగ్గట్టుగా సర్కారు పనులు చేపడుతూ.. సమ్మక్క సారక్క తల్లుల చరిత్ర అందరికీ తెలిసేలా శిలలపై చెక్కించారు. కోయల వద్ద దొరికిన 930 ఏండ్ల నాటి తాళపత్ర గ్రంథల ఆధారంగా చెక్కించిన శిల్పాలు, చిహ్నాలు. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్క, సారక్క పగిడిద్దరాజు, గోవిందరాజు, కోయల ఇష్టదైవాలకు ప్రతిరూపంగా భావించే పులి, జింక, దుప్పి, పావురం, ఏనుగు, నెమలి, మొసలి, పశుపక్ష్యదులతో పాటు కోయల జీవనశైలికి, ఆచార సంప్రదాయాలకు, గొట్టుగోత్రాలకు ప్రతిరూపంగా భావించే సూర్యచంద్రులు, త్రిశూలం, నెలవంక, బండి చక్రాలు, అడ్డ, నిలువు గీతలకు స్తంభాలపై చోటు దక్కింది. అలాగే సమ్మక్క- సారలమ్మ వంశస్తులైన దాదాపు 250 కోయల ఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కడం ద్వారా వాళ్ల చరిత్రను భావితరాలు తెలుసుకునే అవకాశం దక్కుతుంది. అందు కోసమే ప్రత్యేకంగా కోయల ఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కించేందుకు ప్రాధాన్యమిచ్చారు. గద్దెల ముందు తెల్లని గ్రానైట్ స్తంభాలతో ఏర్పాటు చేస్తున్న ప్రధాన ద్వారం, ఆయా శిలలపై సమ్మక్క -- సారలమ్మ పూర్వీకులతో పాటు, కోయల జీవనశైలిని తెలిపేలా చెక్కిన ఏడు వేల బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. 50 ఫీట్ల వెడల్పుతో ఉన్న ఈ ప్రధాన ద్వారానికి 25 ఫీట్ల ఎత్తు, 5 ఫీట్ల వెడల్పుతో రెండువైపులా రెండేసి నిలువు స్తంభాలు, వాటిపై 80 పీట్ల పొడవైన అడ్డ స్తంభం, దానిమీద 60 ఫీట్ల పొడువైన మరో అడ్డ స్తంభం ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు గద్దెల చుట్టూ 25 ఫీట్ల ఎత్తు, 5 ఫీట్ల వెడల్పుతో 8 స్తంభాలు నిలుపుతున్నారు. వీటిపై సమ్మక్క- సారలమ్మ తో పాటు 3,4,5,6,7 గొట్టుగోత్రాలను బొమ్మలుగా చెక్కారు. గద్దెల చుట్టూ బయటి వైపు శిలలపై ఆదివాసీల జీవన విధానం, వారి దేవతల బొమ్మలు, ఇంకా 750 కోయ ఇంటి పేర్లకు సంబంధించిన జీవన చిత్రాలను గీశారు. వీటిని చెక్కేందుకు ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో దాదాపు 450 మంది కళాకారులు నెలల తరబడి రేయింబవళ్లు శ్రమించారు. ఇంతటీ మహాద్భుతంగా మేడారం జాతర నిర్వహణకు ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టడం రికార్డే..జి.లక్ష్మణ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, సమాచార,పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పిఆర్), కరీంనగర్ జిల్లా.



**జి.లక్ష్మణ్ కుమార్,అసిస్టెంట్ డైరెక్టర్,**
**సమాచార,పౌర సంబంధాల శాఖ**
**(ఐ అండ్ పిఆర్), కరీంనగర్ జిల్లా.**

# కంచేసి.. కాజేసి

నకిరేకల్ : ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎంఆర్పీ) ప్రధాన కాల్వ ఆక్రమణలకు గురవుతోంది. కాల్వకు ఇరువైపులా ఉన్న నీటిపారుదల శాఖ భూములకు యథేచ్ఛగా కంచెలు వేసి ఆక్రమిస్తున్నా.. అధికారులు చోద్యం చూస్తున్నారు. ఏఎంఆర్పీకి చివరి ప్రాంతంలో ఉన్న నకిరేకల్ నియోజకవర్గంలో మైనర్ కాల్వలకు నీరు రాకపోవడంతో నకిరేకల్, చందుపట్ల, మర్రూరు మంగళపల్లి, పాలెం, నోముల గ్రామాల్లో ఇవి ఆక్రమణలతో రూపు కోల్పోయాయి. ప్రధాన, మేజర్, మైనర్ కాల్వల భూములను వీటి వెంట ఉన్న కొందరు ఆక్రమిస్తున్నారు. దాదాపు 200 ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైనట్లు అంచనా. గతంలో అధికారులు ఏర్పాటు చేసిన హద్దురాళ్లు (ఫిల్లర్లు) ధ్వంసం చేస్తూ తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు.

**ఏఎంఆర్పీ ఇలా..**

జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగు, తాగునీరందించే లక్ష్యంతో నిర్మించిన ఏఎంఆర్ ప్రాజెక్టు ప్రధాన కాల్వ పీఏపల్లి మండలంలో



మొదలై 135 కి.మీ. ప్రయాణించి నకిరేకల్ మండలం నడిగూడెం వద్ద మూసీ రిజర్వాయర్‌లో కలుస్తుంది. దీనికి 55 డిస్ట్రిబ్యూటర్లు, 250పైగా మైనర్ కాల్వలున్నాయి.

**చర్యలు తీసుకుంటాం..:**

భూషణాచారి, డీఈఈ, నీటిపారుదలశాఖ నకిరేకల్ డివిజన్

ఏఎంఆర్పీ కాల్వల ఆక్రమణల నిరోధానికి ప్రత్యేక దృష్టిపెట్టాం. ఆక్రమణలు గుర్తించి వారికి నోటీసులు జారీచేసి చట్టప్రకారం చర్యలు చేపడతాం. గతంలో కొందరు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేశాం.

**ఆక్రమించి.. అక్రమ నిర్మాణాలు** నకిరేకల్‌లో ప్రధాన కాల్వ భూములు ఆక్రమించి అక్రమంగా ఇళ్లు, దుకాణాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన కాల్వ వెంట 117 కి.మీ. నుంచి 125 కి.మీ. వరకు కుడి, ఎడమ వైపు ఉన్న కాల్వ భూముల హద్దుల ఫిల్లర్లలను కూల్చి ఆక్రమించారు. కాల్వ భూముల్లోకి చొచ్చుకుని వచ్చి వ్యాపార భవనాలు నిర్మిస్తున్నా పట్టింపు లేదు బీ నకిరేకల్ శివారులో ప్రధాన కాల్వ భూమిని ఆక్రమించి చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. నీటి పారుదల శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఆక్రమణలు జరుగుతున్నా తమ దృష్టికి రాలేదంటూ అధికారులు దాటవేస్తుండటం గమనార్హం. నకిరేకల్ పద్మానగర్, కొర్లపహాడ్, ఇనుపాముల, చెర్కుపల్లి తదితర గ్రామాల్లో విస్తరించిన ఏఎమ్మార్ డిస్ట్రిబ్యూటరీ, మైనర్ కాల్వలు ఆక్రమణల బారిన పడ్డాయి.

# పండగకు ప్రత్యేక బస్సులు

భానుపురి : సంక్రాంతికి ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. విద్య, వ్యాపారం, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సంక్రాంతి పండగను సొంత ఊరిలో జరుపుకొనేందుకు వెళుతుంటారు. ఇలాంటి వారు సురక్షితమైన ప్రయాణం సాగించేందుకు ఆర్టీసీ అధికారులు అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఆధార్ కార్డున్న మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తోంది.

**రీజియన్ పరిధిలో..**

నల్గొండ రీజియన్ పరిధిలో ఏడు డిపోలు ఉన్నాయి. ఈనెల 9 నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు కార్యాచరణ ప్రకటించారు. మొత్తం 298 ప్రత్యేక బస్సులను రీజియన్ పరిధిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో డిపోల వారీగా బస్సులను ఇప్పటికే సిద్ధంగా



ఉంచారు. ప్రయాణికులతోపాటు ప్రభుత్వం ఈ నెల 10 నుంచి 16 వరకు విద్యాసంస్థలకు సెలువులు ప్రకటించింది. హైదరాబాద్‌కు విద్య, ఉద్యోగం, వ్యాపారాల నిమిత్తం వెళ్లినవారు వేలాది మంది ఉన్నారు. సంక్రాంతికి స్వస్థలాలకు రానున్నారు. వీరికి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు అదనంగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారు.

**ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం**

–కొణతం జాన్‌రెడ్డి, ఆర్ఎం ఆర్టీసీ, నల్గొండ

ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రయాణికులు ఆదరించాలి. ఇబ్బందులు లేకుండా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చడమే మా లక్ష్యం. రద్దీని బట్టి అదనంగా సర్వీసులు నడుపుతాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# యూరియా.. చాలయా..!

ఖమ్మం : పంటలకు యూరియా ఎక్కువగా వినియోగించటం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని పలువురు శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రసాయన ఎరువులను విచ్చలవిడిగా ఉపయోగించటం వల్ల జరిగే నష్టాల గురించి 'ఐక్యరాజ్యసమితి' సైతం ఇటీవల నివేదికలో వివరించింది. చాలామంది రైతులు అవసరానికి మించి యూరియా వేయటం వల్ల కొరత సైతం ఏర్పడుతోంది. రసాయన ఎరువుల ధరలు తక్కువగా ఉండటం వల్ల వీటిపైనే మోజు పెంచుకుంటున్నారు. వ్యవసాయశాఖ నిర్దేశించిన మోతాదు ప్రకారం రైతులు యూరియాను వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. తద్వారా భూసారం దెబ్బతినదని, పర్యావరణానికి ముప్పు వాటిల్లదని చెబుతున్నారు. **ఉభయ జిల్లాల్లో..** యాసంగిలో ఖమ్మం జిల్లాలో 5,04,359 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా. 83,287 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు భావిస్తున్నారు. డిసెంబర్ 31 నాటికి జిల్లాకు 24,194 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. మిగతా సరకు రావాల్సి ఉందని వివరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 13,705 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు సిద్ధంగా ఉందని వెల్లడిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో వరి- 77,427, మొక్కజొన్న- 60,250, వేరుసెనగ- 2,653, మినుము- 291, పెసర- 583, నువ్వులు- 250, కూరగాయల పంటలు 843 ఎకరాల్లో సాగవుతాయని సమాచారం.

# స్వచ్ఛ భాగ్యం లేదా..?



కూకట్‌పల్లి : జోన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. కాలనీ రెండో ఫేజ్‌లోని ఓ ఖాళీ స్థలం ముందు చెత్త కుప్పను తయారు చేశారు. దాన్ని తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని స్థానికులు కోరితే.. నానా రభస చేసి ఘర్షణకు దిగారు. కాలనీవాసులే పడేశారని వారే తొలగించాలని వాదనకు దిగారు.

**ఇదీ పరిస్థితి**

గతనెల 31 నుంచి జీహెచ్ఎంసీ, విలీన మున్సిపాలిటీలు కలిపి 300 డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించాలని కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి డివిజన్‌కు ఓ ప్రత్యేక అధికారిని నియమించారు. ఆయా డీసీలు, జోనల్ కమిషనర్లు, ఇటీవల నియమితులైన అదనపు కమిషనర్లు పర్యవేక్షించాల్సి ఉంది. డివిజన్లలో రోజూ ఒక ఫొటో దిగడం.. యాప్‌లో అప్‌లోడ్ చేయడం.. మమ అనిపించడం సాధారణంగా మారింది. నగరంలో ఎక్కడ చెత్త అక్కడే ఉంది. ఇంటింటికి తిరిగి తడిపొడి చెత్త సేకరించాలి. అందుకు ఇంటికి యూజర్ ఛార్జీల కింద రూ.100, రూ.150 చొప్పున చెల్లిస్తున్నారు. కానీ తడిపొడి వేరు చేసే పరిస్థితి లేదు. ఇలా సేకరించిన చెత్త స్టేజ్-1 ట్రాన్స్‌ఫాం స్టేషన్ వద్ద దించుతారు. అక్కడి నుంచి పెద్ద వాహనాల్లో జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఇక్కడ కొంత వేరు చేస్తారు..జవహర్‌నగర్‌లో కొండల్లా పేరుపోతోంది. ప్రస్తుతం 300 డివిజన్ల నుంచి 9500 టన్నుల చెత్త వస్తుందని అంచనా. ట్రాన్స్‌ఫాం స్టేషన్ వద్ద ఉదాసీనంగా చెత్త ఏరుకొనే వారికి అవకాశం ఇస్తారు. ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకెళ్తారు.

ఈ చిత్రాన్ని చూశారా.. ఇది సికింద్రాబాద్ బోయినపల్లి మార్కెట్ సమీపంలో బుధవారం సాయంత్రం 4గంటలకు కనిపించింది. చెత్తాచెదారంతో వరాహాల స్వైర విహారం కనిపించింది. ఇక్కడ రెండు మూడు రోజులుగా చెత్తను తొలగించ లేదని స్థానికులు చెప్పారు. ఇదొక్కటే కాదు.. ఇలాంటి దృశ్యాలు నగరం మొత్తం మీద కనిపించాయి. బృందం ప్రత్యేక పరిశీలనలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. చాంద్రాయణగుట్ట, ఖిల్వత్ మైదానం, చాదర్‌ఘాట్ వంతెన, జుమ్మెరాత్ బజార్, చిలుకానగర్, పార్శిగుట్ట, గుడిమల్కాపూర్, బృందావన్‌కాలనీల్లో బృందం పర్యటించింది. పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమం డొల్లతనం వెలుగు చూసింది.

**ప్రజల నుంచే రూ.లక్షలు..!**

నగరంలో దాదాపు 40లక్షల కుటుంబాలు ఉంటాయి. పీటీఐ(ఆస్తి పన్ను) లెక్కల ప్రకారం మొత్తం 27లక్షలు గృహాలు ఉన్నాయి. అనధికారిక ఇళ్లు సైతం ఉన్నాయి. ప్రతి ఇంటి నుంచి యూజర్ ఛార్జీల పేరుతో చెత్త సేకరించే కార్మికులకు సగటున రూ.100 చొప్పున రూ.40కోట్లు చెల్లిస్తున్నారు. అయినా రహదారులపై మాత్రం చెత్త మాయం కావడం లేదు. మరోవైపు జీహెచ్ఎంసీ ఏటా రూ.600 కోట్ల వరకు కేటాయిస్తోంది. దీనిలో 50శాతం జీత భత్యాలకే చెల్లిస్తోంది. ఇంత చేస్తున్నా..నగరవాసికి దోమల బెడద తప్పడం లేదు.

# చదువు... ఉపకార వేతనం




హైదరాబాద్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థుల్లో 690 మందికి ఉపకారవేతనం లభించింది. వారి కోసం దేశంలోనే తొలిసారిగా అమలు చేస్తున్న స్టైఫండ్ ఆధారిత విద్యా కార్యక్రమం(స్టెప్) ద్వారా వీరు నగర పరిసర ప్రాంతాల్లోని బహుళజాతి సంస్థల్లో అప్రెంటీస్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. నెలకు రూ.7 వేల నుంచి 24వేల వరకూ ఉపకారవేతనం ఆయా సంస్థలు అందిస్తున్నాయి. విద్యార్థులకు చదువుతో పాటు ఉపకారవేతనం లభించేలా అంబేద్కర్ వర్సిటీ అధికారులు దేశంలోని ప్రధాన దుకాణ సముదాయాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు భాగస్వాములుగా ఉన్న 'రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(రాస్కీ)తో గతంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. 690 మందిని రాస్కీ ప్రతినిధులు ఎంపిక చేసుకుని తాత్కాలిక నియామక పత్రాలను ఇచ్చారు.

**మహిళా వికాసానికి ప్రత్యేక కార్యాచరణ** అంబేద్కర్ వర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థుల్లో మహిళలే ఎక్కువమ ంది ఉన్నారు. వివిధ కారణాలతో ఇంటర్‌తో ఆపేసినవారు. విద్యతో పాటు ఉద్యోగం వస్తుందన్న నమ్మకంతో అంబేద్కర్ వర్సిటీలో డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. వీరికి చదువుతోపాటు సమాచార, వృత్తి నైపుణ్యాలను నేర్పించేందుకు వర్సిటీ అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. వీ-హబ్‌తో కలిసి వీ-ఎనేబుల్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. మహిళల్లో సృజనాత్మకత ప్రోత్సహించి వారి ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చుతున్నారు. వారికి మార్కెంటిగ్ నైపుణ్యాల్లో శిక్షణ ఇప్పించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు కార్యచరణ రూపొందించారు. ఏటా 2వేల మందిని వ్యూహకర్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, అంకుర సంస్థల ఆవిష్కర్తలుగా రూపొందించనున్నారు. వీ-హబ్‌తో పాటు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ద్వారా ఏటా ఐదువేల మంది గ్రామీణ, గిరిజన విద్యార్థులకు స్వల్పకాలిక వృత్తికోర్సులను అందిస్తున్నారు.


**నైపుణ్యాలుంటే ఉద్యోగాలు** స్టెప్ విధానముంటే గ్రాడ్యుయేట్ ఎంప్లాయిబులిటీ ప్రణాళిక అని విశ్వవిద్యాలయ అధికారులు చెబుతున్నారు. చదువుతో పాటు అప్రెంటిషిప్ కాలంలో నైపుణ్యాలు నేర్చుకుంటే.. డిగ్రీ పూర్తయ్యాక స్థానిక, బహుళజాతి సంస్థల్లో కచ్చితంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరిస్తున్నారు. దీంతోపాటు ఉపాధి ఆధారిత విద్య కోసం కెనడాలోని కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్ సహకారంతో నూతన విద్యా ప్రణాళికలు, కార్యక్రమాలను ప్రవేశపెడు తున్నామని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ సహకారంతో ఏటా 10వేల మందికి విద్యావికాసం అందిస్తున్నామని, నైపుణ్య కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్‌లో వారికి ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపారు.

# నిజాలు దాచినా.. ఏఐ ఉందిగా

పెద్దపల్లి : ఓదెల మండలం శానగొండలో ఓ లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. పైకప్పు వరకు నిర్మించుకున్నారు. అయితే ఏఐ విధానంతో అనర్హుడిగా గుర్తించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం కమలాపూర్‌లో ఓ లబ్ధిదారుడు ఇల్లు మంజూరు కావడంతో పనులు మొదలుపెట్టారు. ఏఐతో అనర్హులుగా గుర్తించి తొలగించారు.దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో ఇళ్లు నిర్మిస్తోంది. ఇళ్ల మంజూరు నుంచి బిల్లుల చెల్లింపులో పారదర్శకత పాటిస్తున్నారు. గత తప్పిదాలు పునరావృతం కాకుండా ఈసారి ఏఐ సాంకేతికతలో అనర్హులను గుర్తిస్తున్నారు. ఇప్పటివరకు పలు పథకాల్లో మంజూరైన లబ్ధిదారుల నిజాలను బయట పెడుతుండటంతో రద్దు చేస్తున్నారు. కొన్నిచోట్ల భవంతులు, కార్లు ఉన్నాయనే నిజాలు వెలుగుచూస్తున్నాయి.

**గుర్తింపు ఇలా..** ప్రభుత్వ పథకాల అమలులో అర్హులను గుర్తించేందుకు 360 డిగ్రీల విధానాన్ని అమలు చేస్తున్నారు. ఏ పథకం పొందాలన్నా.. ఆధార్ అనుసంధానించారు. ఇందిరమ్మ పథకంలో ఎల్-1, ఎల్-2, ఎల్-3 మూడు కేటగిరి జాబితాలో ఆధార్ సంఖ్యతో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నారు. సొంత ఇల్లు, భూముల వివరాలను తేల్చుతోంది. ఇప్పటికే కొందరికి బిల్లులు చెల్లించి.. ప్రస్తుతం నిలిపివేశారు. ఉమ్మడి జిల్లాలో 1,842 వాటిని రద్దు చేశారు.

**తప్పులు లేకుండా..**



ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను అధికారులు వడబోత చేశారు.సొంత స్థలం ఉండి ఇల్లు లేనివారిని ఎల్-1.. ఆ రెండూ లేనివారిని ఎల్-2గా విభజించారు.

ఎల్-1 కేటగిరిలోని వారికి ముందుగా ఇల్లు మంజూరు చేస్తున్నారు. కార్యదర్శులు ముందుగా సదరు ఇంటి యజమాని(మహిళా) ఐరిస్‌తో చిత్రీకరిస్తున్నారు.

**కఠినంగా అమలు చేస్తున్నాం**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ప్రభుత్వ నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నాం. పారదర్శకత పాటించేందుకు ఏఐతో అనర్హులను గుర్తిస్తున్నాం. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తున్నాం. ఇళ్ల ప్రగతిలో వేగం పెంచుతున్నాం.- రాజేశ్వర్, గృహ నిర్మాణ సంస్థ పీడీ

# మెడి'కిల్' దుకాణాలు

భువనగిరి : ప్రాణాలు కాపాడాల్సిన ఔషధాలను ఇష్టారాజ్యంగా విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు కొందరు దుకాణాదారులు. ఫార్మసీ కోర్సు చేసిన వారి పర్యవేక్షణలో యాంటీబయాటిక్స్, ఇతర హైపవర్ మందులు విక్రయించాలి. గ్రామాల్లో ఎవరు పడితే వారు అన్ని రకాల మందులను అమ్ముతు న్నారు. జిల్లాలో అనుమతులు పొందిన మందుల దుకాణాలు 651, ఔషధ తయారీ పరిశ్రమలు 26 ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు మాత్రం ఔషధ నియంత్రణ అధికారి (డ్రగ్ ఇన్‌స్పెక్టర్) ఒక్కరే ఉన్నారు. అదనపు బాధ్యతలు ఉండటంతో పూర్తిస్థాయిలో నియంత్రణ కొరవడింది.

**విక్రయించాలంటే..**

ఔషధాలు అమ్మాలంటే.. డ్రగ్ అండ్ కాస్మెటిక్ యాక్ట్ (పూర్వం చట్టం) ప్రకారం 20-హెచ్ ఓటీసీ డ్రగ్ లైసెన్స్ జారీ చేస్తారు. వీటిల్లో ఫార్మసిస్టు అవసరం లేదు. కేవలం 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అనుమతులు పొందవచ్చు. డాక్టర్ చీటీ అవసరం లేకుండా విటమిన్స్, యాంటాసిడ్స్, జ్వరం నొప్పుల కోసం పారాసెటమాల్, టీవీల్లో ప్రకటనలు వచ్చే అన్ని రకాల సాధారణ మందులను అమ్ముకోవచ్చు. విడిగానే దుకాణం ఏర్పాటు చేసి విక్రయాలు జరపాలి.

ఇక అన్నిరకాల ఔషధాలు విక్రయించాలంటే మాత్రం బి.ఫార్మా, డి.ఫార్మా కోర్సు చేసిన వారికి మాత్రమే లైసెన్స్ జారీ చేస్తారు. ఔషధ నియంత్రణ అధికారి నుంచి ఫారం-20, 21 అనుమతి విధిగా తీసుకోవాలి. ఫార్మసిస్ట్ పర్యవేక్షణలో విక్రయాలు జరగాలి.

డి.ఫార్మసీ, బి.ఫార్మసీ పట్టాలున్నవారికి ఏడాదికి రూ.18 వేలు నుంచి రూ.24 వేలు చెల్లించి వారి పేరిట లైసెన్సులు తీసుకుని వ్యాపారులు



మెడికల్ దుకాణాలు నిర్వహిస్తున్నారు.

చౌటుప్పల్ పట్టణంలోనే 50 వరకు దుకాణాలున్నాయి. ఔషధాలు నిల్వ చేయడానికి ఎయిర్ కండిషనింగ్ చేసిన గది, రిఫ్రిజిరేటర్ సౌకర్యమున్న చోట దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇక్కడ చాలా వరకు చిన్న ఇరుకు గదుల్లో నెలకొల్పారు. సగానికిపైగా దుకాణాల్లో లైసెన్సు లేనివారే నడుపుతున్నారు.

ఆత్మకూరు మండలంలో 15 మందుల దుకాణాలు ఉండగా ఎందులోనూ అర్హతలున్న ఫార్మసిస్టులు లేరు.

**గత ఏది 41 కేసులు నమోదు చేశాం**

– ఆలె బాలకృష్ణ, జిల్లా ఇన్‌ఛార్జి ఔషధ నియంత్రణ అధికారి

ఔషధ నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించి విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటున్నాం. బిల్లు ఇవ్వకపోయినా, డాక్టర్ చీటీ లేకుండా హైపవర్ యాంటీబయాటిక్స్ విచ్చల విడిగా విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. గత ఏడాది 41 దుకాణాలకు అనుమతులు రద్దు చేశాం. తనిఖీలు చేపట్టి నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఔషధ ప్రయోగశాలకు పంపిస్తాం.

# దమ్ము చక్రం.. జర భద్రం

మోత్కూరు : ఈ నెల 3న మోత్కూరు మండలం సదర్శాపురంలో యువరైతు యాకరాజు ఫుల్ వీల్స్‌తో పొలం దున్నుతూ ట్రాక్టర్ తిరగబడటంతో కల్టివేటర్ మధ్యలో ఇరుక్కొని మృతి చెందాడు. ఈ నెల 2న డ్రైవర్ రాకపోవడంతో చిట్యాల మండలం ఏపూరు గ్రామానికి చెందిన రైతు శ్రీశైలం స్వయంగా తాను పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడి అక్కడికక్కడే మృతి చెందారు.ట్రాక్టర్లు ఫుల్ వీల్స్‌తో వెళుతుండటంతో రోడ్డు ఛిద్రం అవుతుందని అడ్డగూడూరు మండలం ధర్మారం, లక్ష్మదేవికాల్వ గ్రామాల ప్రజలు ఇటీవల స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొలాలన్నీ ఒకే విధంగా ఉండవు. భూమి ఎలాంటిదో డ్రైవరు గుర్తించడం లేదు. గట్టి ప్రదేశానికి వెళ్లడానికి యాక్సిలేటర్‌ను ఎక్కువగా ఇస్తుంటాడు. ఆ సమయంలో బరువంతా చక్రాలపై పడటం, ముందు టైర్లు బరువు లేకపోవడంతో ట్రాక్టర్ బోల్తాపడే అవకాశం ఉంటుంది. పొలం చివరి మూలల్లో ఎక్కువసార్లు వీల్స్ నడుస్తుంటాయి. దీంతో ఆ ప్రాంతంలో లోతుగా తయారవుతుంది. వేగంగా వెళ్లే సమయంలో దిగబడి బోల్తా పడుతుంది. పొలం దున్నేటప్పుడు వేగంగా వెళ్లి ఒక్కసారి బ్రేకు వేయడంతో అదుపుతప్పే అవకాశం ఉంది. ప్రతి సీజన్‌లో ట్రాక్టర్ తిరగబడి ఎక్కువ శాతం యువ రైతులు మృతి చెందుతున్న ఘటనలు ఉమ్మడి జిల్లా వాసులను కలచివేస్తున్నాయి. దిగబాటు పొలం దమ్ము చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించకపోవడం, రైతులే స్వతహాగా ట్రాక్టర్‌ను నడపడం ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. అవగాహన లోపం, అజాగ్రత్తగా ట్రాక్టర్లను నడపడం వల్ల చోదకులు తమ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.



**ఇవి పాటించాలి..** దిగబడే పొలంలో సీనియర్ డ్రైవర్లతోనే దమ్ము చేయించాలి.

దున్నేటప్పుడు దిగబడి ఇంజిన్ అమాంతం లేస్తుంటే.. దుక్కి చేయడం ఆపేసి, మరో ట్రాక్టర్ సాయాన్ని తీసుకోవాలి.

దిగబడే పొలాల్లో మాత్రం ఫుల్ వీల్స్‌తో దమ్ము చేయడం మేలు.

కల్టివేటర్ లేకుండా దమ్ము చేయకూడదు. అది ఉంటే తిరగబడే అవకాశాలు తక్కువ. బురదలో ఒకసారి దున్నిన తర్వాత దుక్కి ఆరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరితే దిగబడుతుంది.

చౌడు నేలల్లో దిగుబాటు ఎక్కువ. ఆ పొలాల్లోనే మెలకువలతో దమ్ము చేసుకోవాలి.ట్రాక్టర్ కండిషన్‌ను పొలంలోకి దిగకముందే పరిశీలించుకోవాలి. చోదకుడు ఒకే వేగంతో నడపాలి. ముందు టైర్లు లేవకుండా బరువు ఉంచాలి.

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

శ్రీనివాస్‌రెడ్డి, కోదాడ డీఎస్పీ

రైతులు దమ్ము చేసే సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారు. నైపుణ్యాలు తెలిసిన డ్రైవర్లతోనే దుక్కి చేయించాలి. అప్పటికీ దిగబడితే మరో ట్రాక్టర్ సాయంతో చేయించుకోవాలి. అనాలోచిత నిర్ణయాలతో అన్నదాతలు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

# లెక్కల్లోనే మొక్కలు..!

కోదాడ : ఈ చిత్రంలో మొక్కలు ఎండిపోయి వాటి రక్షణకు కట్టిన కర్రలు మాత్రమే కనిపిస్తున్న ప్రాంతం కోదాడ పురపాలికలోనిది. ఈ ఏడాది మొక్కలు నాటి అధికారులు రక్షణను గాలికొదిలేయడంతో కర్రలు మాత్రమే మిగిలాయి. ఒక్క కోదాడలోనే కాదు జిల్లాలోని మిగతా పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

పట్టణాల్లో రోజురోజుకు విపరీతంగా కాలుష్యం పెరుగుతోంది. కాలుష్యాన్ని తగ్గించి, పట్టణ వాసులకు ఆహ్లాదం పెంచేందుకు పచ్చదనం పెంచే లక్ష్యంగా ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమం ఏటా నిర్వహిస్తోంది. ఒక్కో పురపాలికలో ప్రతి ఏడాది లక్షల్లో మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణను గాలికొదిలేయడంతో మొక్కలు పెరగట్లేదు. ఇలా కొన్నేళ్లుగా పట్టణాల్లో రూ.కోట్లు వెచ్చించి లక్షల మొక్కలు నాటుతున్నారు. పట్టణాల్లో చూద్దామన్నా మొక్కలు కానరాని పరిస్థితి. మొక్కల పేరిట ఏటా రూ.కోట్లలో ప్రజల ధనం దుర్వినియోగం అవుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఐదు పురపాలికల్లో 11 లక్షల పైనే మొక్కలు నాటారు. కానీ క్షేత్రస్థాయిలో కనీసం 30 శాతం కూడా కనిపించట్లేదు. అధికా



రులు మాత్రం మొక్కలు బతికినట్లు లెక్కలు చూపెట్టడం గమనార్హం. నాటిన వెంటనే పశువులు తినకుండా, వాహనాలు తొక్కకుండా రక్షణ కోసం గ్రిల్స్, బుట్టలు ఏర్పాటు చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో చాలా ప్రాంతాల్లో బుట్టలు బిగించకపోవడంతో పశువులు తిని, వాహనాలు తొక్కి కొంత మేర చనిపోయాయి. సరిపడా నీరు అందించక మరికొన్ని మొక్కలు ఎండిపోయాయి. సిబ్బంది కొరత ఉందని, నీటి ట్యాంకర్లు సరిపడా లేక సంరక్షణ ఇబ్బందిగా మారిందని పుర అధికారులు చెబుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం: – రమాదేవి, పుర కమిషనర్ కోదాడ**

పట్టణంలో ఈ ఏడాది ప్రభుత్వ లక్ష్యానికి దగ్గరగా మొక్కలు నాటాం. వాటిని సంరక్షంచేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం.

# వన 'వేదన'!

నర్సాపూర్ : నర్సాపూర్ అటవీ క్షేత్రాధికారి కార్యాలయం పరిధిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. వనాల విస్తీర్ణం ఎక్కువై.. అధికారులు తక్కువ కావడంతో నిఘా కరవైంది. మరోవైపు అటవీ క్షేత్రాధికారి కార్యాలయానికి సొంత భవనం లేకపోవడం గమనార్హం. రేంజ్ పరిధిలో ఎఫ్ఆర్ఓ, బీట్ అధికారుల పోస్టులు చాలా వరకూ ఖాళీగా ఉన్నాయి. అటవీ క్షేత్రాధికారి అరవింద్‌కు ఇటీవల పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లారు. తూప్రాన్ ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు చోట్లా విధుల నిర్వహణ కష్టమవుతోంది.

నర్సాపూర్, బ్రాహ్మణపల్లి, శివ్వంపేట, వెంకట్రావుపేట, తిర్మలాపూర్ విభాగాలకు సెక్షన్ అధికారులున్నారు. వీరితో పాటు డిప్యూటీ రేంజ్ అధికారి కూడా ఉన్నారు. బీట్ అధికారులు మాత్రం 18 మందికి గాను ఏడుగురే ఉన్నారు. ఒకరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. వీరి కొరత కారణంగా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనేది ఉన్నతాధికారులకు తెలియడం లేదు. నలుగురు బేస్ క్యాంప్ సిబ్బంది ఔట్ సోర్సింగ్ విభాగం కింద నియమితులయ్యారు.

**పక్కా భవనాలు లేక అవస్థలు..**

అటవీ క్షేత్రాధికారి కార్యాలయానికి భవనం లేక బీట్ ఆఫీసర్ బిల్డింగ్‌లో కొనసాగిస్తున్నారు. దీంతో నెలవారీ సమావేశాల నిర్వహణ ఇబ్బందిగా ఉంటోంది. స్థానికంగా ఐదు భవనాలుండగా అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం పడితే ఉరుస్తున్నాయి. నిర్వహణ కొరవడి అధ్వానంగా మారాయి.

**ఉద్యోగులుంటే సమస్యలు దూరమవుతాయిలా..**

సిబ్బంది ఉంటే కలప అక్రమ రవాణా పూర్తిస్థాయిలో అరికట్టవచ్చు. వానాకాలంలో ఖాళీ స్థలాల్లో మొక్కల పెంపకం చేపట్టవచ్చు. సహజ వనరులైన మట్టి, ఇసుక, రాళ్ల తరలింపును నిలువరించవచ్చు. అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకోవచ్చు. నర్సరీల నిర్వహణ పకడ్బందీగా



ఉంటుంది. లక్ష్యం మేరకు మొక్కలను పంపిణీ చేయొచ్చు. అడవుల అభివృద్ధిలో భాగంగా జలసంరక్షణ పనులపై దృష్టి పెట్టవచ్చు.

నర్సాపూర్ అటవీ శాఖ పరిధి..

విస్తీర్ణం: 11,716 హెక్టార్లు

ఎఫ్ఆర్ఓ: ఇన్‌ఛార్జి అధికారి

బీట్ అధికారులు 18

ఖాళీలు 10

ఉన్నతాధికారులకు నివేదించాం

అంబర్‌సింగ్, ఇన్‌ఛార్జి అటవీ క్షేత్రాధికారి

సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదిస్తూనే ఉన్నాం. ఉన్నవారితోనే అటవీ సంరక్షణకు కృషి చేస్తున్నాం. ఎక్కువగా బీట్ అధికారుల పోస్టులే ఖాళీగా ఉన్నాయి.

# నార్లు పోసేందుకు నీళ్లేవీ!



మెట్‌పల్లి: గంగనాల ప్రాజెక్టు కింద యాసంగి పంటలకు నీరందే పరిస్థితి లేక ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. తాత్కాలికంగా సదర్మాట్ బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి శివారులో గోదావరిపై 1956లో గంగనాల ప్రాజెక్టు నిర్మించారు. దీని కింద వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్, మల్లాపూర్ మండలం మొగిలిపేటతో పాటు పలు గ్రామాలకు సాగునీరందుతోంది. ఎస్సారెస్పీ నుంచి గోదావరి ద్వారా ప్రాజెక్టుకు నీరు చేరి రెండు పంటలు పండేవి. కాగా నిర్మల్, జగిత్యాల జిల్లాల సరిహద్దులో మూలరాంపూర్–పొన్కల్ మధ్య నదిపై సదర్మాట్ ప్రాజెక్టు చేపట్టగా దిగువకు వదిలే పరిస్థితి లేదని వాపోతున్నారు.

**ఎగువన బ్యారేజీ నిర్మాణంతో..**

గంగనాల ప్రాజెక్టు ఎగువన రూ.531 కోట్లతో 1.58 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పొన్కల్ బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉండగా, ఈ నెలలో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. నిర్మల్ జిల్లాలో సదర్మాట్ ఆనకట్ట కింద 13,120 ఎకరాలకు, జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్, మొగిలిపేట, మల్లాపూర్ మండలం ఒబులాపూర్, సంగెం, శ్రీరాంపూర్, పాతదాంరాజ్‌పల్లి, కొత్తదాంరాజ్‌పల్లి, వాల్గొండ గ్రామాల్లోని 4,896 ఎకరాలకు నీరందించాలన్నది లక్ష్యం.

పొన్కల్ బ్యారేజీలో 1.58 టీఎంసీల నీరున్నందున దిగువకు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఎస్సారెస్పీ కింద ఈ యాసంగి ప్రణాళికలో గంగనాల ఆయకట్టుకు నీటి విడుదలపై స్పష్టమైన ఆదేశాలు లేవని తెలుస్తోంది.

**విన్నపాలు బుట్టదాఖలేనా!**

గంగనాల ప్రాజెక్టుకు సరిపడా సాగునీరు రాక వరి నార్లు పోసుకోలేకపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసే గడువు ముగుస్తోందని, నీళ్లు లేక బీళ్లుగా ఉంచాల్సి వస్తోందని వాపోతున్నారు. పొన్కల్ బ్యారేజీ నుంచి గంగనాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలంటూ రైతులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

**పది ఎకరాలు సాగుకు దూరం**

నాకు గంగనాల ఆయకట్టులో పదెకరాల పొలం ఉంది. నార్లు పోయడానికి కూడా నీరు లేదు. అధికారులకు విన్నవిస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. –గుమ్మాల గంగన్న, వేములకుర్తి

**మొలక అలకడానికీ లేవు**

నాలుగెకరాల పొలంలో వరి నారు పోసేందుకు నీళ్లు లేవు. ఇంటి వద్ద నానబెట్టిన వడ్లు మొలకలు వచ్చినా అలాగే ఉన్నాయి. పాలకులు స్పందించి రైతులను ఆదుకోవాలి.

–పుప్పాల అశోక్, రైతు, వేములకుర్తి

# గోగులగుట్టను కరిగించి.. గుట్టుగా అక్రమార్జించి



గంగాధర : గంగాధర రెవెన్యూ శివారులోని గోగులగుట్ట మట్టిని 15 రోజులుగా అక్రమార్కులు తరలించుకుపోతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పొక్లెయిన్‌తో గుట్టను తవ్వి గుట్టుగా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. బండరాళ్లు పగులగొట్టి, పచ్చని చెట్లను నేలకూల్చి పర్యావరణాన్ని హరిస్తున్నారు. ఇదంతా ఓ మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో జరుగుతుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే దాదాపు 300 టిప్పర్ల మట్టి కొల్లగొట్టగా గుట్ట అడుగున దాదాపు 8 గుంటల స్థలం ఏర్పడింది. ఈ స్థలాన్ని పక్కనున్నవారు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో టిప్పర్ మట్టికి రూ.2,500నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తుండగా రూ.9 లక్షల విలువగల మట్టిని దోచుకెళ్లారు. స్థానికంగా ఓ వేడుకల మందిర భవన నిర్మాణానికి ఈ మట్టిని అక్రమంగా తీసుకెళ్లారు.

**హద్దులు ఏర్పాటు చేస్తేనే..**

గతంలో ఇదే గుట్టకు నివాస స్థలాలుగా పట్టాలు కూడా ఇచ్చారు. ఇక్కడే వైకుంఠధామం నిర్మించారు. ప్రభుత్వ స్థలాలు, గుట్ట చుట్టూ హద్దులు నిర్ణయించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, లేకపోతే ఇలాగే స్థానిక వనరులను దోచుకెళ్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వరద కాలువ మట్టిని, గుట్టను వదలకుండా అక్రమార్కులు దోచుకెళ్లి స్థానిక వనరులు లేకుండా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు.

**రూ.లక్షల స్థలం కబ్జా!**

వాస్తవానికి ప్రభుత్వ స్థలాలు, గుట్టల మట్టి తవ్వడం నిషేధం ఉన్నప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. గుట్ట అడుగు భాగాన్ని పక్కనున్నవారు తమ భూమిలో కలిపేసుకునేందుకు కుట్ర చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఇక్కడ గుంట స్థలం విలువ రూ.10 లక్షలు ఉండగా రూ.80 లక్షల విలువగల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

**క్రిమినల్ చర్యలు తీసుకుంటాం** గుట్టను తవ్వినట్లు మా విచారణలో తేలింది. సర్వేయర్‌తో విచారణ జరిపించి హద్దులు నిర్ణయిస్తాం. గుట్ట తవ్వి పోసిన మట్టి కుప్పలకు బహిరంగ టెండర్ నిర్వహిస్తాం. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుం టాం. రాత్రిపూట వీఆర్ఏను కాపలా ఉంచుతాం. ప్రభుత్వ వనరులను దోచుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటాం. – రజిత, తహసీల్దారు, గంగాధర

# జాతర వేళ.. జర భద్రం



పెద్దపల్లి : భక్తకోటికి కొంగు బంగారమైన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర సమీపిస్తుంది. జాతరకు మరో ఇరవై రోజులు మాత్రమే ఉంది. జిల్లాలోని ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. కల్వర్టులు, మూలమలుపు ప్రాంతాల్లో కనీస హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలేదు. వీలైనంత వేగంగా ప్రమాద నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

**రేడియం ఏర్పాటుతో అప్రమత్తం**హైదరాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల నుంచి భక్తులు సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని గోదావరిఖని ప్రాంతాల్లో ప్రయాణిస్తున్నారు. మంథని నియోజకవర్గంలోని కాటారం, మహాముత్తారం మీదుగా దూరభారం తగ్గడంతో చాలామంది ఈ మార్గాల నుంచే వెళుతుంటారు. ఆర్టీసీ బస్సులు పెద్దపల్లి, మంథని, గోదావరిఖని నుంచి వయా భూపాలపల్లి మీదగా నడిపిస్తున్నారు. జిల్లాలో బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు కనిపించడంలేదు. లోలెవల్ కల్వర్టులు, మూలమలుపు ప్రాంతాల్లో రేడియంతో బోర్డులు ఏర్పాటు చేస్తే చోదకులు అప్రమత్తం కానున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా..**మంథని మండలం వెల్గాస్‌పూర్ గాడుదగండి మలుపు మృత్యు శాపమైంది భట్‌పల్లి సమీపంలోని ఘాట్, ఆరెంద, నాగేపల్లి మలుపులు ఆందోళన కలిగిస్తున్నాయి. తరచూ వాహనాలు బోల్తా పడుతున్నాయి.మంథని, భట్‌పల్లి అటవీ ప్రాంతంలో నాలుగుచోట్ల మలుపు వద్ద ఎలాంటి హెచ్చరికల బోర్డులు కనిపించడంలేదు. కమాన్‌పూర్ మండలం గుండారం, కల్వచెర్ల హైలెవల్ వంతెన, రత్నాపూర్ మూలమలుపు ప్రాంతాల్లో ప్రమాదం పొంచి ఉంది. గోదావరిఖని, మంథని మార్గాల్లో సుందిళ్ల, ముస్త్యాల, సింగరెడ్డిపల్లి, చందనాపూర్ ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

సూచికలు ఏర్పాటుచేస్తాం ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగిస్తున్నాం. వేగ నియంత్రికలను నిర్మిస్తున్నాం. వెంటనే ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తాం. రోడ్లపై గుంతలు లేకుండా సిబ్బందికి తెలిపి చొరవ తీసుకుంటాం. – బావుసింగ్, ఈఈ ఆర్అండ్‌బీ

# దాతలు ముందుకొస్తే.. ఆనందం పదింతలు

సంగారెడ్డి : పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో సర్కారు బడుల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ గ్రామాలు, తండాల నుంచి చాలా మంది విద్యార్థులు ఉదయం అల్పాహారం భుజించకుండానే ఏడు గంటలకే బయల్దేరి పాఠశాలలకు వెళుతున్నారు. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. మధ్యాహ్న భోజనమే దిక్కవుతోంది. సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల అనంతరం పిల్లలు ఇంటికి చేరేసరికి రాత్రి అవుతోంది. ఉదయం, సాయంత్రం అల్పాహారం అందక ఆకలితో అలమటిస్తున్నారు. గతంలో మాదిరిగా దాతలు చేయూత అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**స్వచ్ఛంద సంస్థల చొరవతో మేలు**

జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి. వారు ముందుకొచ్చి అల్పాహారం అందిస్తే పిల్లలకు మేలు చేసిన వారవుతారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, పారిశ్రామిక యాజమాన్యాలు, ప్రజాప్రతినిధులు స్పందిస్తే సమస్య సునాయాసంగా పరిష్కారం అవుతుంది. గతేడాది జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులను కేటాయించారు. ఈ దిశగా కలెక్టర్ ప్రయత్నం చేయాలి.

**జిల్లాలో విద్యార్థుల లెక్కలిలా..**

ప్రభుత్వ పాఠశాలలు: 1218

పదో తరగతి విద్యార్థులు: 10,289

అక్షయ పాత్ర ద్వారా భోజనం అమలవుతున్నవి: 612



వంట ఏజెన్సీల ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్నవి: 606

**త్వరలో నిధులొస్తాయి**

వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పదో తరగతి విద్యార్థులు నిత్యం ఉదయం, సాయంత్రం గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వారికి అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం త్వరలో నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది.

**ఏకాగ్రత లోపిస్తోంది**

సూరజ్, 'పది' విద్యార్థి, నారాయణఖేడ్

మాది నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట. ఖేడ్ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. ప్రైవేటు వాహనాల్లో ఉదయం ఏడు గంటలకే ఇంటి నుంచి బడికి బయల్దేరుతున్నా. సాయంత్రం వరకు తరగతులు, ఆ తర్వాత ప్రత్యేక తరగతులు ముగించుకొని ఇంటికి వెళ్లేసరికి రాత్రి అవుతోంది. మధ్యాహ్నం తిన్న ఆహారంతోనే రాత్రి వరకు ఉండాలంటే ఇబ్బందిగా మారింది. ఆకలి వల్ల ఏకాగ్రతతో పాఠం వినలేకపోతున్నా.

# పట్టణానికి దూరం.. ప్రగతికేదీ మార్గం?

జగిత్యాల : సాధారణంగా పురపాలిక, పంచాయతీ ఏదయినా భౌగోళికంగా ఒకే చోట ఉంటుంది. జగిత్యాల బల్దియా పరిధి మాత్రం ఇందుకు భిన్నంగా విస్తరించడం చర్చనీయాంశమైంది. పంచాయతీగా ఉన్న టీఆర్‌నగర్‌ను బల్దియాలో విలీనం చేయగా, దూరంగా ఉన్న నూకపల్లిలో అర్బన్ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేయడం 'మూడు ముక్కలాట'ను తలపిస్తోంది.

**పేరుకే పట్టణ కాలనీ**

2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీవన్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో పట్టణానికి చెందిన దాదాపు 4500 మంది పేదలకు మల్యాల మండలం నూకపల్లి పరిధిలో ఇళ్ల పట్టాలిచ్చి ఇందిరమ్మ కాలనీగా నామకరణం చేశారు.రాష్ట్రం ఏర్పాటయ్యాక పార్లమెంటు సభ్యురాలు కల్వకుంట్ల కవిత హయాంలో, 2018 ఎన్నికల సమయంలో నూకపల్లిలో జగిత్యాల అర్బన్ కాలనీ పేరిట 4200 రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేశారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు 3,800 మందికి ఇళ్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం వెయ్యి కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నారు.



2500 మంది వరకు జగిత్యాలలోనే ఓటు వేయనున్నారు.

**ఇంటి నంబర్లు లేని ఓటర్లు**

1985లో తెదేపా ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి రాజేశంగౌడ్ చొరవతో టీఆర్‌నగర్(తారకరామనగర్) పంచాయతీ ఏర్పాటు కాగా ఏడేళ్ల కిందట జగిత్యాల బల్దియాలో విలీనం చేశారు.

గ్రామంలో పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు చేతులు మారగా చాలా వరకు బినామీలే ఉంటున్నారు. ప్రభుత్వ స్థలాలకు బల్దియా ఇంటి నంబర్లు కేటాయించే పరిస్థితి లేక చాలా మంది సొంతంగానే వేసుకున్నారు. దీంతో ప్రతి ఎన్నికల్లో భౌగోళిక హద్దుల ఆధారంగా పంచాయతీ పరిధిలో నివసిస్తున్న వారితో ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం టీఆర్‌నగర్‌లో 1000 వరకు నివాసాలు, 3,800 మంది వరకు ఓటర్లున్నారు. పలువురి అభ్యంతరాల మేరకు రెండు రోజుల కిందట చేసిన సవరణలో 10వ వార్డులో 2051 మంది, 11వ వార్డులో 1741 మంది ఓటర్లుండేలా జాబితాలు రూపొందించారు.

**ఇవేం విన్నపాలు!**

పట్టణానికి దూరంగా, భౌగోళికంగా మల్యాల మండలంలో ఉన్న అర్బన్ హౌసింగ్ కాలనీని బల్దియాలో కలపాలన్న ప్రతిపాదనలు విమర్శలకు తావిస్తున్నాయి. పెరిగిన రెండు వార్డులను కాలనీలో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. దీన్ని ఆమోదిస్తే ఇతర ప్రాంతాల నుంచీ ఇలాంటి డిమాండ్లే వస్తాయని సీడీఎంఏ(మున్సిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్) కార్యాలయ వర్గాలు తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పట్టణాన్ని ఆనుకొని ఉన్న ధరూర్‌ను వదిలి టీఆర్‌నగర్‌ను విలీనం చేయడంపై గతంలో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్బన్ కాలనీని జగిత్యాల మండలంలో కలపడంతో పాటు, టీఆర్‌నగర్‌ను తిరిగి పంచాయతీగా కొనసాగించే అంశాన్ని పరిశీలించాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# ప్రమాదాలతో 'సెల్'గాటం

కర్నూలు : అనంతపురానికి చెందిన యువకుడు (28) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేసేవారు. సెలవులు రావడంతో ద్విచక్ర వాహనంపై సొంతూరికి బయలుదేరారు. కర్నూలు సమీపంలో 44వ జాతీయ రహదారిపైన సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఒంటిచేత్తో వాహనం నడుపుతున్నారు. అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయారు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇలా.. వాహనాలు నడిపే సమయంలో చరవాణుల్లో మాట్లాడుతూ ప్రమాదాల బారినపడుతున్న సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అదుపుతప్పుతున్నారు ప్రమాదాల బారిన పడుతున్న వారిలో ఎక్కువగా ద్విచక్ర వాహనచోదకులే ఉంటున్నారు. సెల్‌ఫోన్ రింగ్ చెవినపడగానే జేబులోంచి ఫోన్‌తీసి మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారు. చాలామంది వాహనంలో చరవాణి పెట్టుకునేందుకు ప్రత్యేక స్టాండ్లు సైతం ఏర్పాటు చేయించుకున్నారు.

చరవాణి వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల చోదకుడిలో ఏకాగ్రత లోపిస్తోంది. చెవి, భుజానికి మధ్య సెల్‌ఫోన్ పెట్టుకొని వేగంతో వాహనం నడిపే క్రమంలో రహదారిపై వెళ్లే మిగతా వాహనాలను సరిగా గుర్తించలేకున్నారు. హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చే జంతువులు, స్పీడ్‌బ్రేకర్లు, గుంతలను గుర్తించలేక అదుపుతప్పి పడిపోతున్నారు. 2025లో జిల్లా వ్యాప్తంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన 1091 మందికి రూ.12.85 లక్షల జరిమానా విధించారు.

**చాటింగ్ చేస్తూ.. రీల్స్ చూస్తూ..**



కర్నూలు జిల్లాలో 40, 44, 340సీ, 167వ జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వీటితో పాటు రాష్ట్ర, గ్రామీణ రహదారులు ఉన్నాయి. ఈ రహదారులపై ఇటీవల కాలంలో అతివేగం, మద్యం మత్తులో డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది యువత వాహనం నడుపుతూనే ఫోన్ మాట్లాడటంతో పాటు సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూడటం, చాటింగ్ చేయటం, పాటలు వినడం వంటివి చేస్తున్నారు. మరికొందరు డ్రైవింగ్ చేస్తూనే సెల్ఫీలు దిగుతున్నారు. కొందరు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని ఎక్కువ శబ్దంతో పాటలు వింటూ డ్రైవింగ్ చేస్తున్నారు. వెనుక వెళ్లే వాహనదారులు హారన్ కొడుతున్నా వినిపించుకోకుండా వెళ్తున్నారు. క్రికెట్ మ్యాచ్‌లు జరిగే సందర్భాల్లో స్మార్ట్‌ఫోన్లలో మ్యాచ్ లైవ్ చూస్తూ వాహనాలు నడుపుతున్నారు. కొందరు గూగుల్ మ్యాప్ ద్వారా దారిని అనుసరిస్తూ సెల్‌ఫోన్‌పై దృష్టి పెట్టడంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

# గడువు సమీపిస్తున్నా.. పుష్కర కార్యాచరణేదీ..?

రాజమహేంద్రవరం : గోదావరి పుష్కరాలకు గడువు సమీపిస్తున్నా.. సమావేశాలతోనే సరిపెడుతున్నారు తప్ప సరైన కార్యాచరణ కానరావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. యంత్రాంగం అనుసరించాల్సిన విధి విధానాలపై ప్రభుత్వం వివరణ కోరడం, నిధుల వినియోగం, ఆవశ్యకతపై నివేదిక అందజేయాలని ఆదేశించడం ఇందుకు ఉదాహరణగా పేర్కొంటున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం ఆదేశాల మేరకు నగరపాల సంస్థ అధికారులు మంగళవారం అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన విభాగం అధికారులతో సమావేశమై పుష్కరాలకు సంబంధించి తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులపై వివరించారు. నగర పాలక సంస్థ రూ. 2105 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలు అందజేశారు. పుష్కరాలకు చేపట్టే ముందస్తు పనులపై నివేదిక ఇవ్వాల వారు కోరినట్లు తెలుస్తుంది.

**సమావేశాలు జరిగినా..**

రాజమహేంద్రవరంలో రెండు సార్లు సన్నాహక సమావేశాలు నిర్వహించినప్పటికీ ఇంకా పుష్కరాల నిర్వహణపై తుది నివేదిక అందించలేని పరిస్థితి. మొదటి సమావేశంలో ప్రతిపాదించిన పనులు కేవలం పుష్కర ఆతిథరి?య నగరం రాజమహేంద్రవరానికే పరిమతమయ్యాయి. మలివిడత సమావేశంలో ముందు ప్రతిపాదించిన పనులను పుష్కర ప్రత్యేక అధికార బృందం తిరస్కరించి గోదావరి



పరివాహక ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని నివేదిక ఇవ్వాలని కోరింది. తాజాగా రాష్ట్ర ఉన్నతాధికారులు మాత్రం త్వరలో సమావేశం ఏర్పాటు చేసి తుది నివేదికన ఆమోదించి దశ-దిశ నిర్దేశిస్తామని సూచించినట్లు తెలుస్తుంది.

**కొరవడిన సమన్వయం**

పుష్కర పనులు ఇంకా పట్టాలెక్కలేదు. ఏఏ పనులు చేట్టాలనే అంశంపైనా నిర్ధారణకు రాలేని పరిస్థితి. శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అధికారిక సమావేశాల్లో తప్ప మిగిలిన సందర్భాల్లో ఎక్కడా వీటి ప్రస్తావన లేకుండా పోతోంది. ఇప్పటి వరకు ఎన్ని ఘాట్‌లు సిద్ధం చేయాలి, ఏయే ఘాట్‌లకు మరమ్మతులు చేపట్టాలనే దానిపైనా స్పష్టత కొరవడింది. గోదావరి ఘాట్‌లకు అనుసంధానంగా ఉన్న రహదారుల విస్తరణ, ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన పనులపై కూడా అంచనా లేని పరిస్థితి ఉంది. గత పుష్కరాలకు రెండేళ్లు ముందుగానే ఘాట్‌ల నిర్మాణం చేపట్టి మూడు నెలలు ముందే సిద్ధం చేశారు.

# అలా ఆలస్యం.. నాణ్యత అపహాస్యం



అనకాపల్లి: విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథరిటీ (వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు.. ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నచందంగా సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గుత్తేదారులు ఆడింది ఆటగా.. పాడింది పాటగా తయారైంది. నిధులిచ్చినా కొన్ని పనులు ప్రారంభించకపోగా.. చేసిన అరకొర పనుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు కనిపించడం లేదు.

**పట్టాలెక్కని సెంట్రల్ పార్క్**

అనకాపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో వారాంతాల్లో కుటుంబసమేతంగా ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు ఒక్క పార్కు కూడా లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొన్నాళ్లకే సెంట్రల్ పార్కు నిర్మించేందుకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామంలోని సర్వే నం. 608లో ఏడు ఎకరాలకు పైగా ఉన్న జీవీఎంసీ స్థలంలో 5.68 ఎకరాల్లో మెగాపార్కు నిర్మించేందుకు సిద్ధమైంది. రూ.5.35 కోట్లు దీని నిర్మాణానికి వెచ్చించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి శంకుస్థాపన జరిగి కొన్ని నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ ఒక్కటీ అడుగు ముందుకు పడింది లేదు.

**కొలిక్కిరాని కళాక్షేత్రం**

అనకాపల్లిలోని డాక్టర్ రావుగోపాలరావు కళాక్షేత్రం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనిని ఆధునీకీకరించేందుకు 2022లో రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రతిపాదించారు. పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులు లభించినప్పటికీ.. నిధుల విడుదలలో వైకాపా పాలకులు తీవ్ర జాప్యం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కళాక్షేత్రం పనులు త్వరితగతిన పూర్తవుతాయని అంతా భావించినా పనులు ఆలస్యమవుతున్నాయి. కళాక్షేత్రం ఆధునికీకరణతోపాటు దీని ఆవరణలో రోడ్డును ఆనుకుని దుకాణ సముదాయం, విశ్రాంతి గదులు నిర్మిస్తున్నారు. గుత్తేదారులు అశ్రద్ధ చూపడం, పనులు పర్యవేక్షంచాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో పనుల్లో విపరీమైన జాప్యం జరుగుతోంది.

**ప్రమాణాలు లేని రోడ్లు**

గత ప్రభుత్వంలో విశాఖ వాసులకు ఇళ్లు ఇచ్చేందుకు అనకాపల్లి మండలం కుంచంగిలో భారీగా ల్యాండ్ పూలింగ్ చేశారు. భూములిచ్చిన సాగుదారులకు ఎకరాకు 18 సెంట్ల చొప్పున సర్వే నం. 318, 322, 334, 335లో ప్లాట్లు కేటాయించారు. ఈ లేఅవుట్లకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నది అప్పట్లో ఒప్పందం. ఇందుకు సంబంధించి బీటీ రోడ్లు వేసేందుకు వీఎంఆర్‌డీఏ రూ. 3.28 కోట్లు కేటాయించింది. టెండర్ ప్రక్రియలో ఓ గుత్తేదారు దక్కించుకుని.. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రోడ్లు వేశాడు. వేసిన రెండు నెలలకే రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్నాళ్ల తర్వాత దెబ్బతిన్న చోట్ల ప్యాచ్‌వర్కులు చేశారు. తారుతేలి.. గుంతలు పడుతున్నాయి.

**పక్కాగా నిర్మాణ పనులు**

కొత్తూరులోని సెంట్రల్ పార్కుకు సంబంధించి హద్దులు నిర్ణయించాం. త్వరలో చుట్టూ ప్రహరీ కట్టి.. నిర్మాణాలు ప్రారంభిస్తాం. కళాక్షేత్రం పనులు కూడా త్వరితగతిన అవుతున్నాయి. అతిత్వరలో వాటిని కూడా పూర్తిచేస్తాం. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పక్కాగా నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షస్తున్నాం. నిబంధనలు పాటించకుంటే.. చర్యలు తీసుకుంటాం.

శంకరరావు, డీఈ, వీఎంఆర్‌డీఏ

# వెలుగుల సిరి.. శంకుస్థాపనతో సరి



అచ్యుతాపురం : ఆంధ్రప్రదేశ్ వెలుగు రేఖలను మార్చే గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణ పనులు ఏడాదిగా శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. గత ఏడాది జనవరి 8న విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పూడిమడక సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. దేశ ప్రధానే స్వయంగా శంకుస్థాపన చేయడంతో ప్రాజెక్టు పనులు వేగంగా పట్టాలెక్కుతాయని.. నిర్వాసితులు, మత్స్యకారులకు చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంతా భావించారు. అందుకు భిన్నంగా ఏడాదైనా ప్రాజెక్టు పురోగతిలో ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో ముందుకెళ్తుందో? లేదో? తెలియక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**1.2 లక్షలమందికి ఉపాధి లక్ష్యం**

రాష్ట్రానికి వెలుగులు అందివ్వడంతోపాటు లక్షలాది మందికి ఉపాధి కల్పించి, రాష్ట్ర కీర్తికెరటాన్ని విశ్వ వ్యాప్తంచేసే ప్రాజెక్టు ఇది. రూ. 1.2 లక్షల కోట్లతో 60 వేల మందికి ప్రత్యక్షంగా.. మరో 60 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ప్రాథమిక అంచనా. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమైతే అచ్యుతాపురం పేరు అంతర్జాతీయ స్థాయిలో మారుమోగుతుంది. దేశంలో మొట్టమొదటి అతిపెద్ద హైడ్రోజన్ హబ్ ఇదే కావడంతో దీని ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా ఉంటుంది. దీనికి అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీంతోపాటు ఉపాధి, అభివృద్ధి పరంగా ఉమ్మడి విశాఖ జిల్లాకు ఇది తలమానికంగా మారనుంది. ఇంతటి ప్రసిద్ధి ప్రాజెక్టు ఏడాదిగా ఒక్క అడుగు ముందుకెళ్లలేదు.

**టెండర్ దశలోనే...**

పూడిమడక సమీపంలో ప్రాజెక్టు నిర్మాణానికి 1200 ఎకరాల స్థలం, 12 కిలోమీటర్ల మేర చుట్టూ రక్షణగోడ నిర్మించుకోవడంతోపాటు సాంకేతిక సాయం అందివ్వడానికి ఆస్ట్రేలియాకు చెందిన నిపుణులు సైతం దీని కోసం ముందుకొచ్చారు. అయినా.. ఈ ప్రాజెక్టు ఏడాదిగా టెండర్ దశలోనే ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే అనుమతులను అధికారులు తీసుకురాకపోవడంతోనే నిర్మాణం జరగడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు తీసుకురావడంలో అధికారులు ఉదాసీనత, పనులు పర్యవేక్షంచే ఉన్నతస్థాయి అధికారి విజయవాడ నుంచే పనులు పర్యవేక్షంచడం, స్థానిక అధికారులు చలనం లేకుండా ఉండటంతో ఇది మరింత ఆలస్యం కావడానికి కారణమవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాజెక్టును ప్రధానమంత్రి మోదీ, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా భూమిపూజ చేసినా అధికారులు ఆస్థాయి ప్రాధాన్యం దీనిపై పెట్టకపోవడమే ఆలస్యానికి ప్రధాన కారణంగా అందరూ భావిస్తున్నారు. ఇప్పటికైనా పనులను పట్టాలెక్కించి అందరి ఆశలను తీర్చాలని కోరుతున్నారు.

# దేవరా.. కొండ పిండవుతోందయ్యా!



బుక్కరాయసముద్రం : దేవుడు వెలసిన కొండనూ అక్రమార్కులు వదలడం లేదు. ధనదాహంతో బరితెగిస్తున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ.. కొండను పిండి చేస్తూ.. కబ్జాకు పాల్పడుతున్నారు. బుక్కరాయసముద్రం శివారులో వెంకటరమణ స్వామి కొలువుదీరిన దేవరకొండకు వందల ఏళ్లనాటి చరిత్ర ఉంది. కొండపైన శ్రీవారు సతీసమేతంగా వెలిశారని భక్తులు విశ్వసిస్తారు. అలాంటి పవిత్రమైన కొండపై కన్నేసి.. కొల్లగొడుతున్నారు. ఎక్కడికక్కడ జేసీబీ, హిటాచీ యంత్రాలతో తవ్వేసి.. చదును చేసి తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. అనంతపురం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే దేవరకొండ ఉంది. ఈ కొండ దాదాపు 100 ఎకరాల్లో విస్తరించి ఉంది.

**ఎకరం రూ.కోటి పైగానే..**

అనంత నగర శివారులో ఉండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. చుట్టుపక్కల ఎకరం విలువ రూ.కోటి పైగానే పలుకుతోంది. దీంతో దేవరకొండను అనుకుని, చుట్టుపక్కల భూములు ఉన్న చాలా మంది యంత్రాలతో తవ్వేసి ఆక్రమించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై స్వామి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీ కొండమీద రాయుడి బ్రహ్మోత్సవాలకు మరో 25 రోజులు మాత్రమే సమయం ఉంది. వేలాది భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారు. ఇప్పటికైనా దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు చొరవ తీసుకుని... బాధ్యులపై చర్యలు చేపట్టి కొండ పవిత్రతను కాపాడాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దారు శ్రీధరమూర్తిని వివరణ కోరగా క్షత్రస్థాయిలో పరిశీలించి.. తవ్వుతున్న అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో బరితెగింపు

ఒంటిమిట్ట : గ్రామీణాభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను వైకాపా పాలనలో అడ్డగోలుగా దోచేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని లక్షణంగా మింగేశారు. ఇప్పటికే అక్రమార్కులపై అధికారులు కొరడా ఝుళిపించారు. అక్రమార్కులపై నమోదైన కేసులో మొన్నటి వరకు ఎలాంటి పురోగతి లేదు. ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇలాంటి తరుణంలో విచారణ నివేదికలను ధ్వంసం చేయాలనే కుట్రతో ఎంపీడీవో కార్యాలయంలోకి దుండగలు చొరబడినట్లు సర్వత్రా చర్చ సాగుతోంది.

**అక్రమార్కుల పనేనా!:**

మండల పరిషత్తు కోటాలో విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను మూడేళ్ల కిందట రూ.19 లక్షలకు పైగా దుర్వినియోగం చేశారు. ఈ దోపిడీ పర్వంపై వెలుగులోకి తేవడంతో జిల్లా అధికారులు స్పందించారు. చేపట్టిన పనులు, నిధుల విడుదల, బిల్లుల చెల్లింపుల్లో తేడాలు ఉన్నట్లు తేల్చారు. కొలతల పుస్తకంలో నమోదు చేయకుండానే దొరికినంత మేసేశారని తేల్చారు. పరిపాలన అనుమతి పొందకుండానే అక్రమ మార్గంలో నచ్చినోళ్లకు అడ్డగోలుగా బిల్లులు చెల్లించినట్లు గుర్తించారు. ఇప్పటికే బాధ్యులైన వారిపై వేటు వేశారు. మరోవైపు ముగ్గురు కీలకపాత్ర పోషించారని గతేడాది ఏప్రిల్ 25న క్రిమినల్ కేసు నమోదు చేశారు. రాజకీయ ఒత్తిడి రావడంతో నిన్నటి వరకు విచారణలో ఎలాంటి పురోగతి సాధించలేదు. మూడు రోజుల కిందట సీఐ నరసింహరాజు, ఎస్సై శ్రీనివాసులు ఈ కేసు రికార్డులపై దృష్టి సారించారు. వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ



నేపథ్యంలో ఎంపీడీవో కార్యాలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు పొద్దుపోయిన తర్వాత చొరబడ్డారు. అక్రమాలపై విచారణ చేసిన నివేదికలను పట్టుకెళ్లాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చినట్లు తెలుస్తోంది. మండలంలో 13 గ్రామ పంచాయతీలున్నాయి. పల్లెసీమల్లో మౌలిక వసతుల కల్పనకు వచ్చిన 15వ ఆర్థిక సంఘం పద్దు కూడా రూ. 55 లక్షలకు పైగా దుర్వినియోగం చేసినట్లు తేల్చారు. ఇప్పటికే 13 మంది సర్పంచులకు చెక్‌పవర్ రద్దు చేశారు. వీరిలో కొంతమంది న్యాయపోరాటం చేసి తిరిగి చెక్‌పవర్‌ను పునరుద్ధరించుకున్నారు. బాధ్యులైన సిబ్బందిపై వేటుకు రంగం సిద్ధమైంది. ఇక్కడ ఉన్న రికార్డులు కనిపించకుండా చేస్తే తమపై ఎలాంటి చర్యలు ఉండవనే భావన కొందరిలో ఉంది. ఎం.బుక్కులు, ఇతర రికార్డులు కనిపించకుండా చేయాలని కుట్ర పన్నినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ విషయమై ఒంటిమిట్ట ఎస్సై శ్రీనివాసులు మాట్లాడుతూ.. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టమన్నారు. ఈ రెండు ఘటనలపై అందిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

# తీగల మార్గం సుగమం

నందికొట్కూరు : కృష్ణానదిపై తీగల వంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి..దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య మార్గం సుగమంకానుంది. శ్రీశైలం జలాశయం నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల పరిధిలోని తీరప్రాంతాల్లో రాకపోకలు నిలిచాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం కొల్లాపూర్ తీరాన సోమశిల, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా సిద్ధేశ్వరం గుట్టల నడుమ కృష్ణానదిపై తీగలవంతెన నిర్మాణానికి కేంద్రం ముందుకొచ్చింది. తెలంగాణ రాష్ట్రం కల్వకుర్తి నుంచి కృష్ణానది మీదుగా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు రూ.1,080 కోట్లు వెచ్చించి జాతీయ రహదారి (167కే) నిర్మిస్తున్నారు. ఇందులో తీగల వంతెనకు రూ.816 కోట్లు వెచ్చించనున్నారు. ఫిబ్రవరి



16వరకు టెండర్ ప్రక్రియకు అవకాశం కల్పించింది. అదేనెల 17న టెండర్లు ఖరారు చేసి పనులు చేపట్టనున్నారు.

**మూడు నెలల్లో పనులు మొదలు**

కొల్లాపూర్‌లోని వరిదేల రెవెన్యూ శివారు వరకు నిర్మించిన 167కే జాతీయ రహదారి నుంచి సోమశిల గుట్ట వరకు 8 కిలోమీటర్లు, ఏపీలో కపిలేశ్వరం వైపు 5 కిలోమీటర్ల మేర అప్రోచ్ రహదారి నిర్మాణానికి రూ.436 కోట్లు కేటాయించారు. తొలుత తీగలవంతెనకు ప్రాధాన్యం ఇస్తూ టెండర్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ ఏడాది మార్చిలో నిర్మాణ పనులకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. అప్రోచ్ రహదారి, తీగల వంతెనలో కొల్లాపూర్ వైపు 59 హెక్టార్లు భూమి అవసరం ఉండగా ఇందులో 25 హెక్టార్లు అటవీశాఖకు చెందినది..కాగా ఏపీ అవతల 29 హెక్టార్ల అటవీశాఖ భూమి కావాల్సి ఉంది.

# జలవనరుల 'బలోపేతం'!

కంభం : మొంథ తుపాను ప్రభావంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాలువల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాలో 799 చెరువులుండగా, వాటిలో 543 తటాకాలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వీటి మరమ్మతులకు ఎఫ్‌డీఆర్ కింద రూ.36.45 కోట్లు మంజూరు చేశారు. మార్కాపురం జిల్లాలోని గిద్దలూరు, యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల్లో 290, ప్రకాశం జిల్లా ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, దర్శి నియోజకవర్గాల్లో 253 పనులు చేపట్టనున్నారు.

టెండర్లకు ఆహ్వానం

కంభం సబ్‌డివిజన్ పరిధిలోని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో 34 పనులకు రూ. 2.34 కోట్లు మంజూరు చేశారు. జిల్లాలోని అన్ని చెరువులకు పాలక మండళ్లు ఉన్నప్పటికీ రూ.5 లక్షల విలువైన పనులు దాటిన వాటిని టెండర్లు పిలిచి పనులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రూ. 5 లక్షల కంటే తక్కువగా ఉన్న పనులను నీటి సంఘాల ద్వారానే చేపడతామన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పనులు, నిధులను ఈఈలకు అప్పగించామని, వారే నిర్వహణ బాధ్యతలు చూస్తారని ఎస్ఈ వరలక్ష్మ తెలిపారు. దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాలువల్లో ప్రస్తుతం నీళ్లు లేకుంటే పనులు ప్రారంభించవచ్చునని ఆమె వివరించారు.

# వాటాలు తేలే.. జనం మునిగే!

విశాఖపట్నం: థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ద్వారా వచ్చే ఫ్లైయాష్ (బూడిద) రవాణా కొందరికి కాసులు కురిపిస్తోంది. నగరవాసులను మాత్రం కాలుష్యం సుడిలోకి నెట్టేస్తోంది. అన్నీ తెలిసినా కొందరు ప్రజాప్రతినిధుల జోక్యం ఉండటంతో అధికారులు పట్టించు కోవడం లేదు. ఇప్పటికే దిల్లీని మించి విశాఖలో గాలి నాణ్యత దెబ్బతిన్నట్లు గణాంకాలు చెబు తున్నాయి. మరోవైపు నేతల కమీషన్ల కోసం ప్రతిరోజూ నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న వందల లారీలతో కాలుష్యం మరింత పెరిగిపోతోంది.

**డిమాండ్ పెరగడంతో:** విశాఖ నగరానికి సమీపంలో ఉన్న రెండు థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచి బూడిద రవాణా అవుతుంది. గతంలో ఉచితంగా ఇచ్చేవారు. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో టెండర్లు పిలుస్తున్నారు. సిమెంటు, ఇటుక పరిశ్రమలు, జాతీయ రహదారుల నిర్మాణానికి ఫ్లైయాష్ వెళుతుండగా... మరో రకమైన సైలో యాష్‌ను పోర్టు నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఓ సంస్థ పిట్టవాని పాలెం వద్ద వెయ్యి ఎకరాల్లో, ఇంకో సంస్థ పాలవలస వద్ద 300 ఎకరాల్లో ఫ్లైయాష్ నిల్వ చేస్తుంటాయి. ఈ ప్రాంతాల నుంచి లారీలు మొదలై దేశపాత్రునిపాలెం, ఏలేరు కాల్వ మీదుగా జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. ప్రతిరోజూ 300పైగా లారీలు బూడిద రవాణా చేస్తున్నాయి.



**నిత్యం అవస్థలు..**
ప్లాంట్‌ల నుంచి బూడిద రవాణా చేసే సమయంలో పరిమితికి మించి నింపేస్తున్నారు. కొన్ని సార్లు టార్పాలిన్ పట్టాలు కప్పకుండానే తరలిస్తున్నారు. మరికొన్ని లారీలకు కప్పినా ఓవర్‌లోడు కారణంగా కుదుపుల సమయంలో బూడిద జారి రోడ్లపై పడుతోంది. గాలికి ఆ బూడిద లేచి ద్విచక్ర వాహన చోదకులు, ఆటో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల వెంబడి ఉండే దుకాణదారులు, ఇళ్లపై బూడిద కమ్మేసి శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంటలతో అల్లాడుతున్నారు.


**అంతా మేం చూసుకుంటామంటూ:** ప్లాంట్ల నుంచి బూడిద రవాణా చేసే బాధ్యతలు టెండర్లలో ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు దక్కించుకున్నా.. తరువాత ఉప గుత్తేదారులకు ఇచ్చేస్తున్నారు. దీనికీ ఓ కారణం ఉంది. చెప్పినట్లు వినకపోతే..బూడిదతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికుల నుంచి ఆందోళనలు తప్పవనే సంకేతాలను నేతలు పంపుతున్నారు. అలా కొందరు నేతలు చెప్పినవారికి కాంట్రాక్టు అప్పగించాక ప్రతి ట్రిప్పునకు వాటాలు మాట్లాడు కుంటున్నారు. ఇద్దరు ప్రజాప్రతినిధుల కీలక అనుచరులు ఈ కమీషన్ల వసూళ్ల వ్యవహారం చూస్తున్నట్లు సమాచారం.

# గుజరాత్‌కు గుట్టుగా బియ్యం

ఆదోని : పేదల బియ్యం సరిహద్దు దాటుతోంది.. ఇన్నాళ్లు కర్ణాటకలోని బియ్యం మిల్లులకు తరలిస్తున్న వ్యాపారులు ప్రస్తుతం 'రూట్' మార్చారు. లాభం ఎక్కువగా ఉండటంతో గుజరాత్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు తీసుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. గత నెలలో 35 టన్నులతో వెళ్తున్న లారీ మాధవరం తనిఖీ కేంద్రం వద్ద పట్టుబడింది. ఇలా ప్రతి నెలా 10 నుంచి 15 లారీల వరకు వెళ్తున్నట్లు అంచనా. ఒక్కోలారీపై రూ.2 లక్షల వరకు లాభం గడిస్తున్నారు. వీటిని ప్రతి నెలా మొదటి వారంలో అర్ధరాత్రి దాటిన తర్వాత సరిహద్దులు దాటిస్తున్నారు. మాధవరం, హొళగుంద, నాగలదిన్నె వంతెన మీదుగా గుట్టుగా తరలిస్తున్నారు.

**ప్రతి నెలా రూ.30 లక్షల ఆదాయం** రేషన్ బియ్యం దందా చేసే అక్రమార్కులు గతంలో కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప, సింధనూరు, రాయచూరు ప్రాంతాలకు తరలించేవారు. అక్కడ కిలో రూ.24 నుంచి రూ.28 పలుకుతోంది. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలోని సూరత్, అహ్మదాబాద్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో డిమాండు ఉండటంతో అక్కడికి తరలిస్తున్నారు. అక్కడ కిలో రూ.34- రూ.40 పలుకుతోంది.ఒక లారీ(పెద్దది)లో 30 నుంచి 35 టన్నుల వరకు తీసుకెళు_న్నారు. ఒక్కో లారీపై రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు లాభం చేకూరుతుంది. ఇలా ఏటా రూ.2.50 కోట్ల నుంచి రూ.3.50 కోట్ల వరకు సొమ్ము చేసుకుంటున్నారు.

**తనిఖీ కిట్లు ఏమైనట్లు** బియ్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తనిఖీల్లో పట్టుబడిన బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసినవో కాదో కనిపెట్టేందుకు రసాయనాలతో కూడిన ర్యాపిడో కిట్లు గతేడాది నవంబరులో అందించారు. కర్నూలు జిల్లాకు 20, నంద్యాల జిల్లాకు 15 కిట్లు వచ్చాయి.
పట్టుబడిన బియ్యాన్ని ర్యాపిడో కిట్లలోని రెండు రకాల రసాయనాలతో పరీక్షిస్తారు. ఎరుపు రంగులోకి మారితే రేషన్ బియ్యంగా తేలుస్తారు. ఇప్పటి



వరకు వీటిని వినియోగించినట్లు దాఖలాలు లేవు.

**సేకరణకు ఏజెంట్ల నియామకం**
ఉమ్మడి జిల్లాలో 12.10 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి ప్రతినెలా 5 కిలోల బియ్యం ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. ఇందుకు ప్రభుత్వం ఒక కిలోకు రూ.46 ఖర్చు చేస్తోంది. ప్రతినెలా ఉమ్మడి జిల్లాకు 19 వేల మెట్రిక్ టన్నులు కేటాయిస్తున్నారు.
బియ్యం వ్యాపారులు కొందరు పేదలను ఏజెంట్లుగా నియమించుకొంటున్నారు. వారు క్షేత్రస్థాయిలో తిరుగుతూ కార్డుదారుల వద్ద సేకరిస్తున్నారు. రూ.15 నుంచి రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అలా సేకరించిన బియ్యాన్ని వీధుల్లో ఓ చోట నిల్వ చేస్తున్నారు. కొంత మొత్తం పోగైన తర్వాత సదరు వ్యాపారి వాహనం వచ్చి తీసుకెళ్తోంది.
రేషన్ కార్డుదారులకు ప్రతినెలా ఉచితంగా అందజేస్తున్న పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన లేక లక్షలాది మంది తినడం లేదు. 60 శాతం మంది వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

జిల్లా కర్నూలు
చౌక దుకాణాలు: 1,233
రేషన్ కార్డులు: 6,73,526
మొత్తం సభ్యులు: 11,685.090
ప్రతినెలా బియ్యం కేటాయింపు (టన్నుల్లో): 22,51,764

# కన్నేస్తారు.. కట్టేస్తారు



కదిరి : కదిరి పురపాలక పరిధిలో ఆక్రమణలకు అంతు లేకుండాపోతోంది. అక్రమార్కులు వాగులు, వంకలనూ వదలడం లేదు. దర్జాగా కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కదిరి-రాయచోటిరోడ్డు నుంచి హిందూపురం రోడ్డు వరకు మూడు కిలోమీటర్ల మేర వాగు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించుకుని ఇళ్లు కట్టడమే ఇందుకు నిదర్శనం. ఇంత జరుగుతున్నా పట్టణ ప్రణాళిక, నీటిపారుదలశాఖ అధికారులు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి సమీపంలోని వితల్‌రాయునిచెరువు మరవవాగు పట్టణ పరిధిలో సుమారు కిలోమీటరు వరకు విస్తరించి ఉంది. ఇక్కడ సెంటు స్థలం రూ.15 లక్షల వరకు పలుకుతోంది. నిజాంవలి కాలనీకి వెళ్లే మార్గంలో సుమారు మూడు సెంట్ల స్థలంలో రెండేళ్ల కిందట ఇంటి నిర్మాణం చేపట్టారు. స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదలశాఖ అధికారులు నిర్మాణాన్ని అడ్డుకుని నోటీసులు ఇచ్చారు. తాత్కాలికంగా వెనక్కి తగ్గిన వ్యక్తులు తిరిగి నిర్మాణ పనులకు సిద్ధమవుతున్నారు.ఇదే వాగును ఆక్రమిస్తూ మరో నాలుగైదు పునాదులు వెలిశాయి. వాగును పిల్లకాలువలా మార్చేసి పక్కనే ఉన్న అరవకొట్టాలకు మట్టి దారి ఏర్పాటు చేసుకున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
తుమ్మలరోడ్డు సమీపం నుంచి ప్రారంభమైన మద్దిలేరువాగు పరివాహక ప్రాంతంలోనూ అనుమతి లేకుండా నిర్మాణాలు వెలుస్తున్నాయి. ముఖ్యంగా శివాలయం వెనుక భాగం నుంచి వాసవీనగర్ వరకు తిప్పానమ్మకాలువ, మద్దిలేరువాగు మధ్యలో పదుల సంఖ్యలో బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. ఇందులో వాగుపరివాహక ప్రాంతం కబ్జాకు గురైంది. ఇక్కడ సెంటు స్థలం రూ.20 లక్షలు పలుకుతోంది. పరివాహక ప్రాంతమని తెలిసినా ఇల్లు కట్టుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. 2020లో వచ్చిన భారీ వర్షాల వల్ల ఈ ప్రాంతంలోని ఇళ్లన్నీ జలమయం అయ్యాయి. నెలరోజుల పాటు ఇళ్లలోకి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. అధికారుల అప్రమత్తతతో ప్రాణనష్టం తప్పింది. భవిష్యత్తులో భారీ వర్షాలు వస్తే ముప్పు తప్పదు.

**నిర్మాణాలను అడ్డుకుంటాం**
- కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

మద్దిలేరువాగు, వితల్‌రాయునిచెరువు మరవవాగుపై నిర్మాణాలు చేపట్టవద్దని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించాం. నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి పరివాహక ప్రాంతంలో ఇళ్లు కడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

# చిన్న ముక్కైనా.. కాసుల గలగలే



తిరుపతి : శేషాచలం అడవుల్లోని ఎర్రచందనానికి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. చెట్టులోని ఏ భాగం కూడా వృథ కాదు. వేరు నుంచి మొదలుకొని చెట్టు బెరడు వరకు కాసులు కురిపిస్తోంది. అందుకే స్మగ్లర్లు వేర్లతో సహా పెకిలించి అక్రమంగా రవాణా చేస్తుంటారు. అలా తరలించే ప్రయత్నంలో పట్టుకున్న ఎర్రచందనం దుంగలతోపాటు.. ఉప ఉత్పత్తులుగా పిలిచే వేర్లు, చిప్స్, చెట్ల నుంచి వేరుచేసిన కొమ్మలు, చిన్నచిన్న కర్రలను సైతం స్వాధీనం చేసుకొని గోదాముల్లో భద్రపరిచారు. ఏటా గోదాముల్లోని దుంగలకు డ్రెస్సింగ్ చేసేందుకు తొలగించిన పేళ్ల (చిప్స్)ను కూడా నిల్వ చేశారు.

**స్థానికంగానే విక్రయం..**
ఎర్రచందనాన్ని అంతర్జాతీయంగా విక్రయించేందుకు గ్లోబల్ టెండర్లు పిలుస్తుంటారు. గత ఐదేళ్లుగా వీటికి ఆశించిన మేర స్పందన లేదు. ఉప ఉత్పత్తులను మాత్రం స్థానిక మార్కెట్లలోనే టెండర్ల ద్వారా విక్రయిస్తుంటారు. వీటికి డిమాండ్ తగ్గడం లేదు. కళాకారులు, ఫార్మా కంపెనీలకు అందుబాటులో ఉండేలా ఈ-వేలం నిర్వహిస్తున్నారు. ఈ ఉప ఉత్పత్తులతో గృహోపకరణాలు, ఆటబొమ్మలు, కొన్ని మందులు, సౌందర్య ఉత్పత్తులు తయారు చేస్తుంటారు.
2025 అక్టోబరులో ఉప ఉత్పత్తులకు ఈ-వేలం నిర్వహించారు. 35 లాట్లుగా సంబంధించిన 143.8 టన్నుల వేర్లు, చిప్స్‌ను కళాకారులు, ఫార్మా కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేశారు. దీంతో అటవీశాఖకు రూ.6.71 కోట్ల ఆదాయం వచ్చింది.
ఈసారి 3,19,985.93 కిలోలు విక్రయించేందుకు టెండర్లు ఆహ్వానించారు. ఇందులో 27 లాట్లుగా విభజించిన 8,865 బ్యాగుల చిప్స్, ఒక లాట్గా సమీకరించిన 162 బ్యాగుల వేర్లు, 17 బ్యాగులుగా విభజించిన ఒక లాట్ చిన్నకర్రలు, 35 బ్యాగుల పలకలు, 913 బ్యాగుల బిల్లెట్స (చతురస్రాకారంలోఉండే ఎర్రచందనం ముక్కలు), 228 బ్యాగుల్లో భద్రపరిచిన ఎర్రచందనం బండిల్స్ ఉన్నాయి. కపిలతీర్థంలోని జిల్లా ఫారెస్ట్ అధికారి కార్యాలయంలో ఈ నెల 23న వేలం జరగనుంది.

# చలికి గజగజ.. ఆసుపత్రులు కిటకిట



చిత్తూరు : చలి.. మంచు తీవ్రతతో శ్వాసకోశ బాధితులు పెరుగుతున్నారు. చల్లటి వాతావరణం కారణంగా వైరస్, బ్యాక్టీరియా జీవితకాలం పెరగడం.. చలికి ఇంట్లో దగ్గరదగ్గరగా కుటుంబసభ్యులు ఉండటంతో వైరస్ త్వరగా చేరుతుందని వైద్యులు చెబుతున్నారు.
చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో గతంలో ఓపీ 1,200 ఉంటే.. ప్రస్తుతం 2వేలకు పైగా ఉంటోంది. 60శాతానికి పైగా జలుబు, దగ్గు, జ్వరం కేసులే ఉంటున్నాయి. చిన్న పిల్లల వార్డులో 80 శాతం ఇలాంటి కేసులే నమోదవుతున్నాయి.

**రక్తనాళాలు గట్టిపడి..**
అస్తమా, టీబీ వ్యాధికి గురైన వారు, ఊపిరితిత్తుల సమస్య ఎదుర్కొనే వారు, గుండె, డయాలసిస్ చేసుకునే వారు చలి తీవ్రతకు శ్వాసకోశ రోగాలకు గురవుతున్నారు. ముఖ్యంగా హృద్రోగుల రక్తనాళాలు గట్టిపడటం.. ఊపిరి బాగా తీసుకోలేక గుండె పోటుకు గురయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు అప్రమత్తంగా ఉండాలి.

**చిన్నారుల్లో సమస్యలు..**
చిన్నారులు బ్రాంకియో లైటీస్ వైరల్ ఇన్‌ఫెక్షన్ (బీఎల్‌వీ), రెస్పిరేటరీ సెన్సిటియల్ వైరస్ (ఆర్ఎస్‌వీ)ల బారిన పడుతున్నారు. రోజుల తరబడి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

**టీకా వేసుకోవాలి..**
0-5 ఏళ్లలోపు పిల్లలకు టీకాలు తప్పనిసరి.
పొగతాగడం.. పీల్చడం వల్ల ప్రబలే వ్యాధులకు గురికాకుండా ఏడాదికోసారి చలికాలం ముందు ఫ్లూ వ్యాక్సినేషన్స్ చేయించాలి.
న్యుమోకోకల్ వ్యాక్సిన్ జీవిత కాలంలో ఒకసారి లేదా ప్రతి ఐదేళ్లకోసారి వేసుకోవాలి.
65 ఏళ్లు దాటిన వారు ఊపిరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైద్యులను సంప్రదించి వ్యాక్సినేషన్ చేయించుకోవడం మంచింది.
శ్వాసకోశ వ్యాధిగ్రస్థులు ఇతర వ్యాధుల బారిన పడకుండా చికెన్ ఫాక్స్ వ్యాక్సిన్ వేసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి: దయాసాగర్, సత్యనారాయణపురం యూపీహెచ్‌సీ వైద్యులు
ఊపిరితిత్తులతో కఫం చేరుతుంది. ప్రతి రోజు గోరువెచ్చని నీరు, వేడి అన్నం తీసుకోవాలి. చలికాలంలో రక్తకణాల పనితీరు మందగించి గుండెనొప్పి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# జవాను పేరిట 'జాగా'న్నాటకం

కర్నూలు : కల్లూరు గ్రామంలోని సర్వే నంబరు 172లో ఉన్న ఐదెకరాల భూమిని మాజీ సైనికుడి పేరుతో కొట్టేశారు. ప్లాట్లువేసి రూ.కోట్లు ఆర్జించారు. దాని విలువ ప్రస్తుతం రూ.25 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. సర్వే నంబరు 172లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఐదెకరాలను ఆదోనికి చెందిన ఎస్.గోరంట్ల అనే మాజీ సైనికుడికి 1975లో కేటాయించినట్లు చూపించారు. ఆ మేరకు కొన్ని రికార్డుల్లో ఆయన పేరును నమోదు చేశారు.
ఎస్.గోరంట్ల ఆ భూమిలో 2.75 ఎకరాలను తన కుమారుడు ఎస్.గణేశ్‌కు రిజిస్ట్రేషన్ చేసిచ్చారు. గణేశ్ ఆ భూమిని వెబ్‌ల్యాండ్, అడంగల్‌లో నమోదు చేయించుకున్నారు. తన వద్ద మిగిలిన 2.25 ఎకరాల భూమిని కూడా గోరంట్ల తన కుమారుడు గణేశ్‌కు జీపీఏ ఇచ్చారు. దాని ఆధారంగా ఆయన కుమ్మరి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి జీపీఏ రాశారు. ఆయన ఆ భూమిలో 94 ప్లాట్లు వేసి విక్రయించారు.

**గుట్టుగా రిజిస్ట్రేషన్**
కల్లూరు పరిధిలోని సర్వే నంబరు 172లో ఉన్న స్థలాలు ప్రభుత్వ భూములైతే వాటికి సబ్ రిజిస్ట్రారు కార్యాలయ అధికారులు ఎలా



రిజిస్ట్రేషన్ చేశారో అంతుచిక్కడం లేదు.
నిబంధనలకు విరుద్ధంగా మొత్తం 256 రిజిస్ట్రేషన్లు జరిగాయి.
సర్వే నంబర్లు 172/2, 172/1బి2లు నిషేధిత భూముల జాబితాలో ఉన్నా రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం.
దీనిపై నగరానికి చెందిన మురళీధర్‌రెడ్డి అనే వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. కల్లూరు తహసీల్దారు ఆంజనేయులు విచారణ చేశారు.

**ఇలా గుట్టురట్టు**
గోరంట్ల అనే మాజీ సైనికుడికి 1975లో భూమి కేటాయించినట్లు నిర్ధారించేలా తహసీల్దారు కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులేవీ లేవు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ రికార్డుల ఆధారంగా సర్వే నంబరు 172లో మొత్తం 11.95 ఎకరాల భూమి ఉందని, దాన్ని ప్రభుత్వ డ్రై ల్యాండుగా చూపించారని, ప్రభుత్వ భూమి కావడంతో ఆ సర్వే నంబరులోని భూమి మొత్తాన్ని 22(ఎ)లో ఉంచారని నిర్ధారించారు. " అక్రమాలు జరిగిన విషయం వాస్తవమే. ఈమేరకు ఆర్డీవోకు, లోకాయుక్తకు నివేదిక ఇచ్చా. తదుపరి చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు నివేదించామని" తహసీల్దార్ కె.ఆంజనేయులు తెలిపారు.

**అమ్ముకుంటున్నా అటువైపు చూడలేదు**
తప్పుడు పత్రాలు సృష్టించి ప్రైవేటు వ్యక్తులు భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. వాగు బఫర్ జోన్‌లోకి వచ్చే ఆ భూమిని వాస్తవానికి ఎవరికీ కేటాయించకూడదు. దానిని కొందరు చదును చేసి నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేసి విక్రయిస్తున్నా ఎవరూ అటువైపు చూడలేదు. విద్యుత్తు స్తంభాలు, కచ్చా రహదారులూ వేశారు. వాగు కనిపించకుండా గోడకట్టేశారు. నాటి తహ సీల్దారు టి.వి.రమేశ్‌బాబు నిబంధనలకు విరుద్ధంగా ఆ ప్రాంతంలోని కొంత భూమిని మ్యుటేషన్ చేసినట్లు కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.

# చెరువు గట్టున 'భూ'తాలు

నంద్యాల : జిల్లా కేంద్రంలో స్థిరాస్తి వ్యాపారుల అక్రమాలకు అడ్డూఅదుపులేకుండా పోయింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కాజేస్తున్నారు. ఏకంగా చెరువు గట్టును ఆక్రమించుకొని తమ స్థిరాస్తి వెంచర్లలో కలిపేసుకొని విక్రయిస్తున్నారు. నంద్యాల పట్టణ శివారులో పెద్ద చెరువు వందల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ ప్రస్తుతం సెంటు రూ.15 లక్షలు పలుకుతోంది. ఇక్కడ స్థలాలకు డిమాండ్ ఉండటంతో చెరువు చుట్టూ ప్రైవేటు స్థలాల్లో పదుల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. చెరువు దిగువన వెంచర్ల నిర్వాహకులు 'కట్ట'ను తమ దారిగా చూపిస్తున్నారు. సర్వే నంబర్లు 2320, 2321, 2322, 2311, 2312లోని 10 ఎకరాల భూమిని కబ్జా చేశారు. కట్టను ఆక్రమించి, రోడ్లు ఇతర నిర్మాణాలు చేపట్టారు. ఈ స్థలం కేసీ కాల్వ పరిధిలో ఉంటుంది.

**సెంటు రూ.15 లక్షల పైమాటే**
పెద్ద చెరువు దగ్గర వెలిసిన వెంచర్లలో ప్రస్తుతం సెంటు ధర రూ.15 లక్షలుగా ఉంది. ప్రస్తుతం ఆక్రమిత ప్రాంతం సుమారు ఎకరం వరకు ఉంది. అంటే రూ.15 కోట్ల కేసీ కెనాల్ భూమి ఆక్రమణలో ఉంది. కేసీ కెనాల్ పోరంబోకు భూమిని ఆక్రమించి వెంచర్లు వేస్తున్నా.. అధికారులు అనుమతులు ఇవ్వడంతో అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ అండదండలతోనే అక్రమార్కులు చెలరేగిపోతున్నారనే



విమర్శలున్నాయి.

**40 అడుగుల రోడ్డు**
పెద్ద చెరువును ఆనుకొని ఉన్న పోరంబోకు భూమిని తమ వెంచర్లలో కలిపేసుకొన్నారు. ఏకంగా ఫెన్సింగ్ వేసి తమ వెంచర్ల వరకు 40 అడుగుల మేర రహదారి నిర్మించుకున్నారు. కట్ట మీద నుంచి పోరంబోకు భూమి మీదుగా వెంచర్లలోకి వెళ్లే విధంగా దీన్ని నిర్మించడం గమనార్హం. వెంచర్‌దారులు పట్టణ ప్రణాళిక విభాగం, 'కుడా'కు సమర్పించిన పత్రాల్లోనూ చెరువు కట్ట రోడ్డును తమ భూమిగా చూపించి అనుమతులు పొందారు.ఎస్‌బీఐ కాలనీ నుంచి ఎన్జీవో కాలనీ వరకు (పెద్ద చెరువు ఒక వైపు) 6 కి.మీ.ల పొడవునా ఉన్న 40 అడుగుల రోడ్డును ఆనుకుని వెంచర్లు వేసిన వ్యాపారులు కొందరు బండ్‌ను తమకు అనుకూలంగా మలుచుకున్నారు. కట్ట నుంచి వెంచర్లకు బాటలు వేసుకున్నారు. దీన్నే ప్రధాన రహదారిగా చూపుతూ స్థలాలు విక్రయించడంతోపాటు ఇళ్లు నిర్మించారు.

## ధర చూస్తే గుడ్లు తేలేయాల్సిందే

ధర్మవరం: మార్కెట్లో కోడిగుడ్ల ధర రికార్డు స్థాయిలో పెరిగింది. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా బుధవారం హోల్‌సేల్ ఒక్కోటి రూ.7కు, రిటైల్‌గా అయితే రూ.7.50 చేరింది. ఈ లెక్కన డజను గుడ్లు హోల్‌సేల్ కాకుండా బయట అంగళ్లలో రూ.90 పలుకుతుండటంతో వినియోగదారులు గుడ్లు తేలేస్తున్నారు.

గుడ్డు వినియోగం పెరగడం, ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు సాగడమే ఇందుకు కారణం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఒక గుడ్డు రూ.5.75కు విక్రయించారు. నెల రోజులపాటు ఇదే ధర నిలకడగా కొనసాగింది. అక్టోబర్‌లో రూ.25 పైసలు పెరిగి రూ.6కు చేరింది. నవంబరులో ఏకంగా గుడ్డు ధరలకు రెక్కలొచ్చాయి. వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు కురవడం, చలితీవ్రత పెరగడంతో రూ.7కు చేరింది. చికెన్, పొట్టేలు మాంసపు ధరలు పెరుగుతుండ



టంతో పేదలు కోడిగుడ్లపై ఆసక్తి చూపించారు. వాటి ధర పెరగడంతో కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు.

**దిల్లీ, మహారాష్ట్రలకు ఎగుమతి**

ఈ ఏడాది ఉత్తరాది రాష్ట్రాల్లో పౌల్ట్రీ పరిశ్రమ భారీగా దెబ్బతింది. దీంతో కర్ణాటక, బళ్లారి ప్రాంతాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు గుడ్లు ఎగుమతి అవుతున్నాయి. మన జిల్లాకు కూడా అక్కడే నుంచి గుడ్లు సరఫరా అవుతున్నాయి. దీంతో గిరాకీ పెరిగింది. శ్రీసత్యసాయి జిల్లాలో బ్రాయిలర్, లెయింగ్ హెన్స్ (గుడ్లు పెట్టే కోళ్లు) 14.75 లక్షల సంపద ఉంది. వీటిలో గుడ్లు పెట్టే కోళ్ల సంఖ్య కేవలం మూడు లక్షల లోపే ఉండటంతో గుడ్ల ఉత్పత్తి ఆశాజనకంగా లేదు. దీంతో బయట ప్రాంతాల నుంచి గుడ్లను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. చలి తీవ్రత తగ్గే వరకు గుడ్ల ధరలు తగ్గుముఖం పట్టవని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్(నెక్) ప్రతినిధులు చెబుతున్నారు.

## సత్ఫలితం.. పొదుపు మంత్రం

శ్రీకాళహస్తి : విద్యుత్తు పొదుపు.. తద్వారా ఛార్జీల తగ్గింపు దిశగా శ్రీకాళహస్తీశ్వరాలయం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా నెడ్‌క్యాప్ సంస్థ సహకారంతో సోలార్ విద్యుత్తు ఉత్పత్తులతో విద్యుత్తు ఛార్జీలను పొదుపు చేస్తోంది. విద్యుత్తు సంక్షోభ పరిస్థితులను అధిగమించేందుకు వీలుగా ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన సౌర ప్రాజెక్టు ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది.సౌర విద్యుదుత్పత్తి..: ముక్కంటి ఆలయం విస్తరిస్తోంది. ఆలయంతో పాటు అతిథిగృహాలకు సౌర విద్యుత్తును అందుబాటులోకి తెచ్చేలా నాలుగేళ్ల క్రితం ప్రణాళికలు సిద్ధమయ్యాయి. సౌర విద్యుత్తు ప్రాజెక్టు ద్వారా విద్యుత్తు సరఫరాకు నెడ్‌క్యాప్ అంగీకారం తెలిపింది. ఆ ప్రకారం కైలాసగిరుల్లో ముక్కంటి ఆలయ స్థలంలో భారీగా ఫలకాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.



**ఏటా రూ.1.02 కోట్లు ఆదాయం..**

విద్యుత్తు ఉత్పాదన రానున్న రోజుల్లో మరింత కష్టతరంగా మారనుంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అందిపుచ్చుకోవాలన్న దిశగా ముక్కంటి ఆలయం సిద్ధమైంది. అందులో భాగంగా సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటుకు నెడ్‌క్యాప్ సంస్థకు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం కైలాసగిరుల్లోని కొండగుట్టలను చదును చేసి సోలార్ ఫలకాల ఏర్పాటు పూర్తయింది. సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయడంతో పాటు దాన్ని పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. విద్యుత్తు సంస్థలకు యూనిట్‌కు ముక్కంటి ఆలయం రూ.6.07 మేరకు నగదు చెల్లిస్తోంది. నెడ్‌క్యాప్ సౌర ప్రాజెక్టు ద్వారా ప్రస్తుత యూనిట్ రూ.3.99 మేర చెల్లిస్తే సరిపోతుంది. నెలకు రూ.17 లక్షలకు పైగా విద్యుత్తు బిల్లులు చెల్లిస్తున్నారు. అదే సౌర విద్యుత్తుకు రూ.7 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. ఈ ధర 25 ఏళ్ల పాటు స్థిరంగా ఉండేలా నెడ్‌క్యాప్‌తో ఒప్పందం కుదిరింది. తద్వారా సంవత్సరానికి రూ.1.20 కోట్ల మేర విద్యుత్తు బిల్లుల ద్వారా ఆదా అవుతుంది. ఆలయ అతిథిగృహాలు, భరద్వాజతీర్థం తదితర ప్రాంతాల్లో మరిన్ని సౌర విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్తు ఛార్జీల భారం మరింతగా తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

## తెలుగు గంగ.. మట్టి మాఫియా బెంగ

శ్రీకాళహస్తి : తమిళనాడుతో పాటు తిరుపతి, శ్రీకాళహస్తికి తాగునీరు అందించే శ్రీసత్యసాయి తెలుగుగంగ కాలువకు మట్టి మాఫియాతో ముప్పు తప్పేలా లేదు. తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ మల్లిగుంట వద్ద 'గంగ' కాలువను ఆనుకుని యథేచ్ఛగా మట్టి తవ్వుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇలాగే నిర్లక్ష్యంగా వదిలేస్తే 'గంగ' కాలువకు ప్రమాదం తప్పదు.

తెలుగుగంగ కాలువకు ఇరు వైపులా మట్టి తవ్వకాలకు అనుమతి లేదు. ఎందుకంటే యంత్రాల సాయంతో మట్టిని తొలగిస్తే వర్షాకాలంలో కోతకు గురై ప్రమాదం ఏర్పడే అవకాశముంది. కాలువకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే తమిళనాడుతో పాటు మనకు నీటి సరఫరాకు అడ్డంకులు ఏర్పడతాయి. పరిసర పొలాలన్నీ ముంపు బారిన పడతాయి. ఇవన్నీ తెలిసినా అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేస్తుంటే యంత్రాంగం పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదు చేసినా ఫ్..!శ్రీసత్యసాయి తెలుగుగంగ కాలువకు సమీపంలో మట్టి తవ్వకాలు జరుగుతుండటంపై పలు దఫాలు తెలుగుగంగ ఉన్నతాధికారులు రెవెన్యూ, పోలీసు శాఖలకు ఫిర్యాదు చేశారు. రెండు లేదా మూడు నెలలకోసారి మాఫియా విచ్చలవిడిగా మట్టి తరలిస్తోంది. దీన్ని కట్టడి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు అభ్యర్థిస్తున్నారు.

# ప్రకృతి వనరుల దోపిడీపర్వం



తాడిపత్రి : అక్రమ మట్టితవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఎలాంటి అనమతులు లేకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు సాగిస్తుండటంతో ప్రభుత్వ భూములు, కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. తాడిపత్రి మండలం యర్రగుంటపల్లిలో దందా సాగుతోంది. ప్రకృతి వనరుల్ని కొల్లగొట్టి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల నుంచి దక్కాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నా... నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. కొందరు అధికారులు లంచాలకు అలవాటు పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

**కరిగిపోతున్నాయ్..**

యర్రగుంటపల్లి పరిధిలోని కొండలు, గుట్టలు అక్రమ తవ్వకాలకు అడ్డాగా మారాయి. ఎలాంటి అనుమతులను లేకున్నా పలు చోట్ల కొండల్ని కరిగిచించి గ్రావెల్, మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా భారీ యంత్రాల సాయంతో తవ్వకాలు చేపడతూ అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
రోజూ వందకుపైగా ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తరలించి... రహదారుల పనులు, ప్రైవేటు లేఅవుట్ల చదును, ఇతరత్రా అవసరాలకు రవాణా చేసి జేబులు నింపుకొంటున్నారు. టిప్పర్ మట్టికి రూ.6 వేల నుంచి 7 వేల వరకు, ట్రాక్టర్ మట్టిని రూ.2 వేల నుంచి 3వేల వరకు అక్రమార్కులు విక్రయిస్తున్నారు.

**భూములనూ వదల్లేదు పేదల**

ప్రభుత్వం యర్రగుంటపల్లిలో పేదలకు కేటాయించిన స్థలాలలోనూ ఇష్టారాజ్యంగా తవ్వకాలను చేపట్టారు. దీంతో సదరు స్థలాలు కుంటలను తలపిస్తున్నాయి. మరోవైపు అక్కడ తీగలతో ఉన్న విద్యుత్తు స్తంభాల చుట్టూ తవ్వేస్తున్నారు. ఫలితంగా అవి ప్రమాదకరంగా మారాయి. ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోపిడీపర్వం కొనసాగుతున్నా సంబంధిత అధికారులకు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసి.. ప్రకృతి వనరుల్ని కాపాడాలని కోరుతున్నారు.

**అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు**

–సోమశేఖర్, తహసీల్దారు, తాడిపత్రి

గనుల శాఖ అధికారులతో మాట్లాడి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ప్రాంతాలను పరిశీలిస్తాం. అక్రమ రవాణా చేసే వాహనాలను జప్తు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. ఆయా ప్రాంతాలలో రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.

# జీవిత పాఠం.. సాహస కృత్యం!



తాడిపత్రి : జేఎన్‌టీయూలో సాంకేతికవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లుగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన సాహసకృత్యాల శిబిరంలో గోవా, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 50 మంది వాలంటీర్లు పాల్గొన్నారు. అనంత జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషం. జేఎన్‌టీయూలోని సహ ఆచార్యురాలు డాక్టర్ మమత పర్యవేక్షణలో విద్యార్థులు క్యాంప్‌లో పాల్గొన్నారు. బీటెక్ విద్యార్థులు వివిధ సాహసకృత్యాలు ప్రదర్శించారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకొనే నైపుణ్యం సంపాదించారు. ఎముకలు కొరికే చలిలో పర్వతాలు అధిరోహించారు. విభిన్న వాతావరణంలో విశిష్ట కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.

**ఏమి చేశారంటే?**

బీటెక్ పూర్తి చేసి ఇంజినీరు వృత్తికే పరిమితం కాకుండా వాలంటీర్లుగా సేవా కార్యక్రమాలు చేస్తూనే భిన్నమైన పరిస్థితుల అవగాహన కోసం హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్లారు. అక్కడ పర్వతారోహణ, నదులు దాటడం, పడవ నడపటం, తాడుసాయంతో కొండలు ఎక్కడం, దిగడం, తాడుతో తాత్కాలిక వంతెన నిర్మించడం, చలిప్రాంతంలో శిబిరాలు ఏర్పాటు చేయడం వంటివి చేశారు. నిప్పును సృష్టించడం, వ్యర్థాల నిర్వహణ, శుభ్రత పాటించడం, పర్యావరణ పరిరక్షించడం, ఇతర రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవడం, తదితర అంశాలు ఈ శిబిరంలో అభ్యసించారు.

**విపత్తుల వేళ సాయం అందించేలా..** – శేషాద్రి, బీటెక్

శిబిరానికి ఐదు రాష్ట్రాల నుంచి 50 మంది వాలంటీర్లు వచ్చారు. అక్కడ ఎన్నో సాహస కృత్యాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నో విషయాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం నేర్చుకొన్నాం. ఇలాంటి శిబిరాలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని ఇస్తాయి. **మొదట్లో భయపడ్డాం..– హరిత, బీటెక్**

నది పక్కనే మా శిబిరం ఉంది. కొండలు, నదులు, మంచు చూసి భయపడ్డాం. సాహస కృత్యాలు చేయడం సాధ్యమా అనుకున్నాం. కాని అక్కడ నేర్చుకొన్న అంశాలతో పర్వతాలు ఎక్కాం. తాడుసాయంతో నదులు దాటాం, పడవ నడిపా. తీవ్రమైన చలిలోనూ సాహస కృత్యాలు నిర్వహించాం.

# స్వర్ణముఖిని దోచేస్తున్న ఇసుకాసురులు



చంద్రగిరి : ఇటీవల వర్షాలకు స్వర్ణముఖి నది వరదతో పరవళ్లు తొక్కింది. గతంలో నదిలో ఇసుక తోడేయడంతో బావులు తలపించేలా భారీ గుంతలు ఏర్పడ్డాయి. సుమారు 20 నుంచి 30 అడుగుల గుంతల్లోకి వరద ప్రవాహానికి ఇసుక మేటలు ఏర్పడటంతో ఇసుకాసురుల పంట పండింది. పైసా పెట్టుబడి లేకుండా రూ.లక్షలు దోచుకోవడానికి భారీ యంత్రాలతో నదిలోకి చొరబడి పగలూరాత్రి తేడా లేకుండా తవ్వేస్తున్నారు. ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లతో హద్దులు దాటిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు.

**నరశింగాపురం మీదుగా నగరానికి తరలిస్తూ**

మండలంలోని ఎగువరెడ్డివారిపల్లి సమీపంలో సువిశాలంగా ఉన్న స్వర్ణముఖినది నుంచి ఇటు రెడ్డివారిపల్లి, అటు నరశింగాపురం మీదుగా తిరుపతి నగరానికి ఇసుక యథేచ్ఛగా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. నదీపరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా తరలించరాదని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఎద్దుల బండిలో, మనిషి మోతతో ఇసుక తరలించడానికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. మరో వైపు రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలు ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచినా ఇసుకాసురులతో లోపాయికారి ఒప్పందంతో కుదుర్చుకున్న కొందరు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని నదీపరివాహక ప్రాంతాల రైతుల నుంచి సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అన్నదాతల్లో ఆందోళన**

నదిలో ఇసుకను యంత్రాలతో తోడేయడంతో పరిసరాల ప్రాంతాల్లోని వ్యవసాయ బోరుబావులు, నేలబావుల్లో భూగర్భజలాలు తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయని, రాబోయే వేసవికాలంలో పంటలసాగు కష్టతరంగా ఉంటుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంగా రెవెన్యూ అధికారులను వివరణ కోరగా వాల్టా చట్టం మేరకు ఇప్పటివరకు ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇసుక దోపిడీని గుర్తించిన తక్షణమే తమ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపామన్నారు. అప్పటికే అక్కడి నుంచి వాహనాలు వెళ్లిపోయాయని వివరించారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచుతామని, తరలించే వాహనాలను సీజ్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు వివరించారు.

## స్విమ్స్ ప్రాంగణంలో ఆమ్లెట్లు

తిరుపతి : స్విమ్స్ రెసిడెంట్ హాస్టల్(పీజీ) మెస్ క్యాంటీన్‌గా మారింది. విద్యార్థులకు భోజనాలు మాత్రమే అందించాల్సి ఉండగా.. ప్రత్యేక కౌంటర్ ఓపెన్ చేసి అడిగి ఆహార పదార్థాలు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతటితో ఆగక తితిదే ఆధ్వర్యంలో నడిచే స్విమ్స్ యూనివర్సిటీలో కోడిగుడ్డు ఆమ్లెట్లు వేస్తూ అపవిత్రం చేస్తున్నారు. ఇంత జరుగుతుంటే పీజీ వైద్యుల అసోసియేషన్‌కు ఇచ్చేశాం.. మాకేమీ సంబంధం లేదనేలా ఉంది యాజమాన్యం తీరు.

**షెడ్డు వేసుకుని.. కౌంటర్ తెరిచి**

స్విమ్స్ పీజీ మహిళా విద్యార్థుల నిమిత్తం శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల సమీపంలో రెసిడెంట్ హాస్టల్ కొనసాగుతోంది. అందులోని విద్యార్థుల భోజన వసతి కోసం మెస్‌ను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓ కాంట్రాక్టర్‌కు ఉచిత అద్దెతో



భోజన తయారీ బాధ్యత అప్పగించారు. హాస్టల్ వెనుక భాగంలో షెడ్డు వేసుకుని ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. ఫ్రైడ్ రైస్, ఆమ్లెట్లు వేసేందుకు ప్రత్యేక స్టాల్స్ పెట్టారు. వాటిని విక్రయించేందుకు బిల్లింగ్ కౌంటర్ తెరిచారు. పీజీ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాల్సి ఉండగా విక్రయాలు సాగిస్తున్నారు. తితిదే ఆధ్వర్యంలోని ప్రాంగణాల్లో మాంసాహారం నిషేధం ఉంది. కొంతకాలంగా బహిరంగంగా విక్రయిస్తుంటే ఎవరూ పట్టించుకోవడం లేదు.
ఈ విషయంగా స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వీ కుమార్‌ను సంప్రదించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఎర్రపండు మిలమిల

ఎమ్మిగనూరు : మిరప ధరలు ఎగబాకుతున్నాయి. తాలు కాయలకూ మార్కెట్లో మంచి ధర పలుకుతుండటంతో రైతులకు ఊరటనిస్తోంది. రెండేళ్లుగా ధరలు లేక రైతులు కుదేలయ్యారు. ఉమ్మడి జిల్లాలో 40వేల ఎకరాల్లో మిరప వేశారు. జిల్లాలో అధికంగా 30వేల ఎకరాల్లో సాగైంది. పంట చేతికొస్తున్న సమయంలో ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
బోర్లు, కాల్వలు, చెరువుల కింద డీలక్స్, తేజ రకాలు అధికంగా సాగు చేశారు. తెగుళ్లు, పురుగు బెడద లేకుంటే ఎకరానికి 20నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. గత రెండేళ్లుగా తెగుళ్లు, పురుగు ఆశించి దిగుబడులు తగ్గాయి. ఈసారి కూడా తెగుళ్లు, పురుగు ఎక్కువై మందులు అధికంగా చల్లుతున్నారు. గత ఏడాది క్వింటా రూ.10వేల నుంచి రూ.12వేల వరకు అమ్ముడుపోయాయి. ఈసారి గుంటూరు మార్కెట్లో క్వింటా రూ.15వేల నుంచి రూ.17వేలు, బ్యాడిగి మార్కెట్లో క్వింటా రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ధర పలుకుతున్నట్లు వ్యాపారులు తెలిపారు.
ఈ ఏడాది తెగుళ్లు, పురుగు కారణంగా మొదటి కోతగా ఎకరానికి



నాలుగు క్వింటాళ్లు దిగుబడి వస్తే ఇందులో రెండు క్వింటాళ్లకు పైగా తాలు కాయలు ఉన్నాయి. క్వింటా రూ.8వేల నుంచి రూ.11వేల వరకు వ్యాపారులు కొంటున్నారు.
గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటకలో మిరప సాగు తగ్గడం, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో ప్రకృతి వైపరీత్యాలతో మిరప పంట దెబ్బతింది. రాష్ట్రంలోని మిరప నిల్వలు వ్యాపారులు చాలా వరకు ఖాళీ చేయడంతో మార్కెట్లోకి వచ్చే కొత్త పంటకు డిమాండ్ ఏర్పడింది.

**బ్యాడిగి డబ్బి రకం క్వింటా రూ.71వేలు**

కర్ణాటకలోని బ్యాడిగి అంతర్జాతీయ మార్కెట్‌లో డబ్బి రకం క్వింటా రూ.71వేల ధర పలికింది. హొళగుంద, చిప్పగిరి, ఆలూరు, హాలహర్వి మండలాల్లో సాగు చేశారు. డబ్బి బ్యాడిగి మిరపకు మార్కెట్లో మంచి ధర లభిస్తోంది. ఎకరానికి ఐదారు క్వింటాళ్ల దిగుబడి వచ్చినా గిట్టుబాటు అవుతుంది.

## చదువు నెపం.. మత్తు వ్యాపారం

నందికొట్కూరు : చదువుకునేందుకని గదిని అద్దెకు తీసుకున్నారు. గుట్టు చప్పుడుకాకుండా నిషేధిత మాదకద్రవ్యాల తయారీ ప్రారంభించారు. మూడు నెలల పాటు మూడో కంటికి తెలియకుండా మత్తుపదార్థాల వ్యాపారం నిర్వహించారు. ఎట్టకేలకు దీనిపై సమాచారం అందుకున్న నార్కోటిక్ బృందం దాడులు చేపట్టిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుంది. వారి నుంచి 171 గ్రాముల వైట్ పౌడరు, 11.5 కిలోల రసాయనాలు, ల్యాబోరేటరీకి సంబంధించిన పరికరాలను స్వాధీనం చేసుకుంది.

**10 వేల కిలోల సరకు తరలింపు**

నందికొట్కూరుకు చెందిన మాధవ్, శ్రీనివాసులు, సురేష్‌తో పాటు గుంటూరుకు చెందిన నవీన్‌కుమార్ నందికొట్కూరులోని మద్దూరు సుబ్బారెడ్డినగర్‌లో శ్రీచైతన్య పాఠశాలకు ఎదురుగా ఉన్న భవనం పైఅంతస్తులో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. నలుగురూ ఆ గదిలో చదువుకుంటున్నట్లు చుట్టుపక్కల వారిని నమ్మించారు. నిషేధిత మత్తు మందు ఆల్ఫ్రాజోలం తయారీ ప్రారంభించారు. ఇందుకు అవసరమైన రసాయనాలు, పదార్థాలను నకిలీ చిరునామాతో ఆన్‌లైన్ ద్వారా తెప్పించుకొని మత్తు పదార్థాన్ని తయారు చేసి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సరఫరా చేసేవారు. వీరు తయారు చేసిన మత్తు పదార్థం (పౌడరు) కిలో రూ.3 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. మూడు నెలల్లో సుమారు 10 వేల కిలోల సరకు విక్రయించినట్లు సమాచారం. నార్కోటిక్ బృందం దాడి చేసి విక్రేతను పట్టుకుంది.

# కడలిలో చిక్కినా.. ధర దక్కలేదు!

విశాఖ : విశాఖ తూర్పు తీరంలో ట్యూనా చేపల దిగుబడి అధికంగా ఉంది. మత్స్యకారుల వేటలో 50 నుంచి 60 రకాల చేపలు లభ్యమైతే, వాటిల్లో ట్యూనాలు 50 శాతానికిపైగా ఉంటున్నాయి. సరైన మార్కెటింగ్ సదుపాయం లేక, విదేశాలకు ఎగుమతి కావడం లేదు. దేశీయ మార్కెట్‌లో విక్రయిస్తున్నా.. గిట్టుబాటు ధర రావడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు.

**ఏడాది పాటు సర్వే..!**

గత ఏడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు విశాఖ చేపలరేవు, పూడిమడక, కాకినాడ కేంద్రాలుగా లభ్యమైన సముద్ర ఉత్పత్తులపై భారత మత్స్య పరిశోధన సంస్థ (ఎఫ్ఎస్ఐ) శాస్త్రవేత్తలు సర్వే నిర్వహించారు. ఎఫ్ఎస్ఐ విశాఖ జోన్ కార్యాలయం ఇన్‌ఛార్జి సి.ధనుంజయరావు



ఆధ్వర్యంలో శాస్త్రవేత్త జీవీ.ప్రసాద్ కీలక పరిశోధనలు చేశారు.

ఇదీ పరిస్థితి..: విశాఖ కేంద్రంగా 120 మర పడవల ద్వారా ట్యూనాల వేట సాగుతోంది. ట్యూనాలో పసుపురెక్కల సూరలు, నామాల సూరలు ఉంటాయి. రోజూ చేపలరేవుకు 100 టన్నుల ట్యూనాలు వస్తున్నాయి. సముద్ర జలాల్లో 70 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించిన తర్వాత ట్యూనాలు లభ్యమవుతున్నాయి. ట్యూనాల తర్వాత కొమ్ముకోనాం చేపలు అధికంగా దొరుకుతున్నాయి.ట్యూనా చేపలు కిలో ధర ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. అవి కేరళ, తమిళనాడు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.విదేశీ మార్కెటింగ్‌తోనే ప్రయోజనం: ట్యూనాలకు మార్కెటింగ్ సదుపాయంతో పాటు, శీతల గిడ్డంగులు, శుద్ధి చేసే యూనిట్లు అందుబాటులోకి తీసుకురావాలి. పోషకాలు ఎక్కువగా ఉండడంతో... అమెరికా, జపాన్, యూరప్, దక్షిణ ఆసియా దేశాల్లో ట్యూనాల వినియోగం అధికంగా ఉంది. అక్కడకు ఎగుమతి చేస్తే మంచి ధర లభిస్తుంది.- ధనుంజయరావు, జీవీ.ప్రసాద్ (ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్తలు)

# నిగ్గు తేల్చమంటే నీరుగార్చారు!

అనకాపల్లి : మాకవరపాలెం మండలంలో వందల ఎకరాలకు నీరు అందించే పాపయ్యపాలెం జలాశయం అక్రమార్కుల కన్నుపడి బక్కచిక్కిపోతోంది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం కనీసం పట్టించుకోకపోవడంతో కబ్జాపర్వం కొనసాగుతోంది. జలాశయ భూములు చదును చేసి.. సరుగుడు, అరటి తోటలు వేస్తున్నారు. అధికారులేమో ఆక్రమణలేనంటూ అక్రమార్కులను వెనకేసుకొస్తున్నారు.పాపయ్యపాలెం రిజర్వాయర్ సుమారు 90 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని నుంచి పాపయ్యపాలెం, బుచ్చెయ్యపాలెం, మునిసిపాలెం పరిసర ప్రాంతాల్లోని సుమారు 500 ఎకరాలకు నీరందుతుంది. గత తెదేపా హయాంలో రిజర్వాయర్ స్థలాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించారు. దీంతోపాటు రూ. 70 లక్షలకు పైగా ఖర్చుచేసి.. పంటకాలువలు, మదుములు అభివృద్ధి చేశారు. తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రిజర్వాయర్ భూముల్లో ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. మూడేళ్ల క్రితం కొంతమంది 15 ఎకరాలకు పైగా చదునుచేసి ఆక్రమించుకుని సరుగుడు తోట వేసుకున్నారు. దీనిపై గతంలో ఎన్నిసార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. కొన్నాళ్ల క్రితం కొన్నాళ్ల క్రితం అన్ని పార్టీల నేతలూ కుమ్మక్కయి మరో 16 ఎకరాలను



ఆక్రమించి యంత్రాలతో చదును చేశారు. అప్పట్లో దీనిపై స్థానికంగా దుమారం రేపింది. తెదేపాకు చెందిన పలువురు నేతలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు.

పాపయ్యపాలెం జలాశయ భూముల ఆక్రమణపై పత్రికల్లో కథనాలు రావడంతో శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు స్పందించి జలాశయం మొత్తాన్ని సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. కానీ.. ఒక్క సెంటు స్థలం కూడా కబ్జాకు గురవ్వలేదని తేల్చారు. అక్రమార్కులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయి తూతూమంత్రంగా సర్వే చేశారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. జలాశయం పరిధిలో సాగుచేస్తున్న పంటలు కళ్లముందే కనిపిస్తున్నా.. ఆక్రమణలు లేవంటూ ప్రకటించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక కమిటీ వేసి సమగ్రంగా జలాశయాన్ని సర్వే చేసి.. ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

**త్వరలో హద్దుల్లో రాళ్లు పాతిస్తాం..:**

రిజర్వాయర్ ఆక్రమణలపై కొన్నాళ్ల క్రితం అందిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాం. ఆర్ఐ, ఏఈ, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్ఓ లతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసి.. సర్వే చేశాం. సెంటు స్థలం కూడా కబ్జాకు గురవ్వలేదు. త్వరలో హద్దుల్లో రాళ్లు పాతిస్తాం.

- వెంకటరమణ, తహసీల్దారు, మాకవరపాలెం

# అదే దందా.. ఉచితం వీలుందా?



చిత్తూరు : ఇసుక భారం వినియోగదారులపై ఏమాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వం సీనరేజీ ఎత్తేసి తవ్వకాలు, నిర్వహణ, స్టాక్ పాయింట్‌కు ఇసుక తెచ్చినందుకు అయ్యే ఖర్చు మాత్రమే వసూలు చేయాలని ఆదేశించినా ప్రయోజనం లేకుండా పోతోంది. అవసరమైన నిల్వలు లేక నిర్మాణదారులపై భారం పెరుగుతోంది. బలమున్న వారికే ప్రవేశంతిరుపతి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోయింది. స్థానిక ప్రజాప్రతినిధులు ఇందులో కీలకపాత్ర పోషిస్తున్నారు. నదులు, వాగులు, వంకల్లో ఎవరైనా వెళ్లి ఇసుక తీసుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసినా నాయకులు అడ్డు తగులుతున్నారు. మీరు ట్రాక్టరు మాట్లాడుకుని అడిగిన డబ్బు మాకు చెల్లించండి.. మేమే ఇంటికి పంపిస్తామని చెబుతున్నారు. నేతలను కాదని డ్రైవర్లు నదుల్లోకి అడుగుపెట్టే సాహసం చేయడం లేదు. దాంతో శ్రీకాళహస్తి, చంద్రగిరి, గూడూరు నియోజకవర్గాల్లో ట్రక్కు ఇసుకకు రూ.3-4వేలు చెల్లిస్తున్నారు. అదే ప్రభుత్వం స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ ఉంచితే వినియోగదారులకు రవాణాతో కలిపి రూ.2-3 వేలకే లభిస్తుంది. దగ్గర్లో నిల్వ కేంద్రముంటే రూ.2వేలలోపే దొరుకుతుంది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలోని ఆరు స్టాక్ పాయింట్లలో 1,560 టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది.

**అన్నమయ్య జిల్లా నుంచి తెప్పించక**

చిత్తూరు జిల్లాలో పెద్దగా నదులు లేవు. నీవా, కుశస్థలిలో కొంతవరకు లభిస్తున్నా అధికార బలమున్న నేతలే విక్రయిస్తున్నారు. గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో స్థానిక నేతలే పెత్తనం చెలాయిస్తున్నారు. దాంతో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరవుతున్నాయి. అన్నమయ్య జిల్లాలోని నందలూరు రేవు నుంచి గతంలో ఇసుక తెప్పించగా ఇప్పుడు నిలిచిపోయింది. ప్రస్తుతం వర్షాలను సాకుగా చూపుతున్నారు. అంతకుముందయినా తెప్పించారా? అంటే అదీ లేదు. జిల్లాలోని మూడు స్టాక్ పాయింట్లలో ప్రస్తుతం 18వేల టన్నులు మాత్రమే నిల్వ ఉంది. పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో చెరువుల్లోని మట్టితో ఇసుక తయారు చేసి విక్రయిస్తున్నారు.


**ఉక్కుపాదం మోపితేనే..**

అక్టోబరు వరకు నదుల్లో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంది. ప్రస్తుతం తవ్వి తరలించవచ్చు. అయినా గనులశాఖ యంత్రాంగం దీని గురించి పెద్దగా పట్టించుకోవడలేదు. ఇది అక్రమ రవాణాదారులకు వరంలా మారింది. దీనికి అడ్డుకట్ట పడాలంటే స్లాక్ పాయింట్లలో నిల్వలు పెంచడంతోపాటు అక్రమ రవాణాపై రెవెన్యూ, గనులు, పోలీసు శాఖ ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.

చిత్తూరు జిల్లాలోని స్టాక్ పాయింట్లు 3, నిల్వలు 18వేల టన్నులు

తిరుపతి జిల్లాలోని స్టాక్ పాయింట్లు 6, నిల్వలు 1,560 టన్నులు

# దారి తప్పిన టెండరు



నంద్యాల : జిల్లా కేంద్రం ఆర్అండ్‌బీ శాఖకు చెందిన రహదారి పనులను అస్మదీయులకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు నివ్వెర పరుస్తున్నాయి. ఏళ్లుగా ఉన్న సమస్యను సరిదిద్దేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గుత్తేదారులు ముందుకొచ్చారు కానీ..కొందరు నేతలు కొర్రీలు పెట్టడంతో ముందుకు సాగడం లేదు. నంద్యాల పట్టణంలో రెండు రహదారుల పనులకు రూ.18 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తయినా.. పనులు ప్రారంభం కావడం లేదు. ఇందులో ఓ పనికి ఏకంగా మంత్రి, ఉన్నతాధికారులు నెలల క్రితమే శంకుస్థాపన చేశారు. అస్మదీయ గుత్తేదారులకే పనులు కట్టబెట్టేందుకు ఆర్అండ్‌బీ శాఖలో ప్రయత్నాలు పనులకు ఆటంకంగా మారాయి.

9 ఈ రెండు రహదారులు ముగ్గురు ప్రజాప్రతినిధుల మధ్య 'దూరం' పెంచేలా ఉన్నాయి.

**ఆ గుత్తేదారుడిని కాదని..**

బొమ్మలసత్రం-నూనెపల్లె రహదారిని 2.6 కి.మీ.ల పొడవునా అభివృద్ధి చేయడానికి ఎండీఆర్ కింద రూ.13.4 కోట్లతో టెండర్లు పిలిచారు. మూడేళ్ల కిందట అంచనా వ్యయం కన్నా 4.9 శాతం ఎక్కువకు ముందుకు వచ్చిన గుత్తేదారునికి పనులు అప్పగించారు. ఈ మార్గంలోని ఆక్రమణలు తొలగించడంలో జాప్యంతో పనులు నిలిచిపోయాయి. పనులను గాడిలో పెట్టేందుకు ఇటీవల కార్యాచరణ ప్రారంభమైంది. గుత్తేదారుడు సిద్ధంగా ఉన్నప్పటికీ కొంతమంది నాయకులు చక్రం తిప్పి మరో గుత్తేదారునికి పనులు అప్పగించేందుకు పావులు కదుపుతున్నారు. 60 సీ క్లాజ్‌ను తెర పైకి తీసుకొచ్చి అస్మదీయ గుత్తేదారునికి అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై పక్క నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి అభ్యంతరం చెబుతున్నారు.

**రూ.4.5 కోట్ల పని రద్దు**

ఎండీఆర్ ప్లాన్ కింద సంజీవనగర్-శ్రీనివాసనగర్ రహదారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. నలుగురు గుత్తేదారులు పోటీ పడ్డారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన గుత్తేదారునికి పనులు దక్కాయి. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నాలుగు నెలల కిందట శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాకపోగా.. కొద్ది రోజుల క్రితం టెండరును రద్దు చేశారు. మరోసారి టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంచనా వ్యయం కన్నా తక్కువ వేసిన గుత్తేదారునికి పనులు అప్పగించకుండా తన అనుచరుడైన అస్మదీయ గుత్తేదారునికే కట్టబెట్టేందుకు రద్దు చేశారనే ఆరోపణలున్నాయి.

# చెత్తకుప్పలో కాసుల వేట

కర్నూలు : పల్లె నిధులు పంచేసుకొన్నారు. పారిశుద్ధ్యం పేరుతో పక్కదారి పట్టించారు. దస్త్రంలో తప్పుడు లెక్కలు రాసి తప్పించుకొంటున్నారు.. గత ఐదేళ్లుగా పంచాయతీల్లో జరిగిన అక్రమాల బాగోతం ఒక్కోటి వెలుగులోకి వస్తోంది. పంచాయతీ పీఠంపై కూర్చున్న వైకాపా నేతలు లెక్కా పత్రం లేకుండా నిధులు ఖర్చు పెట్టారు.. అవన్నీ బోగస్‌గా తేలిపోయాయి. ఆడిటింగ్‌లో ఇవన్నీ వెలుగులో వచ్చాయి.

**అక్రమాలు 'చెత్త'గించవలెను**

గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులకు సాధారణ నిధులు(జనరల్ ఫండ్) 15 శాతం, 15వ ఆర్థిక సంఘం నుంచి 50 శాతం వరకు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంది. దీన్ని అవకాశంగా కొందరు సర్పంచులు, కార్యదర్శులు కలిసి అక్రమాలకు పాల్పడ్డారు. పత్తికొండ, వెల్దుర్తి, కోడుమూరు వంటి మేజర్ పంచాయతీల్లో ఈ దందా ఎక్కువగా కొనసాగింది. పారిశుద్ధ్య పనులకు నిధులు ఖర్చు చేసినట్లు బిల్లులు చూపించారు. ఇవన్నీ సమీప బంధువుల దుకాణాల నుంచి తెప్పించినవేనని..ఇలాంట బిల్లుల విలువ రూ.1.50 కోట్ల వరకు ఉన్నట్లు ఆడిట్‌లో తేలింది.

**అనుమతుల్లేకుండానే నియామకాలు**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు పంచాయతీల్లో ఉన్నతాధికారుల అనుమతులు లేకుండానే పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. జిల్లా సర్వోన్నతాధికారి అనుమతితో డీపీవో ఆదేశాలతో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించుకోవాలి. ఇవేమీ లేకుండానే ఇష్టారాజ్యంగా నియమించుకున్నారు.

నంద్యాల జిల్లాలోని పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీలో ముగ్గురిని అనుమతి లేకుండా నియమించి, నెలకు రూ.15వేల చొప్పున చెల్లిస్తున్నారు. కానాల మేజర్ పంచాయతీల్లో ఇద్దరిని, కోవెలకుంట్ల, కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం పంచాయతీల్లో ఇలానే నియామకాలు జరిగాయి. వీరంతా ఆయా గ్రామాల సర్పంచులకు కావాల్సిన వారు.

దేవనకొండలో 34 మంది సిబ్బందికి ఏటా రూ.32.25 లక్షలు, మంత్రాలయంలో 34 మందికి ఏకంగా ఏడాదికి రూ.40.14 లక్షలు చెల్లిస్తుండటం గమనార్హం. కోడుమూరులో అయితే 48 మంది కోసం రూ.58.15 లక్షలు వెచ్చిస్తున్నారు.

**ఇదిగో అక్రమాల చిట్టా**



వెల్దుర్తి పంచాయతీకి ఏటా రూ.76 లక్షల ఆదాయం సమకూరుతుంది. 42 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఏటా రూ.54 లక్షలు చెల్లిస్తున్నట్లు దస్త్రాల్లో రాసుకొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్మికులకు పొంతన లేదు. లేని కార్మికులను పనిచేస్తున్నట్లు చూపి రూ.25 లక్షల వరకు స్వాహా చేశారు. దీనిపై విచారణ జరుగుతోంది.

రూ.1.28 కోట్ల ఆదాయం వచ్చే పత్తికొండలో 82 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు 'లెక్కలు' రాశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అందుకు విరుద్ధంగా ఉంది.

కోవెలకుంట్ల పంచాయతీకి ఏటా రూ.2 కోట్ల ఆదాయం ఉంది. 44 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు దస్త్రంలో రాసుకొన్నారు. వీరికి ఏటా రూ.40 లక్షలకు పైగా వేతనాలు చెల్లిస్తున్నారు. వాస్తవంగా ఇక్కడ పనిచేస్తుంది 30 మంది మాత్రమే. రుద్రవరం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులను ఎవరినీ తీసుకోకుండానే మూడేళ్లుగా కార్మికుల పేరుతో రూ.10 లక్షలు పక్కదారి పట్టించారు.

పంచాయతీలు 970

మేజర్ పంచాయతీలు 38

ఏటా ఆదాయం రూ. 37.5 కోట్లు

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.60.85 కోట్లు

పారిశుద్ధ్యం కోసం వెచ్చిస్తున్న నిధులు రూ.8.1 కోట్లు

# స్వచ్ఛత ఆశయం.. చక్కని ప్రోత్సాహం

నర్సీపట్నం : పల్లెల్లో ఇటు స్వచ్ఛతకు అటు రైతులకు మేలు జరిగే కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకంలో చేపడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఐదు వేల గెత్తం గుంతలు (కంపోస్టు పిట్స్) తవ్వాలని తొలుత లక్ష్యంగా నిర్దేశించారు. నాలుగు రోజుల కిందట 45 వేల గుంతల తవ్వకాలు చేపట్టాలని లక్ష్యాన్ని పెంచారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

మండలాల్లో ఏ పల్లెకు వెళ్లినా రోడ్ల పక్కన పశువుల ఎరువు కుప్పలు కనిపిస్తుంటాయి. పశువుల పేడ, గడ్డి ఇతర వ్యర్థాలను గుట్టలుగా వేస్తుంటారు. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే సమయంలో సేంద్రియ ఎరువుగా పొలాలకు తరలిస్తారు. అప్పటివరకు ఇవన్నీ రోడ్ల పక్కనే ఉంటాయి. వర్షం పడితే వాటి నుంచి దుర్గంధం వెలువడుతుంటుంది. స్వచ్ఛత కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్న నేపథ్యంలో



ఇవి ఇబ్బందికరంగా మారాయి.

రైతులే తమ సొంత జాగాల్లో మూడు మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు, మీటరు లోతున గొయ్యి తవ్వుకుని వాటిలో పశువుల ఎరువు, గడ్డి వేసేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఇందుకోసం ఐదు పని దినాలను కూలీలకు మస్తరుగా ఇస్తున్నారు. తమ జాగాలోనే గుంతలు తవ్వుకోవడానికి అవకాశం ఇవ్వడం, దూరంగా వేసుకుని ఇబ్బంది పడే బదులు తమ కల్లాల వద్దే నిల్వ చేసుకునేందుకు వీలుండడంతో చాలామంది రైతులు ముందుకు వస్తున్నారు. పశువులతోపాటు మేకలు, గొర్రెలు పెంచుకునే వారికీ గుంతలు తవ్వుకోవడానికి అవకాశం ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. తద్వారా రోడ్ల పక్కన ఎరువుల కుప్పలు తగ్గుతాయని, పల్లెలు స్వచ్ఛంగా కనిపిస్తాయని అభిప్రాయపడుతున్నారు.తాజాగా పంట కుంటల లక్ష్యాన్నీ పెంచారు. తొలుత 7,500 లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పుడు అదనంగా ఐదు వేల కుంటలు తవ్వాలని ఆదేశాలొచ్చాయి. మెట్ట భూముల్లో వీటిని ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పున తవ్వితే వర్షపు నీరు నిల్వ ఉండటంతోపాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. పొలం గట్లపై కాయగూరలు, ఆకుకూరలు, మునగ, అరటి చెట్లకు నీరందుతుంది.

# రెండే పండాయి.. మిగతావి ఎండాయి!

కనిగిరి : విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించి నకిలీలు అరికట్టాలి.... మట్టి నమూనాలు విశ్లేషించి భూసార పరీక్ష ఫలితాలు వెల్లడించాలి.... ఇలా రకరకాల సేవలు రైతులకు అందించాల్సిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు అలంకారప్రాయంగా మారడమే కాకుండా మూపపడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో భవనం, ప్రయోగ పరికరాలు కలిపి రూ.కోటి చొప్పున వెచ్చించి ఏర్పాటు చేశారు. ఇంత చేసినా ప్రస్తుతం జిల్లాలో రెండు అగ్రి ల్యాబ్‌లలో మాత్రమే పరీక్షలు జరుగుతుండడం గమనార్హం.

**పరీక్షలకు తూట్లు...**

కనిగిరి, మార్కాపురం, సింగరాయకొండ, గిద్దలూరు, దర్శి, సంతనూతలపాడు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని ఏఎంసీలకు అనుసంధానంగా ల్యాబ్‌లు నిర్మించారు. ఒక్కో భవనం నిర్మాణం, పరికరాలకు నాబార్డు నిధులు వెచ్చించారు. రైతులు పండించే వివిధ రకాల పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షలు చేసి నాణ్యమైన సేవలందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. గిద్దలూరు, దర్శిలలో మాత్రమే నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నారు. మిగతా చోట్ల మూతపడగా, మార్కాపురంలోని భవనం పునాదుల్లోనే నిలిచిపోయింది.

**తాళాలు పడ్డాయి**

కనిగిరి, సింగరాయకొండ, సంతనూతలపాడు, యర్రగొండపాలెం



అగ్రిల్యాబ్‌లు వివిధ కారణాలతో మూతపడ్డాయి. దీంతో 7 నెలలుగా పరీక్షలు నిలిచిపోయాయి. ఇక్కడున్న సిబ్బందిని మరో చోటకు బదిలీ చేశారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు, వ్యాపారులు, బయట మార్కెట్లో రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఇవి ఎంత మేరకు నాణ్యమైనవి? ఎంత శాతం మొలక వస్తుంది.? తెలుసుకోవాలంటే అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయాల్చి ఉంటుంది. సేవలు అందుబాటులో లేనందున రైతులు బయట కొనుగోలు చేసిన విత్తనాలు అలాగే వినియోగిస్తూ చాలా సందర్భాల్లో నష్టాలపాలవుతున్నారు. ఈ విషయమై డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో అగ్రిల్యాబ్‌లు మూతపడిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

# ఉజ్వల యోజన అందుకుందాం

సీఎస్‌పురం : కట్టెలు, బొగ్గుల పొయ్యిల నుంచి వచ్చే విషపూరిత పొగను పీల్చకుండా మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం తీసుకొచ్చింది. అదే ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై). గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఈ పథకాన్ని పునఃప్రారంభించారు. పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువ నున్న పేద మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. సిలిండరుకు రూ.1,700, రెగ్యులేటరుకు రూ.150, మీటరు పైపు రూ.100, గ్యాస్ పుస్తకం రూ.25, ఇంట్లో బిగించేందుకు రూ.75 కలిపి మొత్తం రూ.2,050 ఆయిల్ కంపెనీలే భరిస్తాయి. మొదటి సిలిండరు ఉచితం. అనంతరం తీసుకునే సిలిండరుపై కేంద్ర ప్రభుత్వం రూ.300 రాయితీ ఇస్తుంది. పథకం అమలుకు జిల్లా ఉన్నతాధికారులు, గ్యాస్ ఏజన్సీల నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. రేషన్ కార్డులో పేర్కొన్న పేరుపై ఎటువంటి గ్యాస్ కనెక్షన్ ఉండకూడదు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు సమర్పించాలి.రేషన్‌కార్డున్న వలస కార్మికులు సంబంధిత పత్రాలు జత పరచాలి.నెలకు రూ.10 వేలు కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారు అనర్హులు. ఇందుకు రెవెన్యూశాఖాధికారులతో ఆదాయ ధ్రువీకరణ పత్రం జతపరచాలి.అర్హులైన పేద మహిళలు ఏజెన్సీల వద్దకు వెళ్లి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.14.2 కిలోల సింగిల్ సిలిండరు లేదా 5 కిలోలుండే రెండు సిలిండర్లు పొందవచ్చు.

చురకలు






## జాన్వి కపూర్ టాలీవుడ్ ఆశలు..!

శ్రీదేవి తనయురాలు జాన్వి కపూర్ కెరీర్ ఆశించిన స్థాయిలో కొనసాగట్లేదని చెప్పొచ్చు. దడక్ తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి రెండు మూడు సినిమాల దాకా హడావిడి చేసిన ఈ అమ్మడు ఆ తర్వాత ఎందుకో కెరీర్ మీద అంత గ్రిప్ సాధించలేకపోయింది. ఇక సౌత్ ఎంట్రీగా తెలుగులో ఎన్టీఆర్ తో దేవర సినిమా చేసింది ఈ అమ్మడు. ఐతే ఆ సినిమాలో తంగం పాత్రలో జస్ట్ సాంగ్స్ కోసం తప్ప అమ్మడిని సరిగా వాడుకోలేదు. ఐతే దేవర 2 వస్తుందని ఎదురుచూడటం తప్ప చేసేదేమి లేకుండా పోయింది.

**చరణ్, జాన్వి కపూర్ జోడీ.. చిరంజీవి, శ్రీదేవి జంట..** ఈలోగా చరణ్ బుచ్చి బాబుతో చేస్తున్న పెద్ది సినిమాలో ఛాన్స్ అందుకుంది అమ్మడు. ఏడాది కాలంగా ఆ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. చరణ్, జాన్వి కపూర్ జోడీ చిరంజీవి, శ్రీదేవి జంటని తలపించేలా ఉంటుందని అంటున్నారు. జాన్వి కపూర్ కూడా పెద్దితో ఒక మంచి బ్రేక్ రావాలని కోరుకుంటుంది. అమ్మడు లాస్ట్ ఇయర్ హిందీలో 3 సినిమాలు చేసింది. అందులో హోం బౌండ్ కాస్త క్లిక్ అయ్యింది. ఆ తర్వాత వచ్చిన పరం సుందరి, సన్నీ సన్స్కారి కి తులసి కుమారి కూడా డిజప్పాయింట్ చేసింది. ప్రస్తుతం పెద్ది తప్ప అమ్మడి ఖాతాలో మరో సినిమా లేదు. బాలీవుడ్ కన్నా టాలీవుడ్



ని నమ్ముకుంటే బెటర్ అని భావిస్తుందట జాన్వి కపూర్. ఎందుకంటే శ్రీదేవి తనయురాలిగా జాన్వికి ఆల్రెడీ తెలుగులో సూపర్ క్రేజ్ ఉంది. తను చేస్తా అంటే చాలు కానీ వరుస ఛాన్స్ లు ఇచ్చేందుకు రెడీగా ఉన్నారు మేకర్స్. ఆమధ్య నాని సినిమాలో జాన్వి నటిస్తుందని వార్తలు వచ్చాయి కానీ అది జస్ట్ రూమర్ అని తెలిసింది.

**పెద్దిలో అచ్చియమ్మ రోల్ లో..** ఐతే కాస్త కాన్సెంట్రేట్ చేస్తే జాన్వికి తెలుగులో మంచి అవకాశాలు వస్తాయి. పెద్ది హిట్ పడితే జాన్వి తెలుగులో బిజీ అవ్వడం గ్యారెంటీ అని చెప్పొచ్చు. పెద్దిలో అచ్చియ్యమ్మ రోల్ లో నటిస్తున్న జాన్వి కపూర్ ఈసారి కేవలం గ్లామర్ పరంగానే కాకుండా యాక్టింగ్ తో కూడా తెలుగు ఆడియన్స్ ని ఇంప్రెస్ చేస్తుందని అంటున్నారు. బుచ్చి బాబు హీరోయిన్ క్యారెక్టరైజేషన్ ని కూడా ఇంట్రెస్ట్ గా ఉండేలా రాసుకున్నాడట. సో పెద్దితో బ్రేక్ వస్తే కచ్చితంగా జాన్వికి టాలీవుడ్ లో ఛాన్స్ లు క్యూ కట్టేస్తాయని చెప్పొచ్చు. జాన్వి కపూర్ కూడా తెలుగులో సినిమా అంటే కేవలం గ్లామర్ పాత్రలే కాకుండా మంచి నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఆశిస్తుంది.

ఛాలెంజింగ్ రోల్స్ తో తనని ప్రూవ్ చేసుకోవాలని అనుకుంటుంది అమ్మడు. ఎలాగు ఎన్టీఆర్, చరణ్ లతో నటించింది కాబట్టి స్టార్ ఛాన్స్ లు క్యూ కడతాయి. ఐతే తెలుగులో టైర్ 2 హీరోలతో కూడా జాన్వి చేస్తే మాత్రం మంచి కథలు ఆమె దగ్గరకు వచ్చే ఛాన్స్ ఉంటుంది. మరి జాన్వి ప్లానింగ్ అయితే బాగానే ఉంది కానీ పెద్ది తర్వాత కెరీర్ ఎలా ఉంటుందో చూడాలి.

## శ్రీలీలలో మార్పు.. ఇష్టం లేకపోయినా సరే అలా..!

స్టార్ హీరోయిన్ శ్రీలీల నెక్స్ట్ మాస్ జాతరతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ధమాకా తర్వాత రవితేజ తో కలిసి శ్రీలీల చేసిన సినిమా ఇది. అందుకే ఈ సినిమా మీద చాలా హైప్ ఉంది. ఐతే మాస్ జాతరలో తనది ఒక ప్రత్యేకమైన పాత్ర అంటుంది అమ్మడు. మాస్ పాత్రలు చేయాలని ఉంటుంది కానీ తనకు అలాంటి రోల్స్ రావట్లేదని చెబుతుంది శ్రీలీల. ఇక ఈమధ్య తన లుక్ లో మార్పుల వెనక సీక్రెట్ బయట పెట్టింది శ్రీలీల.

**లుక్ మీద చాలా ఫోకస్ చేస్తున్నట్టు..** వరుస స్టార్ సినిమాలతో బిజీ అయిన శ్రీలీల సరైన డైట్ పాటించక కాస్త బొద్దుగా మారింది. అంతేకాదు ఆమెకు అమ్మమ్మ వాళ్లు చేసే అరిసెలు అంటే చాలా ఇష్టమట. ఒంగోలు నుంచి అరిసెలు వస్తే మొత్తం ప్యాకెట్ తినేదాకా లేచేది కాదట శ్రీలీల. ఐతే ఇప్పుడు అలా తినడం మానేసి తన లుక్



మీద చాలా ఫోకస్ చేస్తున్నట్టు చెప్పుకొచ్చింది శ్రీలీల. అందుకే ఈమధ్య అమ్మడు పూర్తిగా స్లిమ్ లుక్ అయ్యింది. ఫుడ్ విషయంలో కండీషన్స్ అప్లై చేసుకుంటున్నా.. ఒక డాక్టర్ గా ఎలాంటి ఫుడ్ తీసుకుంటే బెటర్ అని తెలుసు కాబట్టి అలాంటి ఫుడ్ తోనే మెయింటైన్ చేస్తున్నా అంటుంది శ్రీలీల. తనను చూడటానికి థియేటర్ కి వచ్చే ఆడియన్స్ కి బాగా కనిపించాలి కదా అంటూ తనలో ఈ మార్పు వెనక రీజన్ చెప్పింది శ్రీలీల. రవితేజ మాస్ జాతరలో శ్రీలీల నిజంగానే ప్రేక్షకులను ఇంప్రెస్ చేసేలా ఉంది. తెలుగులోనే కాదు బాలీవుడ్ లో శ్రీలీల తెరంగేట్రం చేసింది. కార్తీక్ ఆర్యన్ తో ఆమె చేస్తున్న సినిమా ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది.

**గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు అభినయానికి ప్రాధాన్యత..** తెలుగులో టాప్ స్టార్స్ తో నటిస్తున్న శ్రీలీల తనకు పోటీగా వస్తున్న భామలకు టఫ్ ఫైట్ ఇచ్చేందుకు ఇక మీదట గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు అభినయానికి ప్రాధాన్యత ఉన్న రోల్స్ కూడా చేయాలని ఫిక్స్ అయ్యింది. ఐతే శ్రీలీల అనగానే ఆడియన్స్ అందరికీ ఆమె డాన్స్ మాత్రమే గుర్తొచ్చేలా చేసిన ఈ అమ్మడు లేటెస్ట్ స్లిం లుక్ తో మరింత సర్ ప్రైజ్ చేస్తుంది. సౌత్ నుంచి బాలీవుడ్ కి వెళ్లిన హీరోయిన్స్ చాలా తక్కువ ఉన్నారు. ఐతే శ్రీలీల మాత్రం తనకంటూ ఒక సెపరేట్ మార్క్ ఉండేలా చూస్తుంది. కార్తీక్ ఆర్యన్ తో తొలి సినిమా సైన్ చేసిన అమ్మడు మరో రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నట్టు తెలుస్తుంది. శ్రీలీల అటు తమిళ్ లో కూడా పరాశక్తి సినిమాలో ఛాన్స్ అందుకుంది. శివ కార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమాలో రవి మోహన్, అథర్వ మురళి కూడా నటించారు.

## మా ఇంటి బంగారం టీజర్.. మాటల్లేవ్ అంతే..!




సౌత్ స్టార్ హీరోయిన్ సమంత నుంచి వస్తున్న లేటెస్ట్ సినిమా మా ఇంటి బంగారం. తను మొదలు పెట్టిన ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ లోనే ఈ సినిమా వస్తుంది. మా ఇంటి బంగారం సినిమాకు సమంత భర్త రాజ్ నిడిమోరు సపోర్ట్ చేస్తున్నారు. నందిని రెడ్డి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ లేటెస్ట్ గా రిలీజైంది. ఇక ఈ టీజర్ చూస్తే ఒక పెద్ద ఇంటికి కోడలిగా వచ్చిన అమ్మాయి ఓ పక్క చాలా ఇన్నోసెంట్ గా కనిపిస్తుంది. మరోపక్క విలన్లను మడతపెట్టేస్తుంది.

**రెండు వేరియేషన్స్ ఉన్న రోల్ లో సమంత..** ఈ రెండు వేరియేషన్స్ ఉన్న రోల్ లో సమంత అదరగొట్టేసింది. ముఖ్యంగా ఫ్యామిలీ మ్యాన్ 2లో ఆమె చేసిన యాక్షన్ ఎపిసోడ్స్ ఆడియన్స్ ని ఇంప్రెస్ చేశాయి. వాటికి ఏమాత్రం తీసిపోని విధంగా మా ఇంటి బంగారం సినిమాలో కూడా సమంత యాక్షన్ సీక్వెన్సెస్ ఉన్నాయని అనిపిస్తుంది. సమంత బస్సులో ఫైట్ సీన్ నెక్స్ట్ లెవెల్ అనిపిస్తుంది. మొత్తానికి మా ఇంటి బంగారం సినిమా టైటిల్ విచిత్రంగా ఉంది సినిమా కథ ఎలా ఉంటుంది అనుకున్న ఆడియన్స్ కి టీజర్ తో సర్ ప్రైజ్ చేశారు. నందిని రెడ్డి, సమంత క్లోజ్ ఫ్రెండ్స్.. ఐతే కొన్నాళ్లుగా నందిని రెడ్డికి సరైన బ్రేక్ రావట్లేదు. అందుకే సమంతతో కలిసి మా ఇంటి బంగారం సినిమాతో సక్సెస్ అందుకోవాలని చూస్తుంది. మా ఇంటి బంగారం టీజర్ అయితే ఇంప్రెస్ చేసింది. సమంత మరోసారి తన సత్తా చాటేలా కనిపిస్తుంది. ఇక ఈ సినిమాకు సమంత భర్త రాజ్ నిడిమోరు వెనుక సపోర్ట్ గా ఉండటం మరింత స్ట్రెంగ్త్ అవుతుంది. మొత్తానికి సమంత కంబ్యాక్ ఒక రేంజ్ లో ఉండేలా ఉందని ఈ టీజర్ చూస్తేనే అర్థమవుతుంది.

**కంటెంట్ బాగుంటే చాలు ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు కూడా..** ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ లో సమంత మొదటి సినిమాగా శుభం చేసింది ఐతే ఆ సినిమాలో సమంత ఒక రోల్ చేసింది. ఐతే ఈసారి మా ఇంటి బంగారం సినిమాలో తనే లీడ్ రోల్ లో నటిస్తుంది. కంటెంట్ బాగుంటే చాలు ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు కూడా సూపర్ హిట్ అవుతాయని ఇంతకుముందు చాలా సినిమాలు ప్రూవ్ చేశాయి. మా ఇంటి బంగారం టీజర్ లోనే కథ హింట్ ఇచ్చారు కాబట్టి మరి సినిమా ఎంతవరకు ప్రేక్షకులను అలరిస్తుందో చూడాలి.

సమంత ఎప్పుడు కొత్త సినిమాతో వచ్చినా ఆమె ఎంచుకునే కథలు.. చేసే పాత్రలు సర్ ప్రైజ్ చేస్తాయి. నటిగా ఇప్పటికే ఎంతో మంచి క్రేజ్ తెచ్చుకున్న సమంత ఈసారి మా ఇంటి బంగారం తో తనలోని యాక్షన్ మోడ్ ని కూడా చూపించి ప్రేక్షకుల చేత సూపర్ అనిపించుకోవాలని చూస్తుంది.

## రెడ్ డ్రెస్ లో యువత మనసు దోచుకుంటున్న కాత్యాయిని!






'లిటిల్ హార్ట్స్: నో టచింగ్.. ఓన్లీ హార్ట్ టచింగ్' అనే ట్యాగ్ లైన్ తో 2025 సెప్టెంబర్ 5న థియేటర్లలో చిన్న సినిమాగా విడుదల అయింది. రొమాంటిక్ కామెడీ సినిమాగా వచ్చిన ఈ చిత్రానికి ఈటీవీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఆదిత్య హాసన్ నిర్మించారు. సాయి మార్తాండ్ దర్శకత్వంలో మౌళి తనూజ్, శివాని నాగారం, రాజీవ్ కనకాల, అనిత చౌదరి, ఎస్ ఎస్ కాంచీ తదితరులు కీలకపాత్రలు పోషించారు. చిన్న సినిమాగా వచ్చి ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. అక్టోబర్ 1 నుండి ఈటీవీలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఈ సినిమాలో కాత్యాయిని పాత్ర పోషించి, తన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది శివాని నాగారం. అదృష్టం తలుపు తడితే ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీ అయిపోవచ్చు అనడానికి ఈమె కూడా ఒక చక్కటి ఉదాహరణ అని చెప్పవచ్చు. 2024లో అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ అనే సినిమాతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈమె మొదటి సినిమాతోనే గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఊహించిన పాపులారిటీ రాలేదనే చెప్పాలి. ఇక ఇప్పుడు లిటిల్ హార్ట్స్ సినిమాతో కాత్యాయిని పాత్ర పోషించి భారీ క్రేజ్ దక్కించుకుంది అని చెప్పవచ్చు.

ఇందులో తన అద్భుతమైన నటనతో అందరి హృదయాలను దోచుకుంది. అంతేకాదు కుర్రకారు క్రష్ గా కూడా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం హే భగవాన్ అనే సినిమాలో అవకాశం అందుకుంది. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మరొకవైపు సోషల్ మీడియాలో తన క్రేజ్ పెంపొందించుకోవడానికి పలు రకాల ఫోటోలు షేర్ చేస్తోంది. అందులో భాగంగానే రెడ్ కలర్ డ్రెస్ ధరించిన ఈమె అందులో ఘాటు మిర్చిలా అందాలతో ఆకట్టుకుంది. తాజాగా ఈ రెడ్ కలర్ ఫ్రాక్ శివాని నాగారం మేని ఛాయను మరింత పెంచేసింది అని చెప్పవచ్చు. ఈమెను ఇలా చూసేసరికి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తమ అభిమాన బ్యూటీ రోజుకు మరింత అందంగా మారిపోతుంది అంటూ కామెంట్ చేస్తున్నారు. శివాని నాగారం లిటిల్ హార్ట్స్ సినిమాలోని పాత్ర తనకు మంచి పేరు అందించింది అని తన ఇంస్టాగ్రామ్ ప్రొఫైల్ ని కూడా కాత్యాయినిగా పెట్టుకుంటానంటూ తెలిపింది ..అంతే కాదు ఇకపై స్క్రీన్ నేమ్ కూడా ఇదే అంటూ చెప్పిన ఈమె.. మరి వచ్చే సినిమాకు ఇదే పేరును కొనసాగిస్తుందా లేక శివాని పేరుగా కంటిన్యూ అవుతుందా అన్నది తెలియాల్సి ఉంది. శివాని నాగారం 1998 ఆగస్టు 25వ తేదీన హైదరాబాద్లో జన్మించింది. ఈమె నటి మాత్రమే కాదు గాయని కూడా.. 2024 లో వచ్చిన ఆరంభం అనే సినిమాలో పాట పాడి మంచి పేరు దక్కించుకుంది . ఏది ఏమైనా చేసింది తక్కువ సినిమాలే అయినా ఈ తెలుగమ్మాయికి అవకాశాలు వరుసగా రావాలి అని అభిమానులు కోరుకుంటున్నారు.

## వింటేజ్ లుక్ లో శ్రీలీల అందాలు.. ఆమెను గుర్తు చేసిందిగా!

శ్రీలీల హీరోయిన్ గా.. శివ కార్తికేయన్ హీరోగా చేస్తున్న చిత్రం పరాశక్తి. ఆకాశమే నీ హద్దురా, గురు వంటి చిత్రాలకు దర్శకత్వం వహించి మంచి బ్లాక్ బస్టర్ విజయాలను తన ఖాతాలో వేసుకున్న ప్రముఖ లేడీ డైరెక్టర్ సుధా కొంగర దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఇకపోతే రేపు థియేటర్లలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో గందరగోళం నెలకొంది. దీనికి తోడు తెలుగులో ప్రభాస్ హీరోగా నటించిన ది రాజాసాబ్, జనవరి 9న విడుదల అవ్వగా.. అటు జనవరి 12న చిరంజీవి మన శంకర్ వరప్రసాద్ గారు సినిమాలో విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలోని తెలుగులో థియేటర్లు దొరక్కపోవడంతో ఈ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్ నిలిపివేశారు. పైగా ఈనెల 23న విడుదల చేసే అవకాశాలున్నట్లు సమాచారం. ఇక కనీసం తమిళనాడులో అయినా విడుదల చేస్తారని అభిమానులు అనుకోగా.. ఇప్పుడు సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో పరిస్థితి మొత్తం మారిపోయింది. ఇదిలా ఉండగా.. పరాశక్తి సినిమా ప్రమోషన్స్ లో భాగంగా తమిళనాడులో నిన్న ఒక ఈవెంట్ నిర్వహించారు. అందులో శ్రీలీల స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. వింటేజ్ లుక్ ను తలపిస్తూ..



బ్లాక్ సారీ , జడలో గులాబీ పువ్వుతో కనిపించి అభిమానులను మెస్మరైజ్ చేసింది. ఇకపోతే వింటేజ్ లుక్ లో కనిపించిన శ్రీ లీలను చూసి దివంగత నటీమణి సావిత్రిని గుర్తు చేసింది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు మొత్తానికైతే పరాశక్తి ఈవెంట్లో చాలా అందంగా ముస్తాబయి స్పెషల్ అట్రాక్షన్ గా అందరి దృష్టిని ఆకర్షించింది శ్రీ లీల. ప్రస్తుతం ఈమెకు సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. శ్రీ లీల సినిమాల విషయానికొస్తే.. గత ఏడాది మాస్ మహారాజా రవితేజతో మరోసారి జతకట్టింది. అయితే వీరిద్దరి కాంబినేషన్లో ఇదివరకే వచ్చిన ధమాకా సినిమా మంచి విజయాన్ని అందుకుంది.దీంతో కచ్చితంగా మాస్ జాతర సినిమా కూడా సక్సెస్ అవుతుందని అభిమానులు ఊహించారు. కానీ ఇది డిజాస్టర్ గా నిలిచింది. ఈ సినిమా తర్వాత ప్రస్తుతం ఈమె నటిస్తున్న చిత్రం పరాశక్తి .ఇది తమిళ్ మూవీ. అలాగే తెలుగులో డబ్బింగ్ వెర్షన్లో విడుదల కాబోతోంది. మరోవైపు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటిస్తోంది. పవన్ కళ్యాణ్ హీరోగా, హరీష్ శంకర్ దర్శకత్వంలో 13 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్లో వస్తున్న మూవీ ఇది. దీంతో ఈ సినిమాపై కూడా అంచనాలు పెరిగిపోయాయి. ఇందులో శ్రీలీలతో పాటు రాశీ ఖన్నా కూడా కీలకపాత్ర పోషిస్తుంది. అలాగే ఈమె హిందీలో కూడా ఆషికి 3లో నటిస్తోంది. మొత్తానికైతే వరుస సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న శ్రీలీలకి ఈ చిత్రాలు ఎలాంటి సక్సెస్ ను అందిస్తాయో చూడాలి.

## సంచలన ఫ్రాంచైజీలో పండగ చేస్కో బ్యూటీ!

ఆగ్రా బ్యూటీ సోనాల్ చౌహాన్ కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటి వరకూ ఒకేలా సాగుతోన్న సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, బెంగాలీ, తమిళ్ అంటూ నాలుగు భాషల్లోనూ నటించింది. కానీ ఏ భాషలోనూ నిలదొక్కుకోలేదు. ఎక్కడ అవకాశం వస్తే అక్కడకు వెళ్లి పని చేయడం తప్ప! తనకంటూ ఓ భాష ఉందని నిరూపించుకోలేకపోయింది. అవకాశాలు వస్తున్నా? వాటితో పాటు చిన్నా చితకా విజయాలు అందుకుంటున్నా? స్థిరంగా మాత్రం పని చేయలేకపోతుంది. అయితే ఏడాది కాలంగా ఆ చిన్న పాటి అవకాశాలు కూడా లేవు. చివరిగా గత ఏడాది రిలీజ్ అయిన 'డార్డ్' లో నటించింది. ఆ తర్వాత మళ్లీ మరో సినిమా చేయలేదు. ఈ నేపథ్యంలో అమ్మడు ఏకంగా బంపర్ ఆఫర్ అందుకుంది. సంచలన 'మీర్జాపూర్' ఫ్రాంజెజీలో భాగమవుతుంది. 'మీర్జాపూర్ : దిఫిల్మ్' చిత్రంలో భాగమైనట్లు వెల్లడించింది. అద్భుతమైన ఆటను మార్చే ప్రయాణంలో భాగం కావడం సంతోషంగా ఉందంది. ఈ సినిమాలో నటించడానికి



ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపింది. గుర్మీత్ సింగ్ దర్శకత్వంలో ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వానీ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'మీర్జాపూర్' కు ప్రత్యేకమైన అభిమానులున్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా ఫాలోయింగ్ ఉన్న సిరీస్ ఇది. పంకజ్ త్రిపాఠీ, అలీ జాఫర్, దివ్యేందు, శ్వేతా త్రిపాఠీ నటించిన 'మీర్జాపూర్' ఫ్రాంచైజీ మూడు సీజన్లు పెద్ద విజయం సాధించాయి. ఇప్పుడిదే సిరీస్ ను గుర్మీత్ సింగ్ సినిమా గా తెరపైకి తేవడం విశేషం. మరి ఈ కథను ఒకే సినిమా గా రిలీజ్ చేస్తాడా? రెండు భాగాలుగా రిలీజ్ చేస్తారా? అన్నది చూడాలి. సినిమాలో వెబ్ సిరీస్ పాత తారగణంతో పాటు, కొత్త నటీనటులు నటిస్తున్నారు. దీనిలో భాగంగా వెబ్ సిరీస్ లో సోనాల్ చౌహాన్ లేకపోయినా? సినిమా లో అవకాశం అందుకో గలిగింది. మీర్జాపూర్ ప్రాంతంలో అధికార పోరాటాలు, నేరస్థుల అండర్ వరల్డ్ కథకు కొనసాగింపుగా ఈ కథ ఉంటుంది. ఇదొక క్రైమ్ థ్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అవి పూర్తి యిన వెంటనే పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా మొదలయ్యే అవకాశలున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536